ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 26.06.2025 | సంపుటి : 11 సంచిక : 338 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# కార్పొరేట్‌కు దీటుగా..



## ప్రభుత్వ పాఠశాలలు పెరుగుతున్న అడ్మిషన్లు

### విద్యావ్యవస్థను పటిష్టం చేయాలి

- జిల్లాల్లోని ఐఏఎస్ అధికారులు వారానికి రెండు పాఠశాలలను సందర్శించాలి
- పాఠశాలల్లో అవసరమైన మేర నూతన గదులు నిర్మించాలి
- పాఠశాలల్లో సోలార్ కిచెన్లు ఏర్పాటు చేయాలి
- పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరూ ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలి
- విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సీఎం సూచించారు. విద్యా శాఖపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 48 వేల మంది చేరారని అధికారులు సీఎంకు వివరించారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మిగతా 2లో..

### తెలంగాణ రైజింగ్ 2047 అద్భుతం

ఈ విజన్ నిర్దేశించుకున్న లక్ష్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి

ప్రశంసిస్తూ సీఎం రేవంత్‌కు టోనీ బ్లెయిర్ లేఖ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రైజింగ్-2047ను ప్రశంసిస్తూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ లేఖ రాశారు. .ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా టోనీ బ్లెయిర్‌తో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ రైజింగ్ విజన్ 2047గురించి ఆయనకు వివరించిన విషయం తెలిసిందే. పెట్టుబడులు, ఐటీ, మిగతా 2లో..

### తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాలు ప్రతీక

- ఉత్సవాలతో పండుగ వాతావరణం
- రాష్ట్ర ప్రజలకు సీఎం శుభాకాంక్షలు
- నిర్వహణ కోసం రూ.20కోట్ల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

12

# 3 నెలల్లో పంచాయతీ ఎన్నికలు




## నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు

### 30 రోజుల్లో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలి

### 2024 జనవరిలోనే గడువు ముగిసినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని ప్రశ్న.. ధర్మాసనం తీర్పుతో ఎన్నికలపై తొలగిన అనిశ్చితి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న అనిశ్చితి తొలగింది. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. సెప్టెంబర్ 30లోగా తప్పనిసరిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. గత కొంత కాలంగా గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ స్థానాలకు ఎన్నికలు జరగకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్త పరుస్తున్నారు. ఈ అంశంపై ఆరుగురు మాజీ సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. వారు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన అనంతరం హైకోర్టు ఈ తీర్పును వెల్లడించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వ తరఫున న్యాయవాదులు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయడానికి కనీసం మరో 30 రోజుల గడువు అవసరం అని తెలపడంతో హైకోర్టు ఆ అభ్యర్థనని పరిగణనలోకి తీసుకుంది. దీనితో రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత, ఎన్నికల నిర్వహణకు మరో 60 రోజులు కావాలన్న రాష్ట్ర ఎన్నికల సంఘం అభ్యర్థనకు కూడా కోర్టు అంగీకారం తెలిపింది. దీనివల్ల కలిపి గరిష్ఠంగా 90 రోజుల లోపుల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనితో, 2025 సెప్టెంబర్ 30వ తేదీ లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై పడనుంది. స్థానిక పాలన లోపిస్తున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, ప్రజాప్రతినిధులు లేని పాలన వల్ల గ్రామీణాభివృద్ధి ఇబ్బందిగా మారుతుందని పిటిషనర్లు కోర్టును ఆశ్రయించా రు. తమ గ్రామాలలో నూతన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడం, పథకాల అమలు జాప్యం కావడం వల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వారు కోర్టుకు విన్నపించుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. గ్రామపంచాయతీ ఎన్నికలు 3 నెలల్లో నిర్వహించాలని, 30 రోజుల్లో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం తీర్పు వెలువరించారు. మిగతా 2లో..



# మిషన్ శుభారంభం



## భారత అంతరిక్ష చరిత్రలో మరో కొత్త అధ్యాయం

### యాక్సియం-4 మిషన్‌లో భాగంగా రోదసిలోకి బయల్దేరిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా

ఆయనతో మరో ముగ్గురు ఆస్ట్రోనాట్స్ కూడా నింగిలోకి పయనం..

'నమస్తే ఇండియా.. మీరంతా నా వెంటే' అంటూ అంతరిక్షం నుంచి మెసేజ్

వాషింగ్టన్(జనంసాక్షి): భారత అంతరిక్ష చ రిత్రలో మరో కొత్త అధ్యాయం మొదలైంది. విశ్వవినువీధుల్లో దేశ కీర్తిపతాక రెపరెపలాడే మధురఘట్టం ఆవిష్కృతమైంది. కోట్లమంది భారతీయుల ఆకాంక్షలు, శుభాశీస్సులను గుండెల నిండా నింపుకొని మన వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసిలోకి పయనమ య్యారు. ఆయనతో కలిసి మరో ముగ్గురు వ్యోమగాములను తీసుకుని యాక్సియం-4 నింగిలోకి దూసుకెళ్లింది. ఫ్లోరిడాలోని నాసా కెన్నెడీ స్పేస్‌సెంటర్‌లో బుధవారం మధ్యాహ్నం 12:01 గంటలకు (భారత కాలమానం ప్రకారం) చేపట్టిన ఫాల్కన్ 9 రాకెట్ విజయవంతంగా అంతరిక్షంలోకి వెళ్లింది. కొద్ది క్షణాల తర్వాత రాకెట్ నుంచి వీరి క్యాప్సుల్ విడిపోయి ఐఎస్ఎస్ దిశగా ప్రయాణం కొనసాగించింది. వాస్తవానికి ఈ ప్రయోగం మే 29న జరగాల్సి ఉన్నప్పటికీ పలు దఫాలుగా వాయిదాపడుతూ వస్తోంది. నేడు కూడా ఈ ప్రయోగానికి కొన్ని నిమిషాల ముందు సమస్య తలెత్తగా.. శాస్త్రవేత్తలు దాన్ని సరిచేయడంతో అంతా సవ్యంగా జరిగింది. కాగా కోట్లాది మంది భారతీయుల ఆకాంక్షలను మోసుకుంటూ భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా రోదసిలోకి వెళ్లారు. మిగతా 2లో..



ఫాల్కన్-9 రాకెట్ క్యాప్సూల్‌లో వ్యోమగాములు

### మీ ప్రయాణంపై దేశం మొత్తం గర్వంగా ఉంది

ఇది భారత అంతరిక్ష చరిత్రలో మైలురాయి

శుభాంశు శుక్లా రోదసియాత్రపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ హర్షం 2లో

## ఎన్డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా కాళేశ్వరంకు

# మరమ్మతులు

### బనకచర్లను చట్టపరంగా అడ్డుకుంటాం



- 30 న ప్రజాభవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- సత్వరమే నాగార్జున సాగర్ లో పూడికతీతకు ఆదేశాలు
- నీటిపారుదల శాఖలో త్వరలో పదోన్నతులు, బదిలీలు
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్ఎల్‌బిసి పునరుద్ధరణ
- రాష్ట్ర నీటిపారుదల శాఖకు ఇద్దరు సైనికాధికారులు
- అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బంకచర్లను చట్టపరంగా అడ్డుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణా రైతాంగం ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూడడమే తమ ముందున్న కర్తవ్యమని ఆయన తేల్చిచెప్పారు ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణా ప్రాంత ప్రయోజనాలు ఏ విధంగా దెబ్బ తింటాయో, నష్టం ఎలా వాటిల్లుతుందో నన్న అంశంలో బలమైన వాదనలు వినిపించి ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలువరిస్తామన్నా రు. బుధవారం మధ్యాహ్నం ఎర్రమంజిల్ కాలనీ లోని నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయంలో నీటిపారుదల శాఖా ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇ.ఎన్.సి మహమ్మద్ అంజత్ హుస్సేన్, ఇ. డిప్యూటీ ఇ. ఎన్.సి శ్రీనివాస్ లతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్ తో తెలంగాణాకు మిగతా 2లో..

## బనకచర్లపై బహిరంగ చర్చకు సిద్ధం

### వేదిక ఏదైనా సరే.. మీరే నిర్ణయించండి

### సీఎం రేవంత్,మహేశ్‌కుమార్‌లకు హరీశ్ సవాల్



సిద్దిపేట(జనంసాక్షి): బనకచర్ల ప్రాజెక్ట్ గురించి కాంగ్రెస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి 18 నెలల పాలన చూశాక కాంగ్రెస్ పార్టీ అంటే ఏంటో ప్రజలకు అర్థమైందని చెప్పారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలి, కావాలని ప్రజలు అంటున్నారని తెలిపారు. మళ్లీ పదేళ్ల దాకా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుండా రేవంత్‌రెడ్డి చేశారని అన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదని హరీష్‌రావు ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే నిర్వహించడం లేదని ఆరోపించారు. బుధవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం యూత్ కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల ప్రశాంత్ పాటిల్ మిగతా 2లో..



## మా అణుస్థావరాలు ధ్వంసమయ్యాయి

### అమెరికా దాడుల్లో మా అణుకేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి

### ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘయీ కీలక వ్యాఖ్యలు

టెహ్రాన్(జనంసాక్షి): ఇరాన్‌లోని మూడు అణుకేంద్రాలే లక్ష్యంగా అమెరికా ఇటీవల విరుచుకుపడింది. శక్తిమంతమైన బంకర్ బస్టర్ బాంబులు, తోమహాక్ క్షిపణులు ప్రయోగించింది. మరోవైపు.. ఇజ్రాయెల్ సైతం దాడులు చేపట్టింది. ఇవి ఆ కేంద్రాలను ఎంతవరకు దెబ్బతీశాయనే విషయం మాత్రం తెలియరాలేదు. ఈ క్రమంలోనే ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘయీ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ అణుకేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు ధ్రువీకరించారు. 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరిట ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణుకేంద్రాలపై బీ-2 స్పిరిట్ బాంబర్లతో అమెరికా భారీ దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో ఆయా అణుకేంద్రాలు నాశనమయ్యాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించారు. అయితే, సంబంధిత అణుకేంద్రాలకు వాటిల్లిన నష్టంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వాటిని ధ్వంసం చేయాలంటే అమెరికా ప్రయోగించిన బాంబుల స్థాయి సరిపోదని చైనా నిపుణులు తెలిపారు. ఇరాన్‌కు పరిమితంగానే నష్టం వాటిల్లిందని ఇంటెలిజెన్స్ నివేదికలను ఉటంకిస్తూ కథనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాల నడుమే ఇస్మాయిల్ బఘయీ ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ.. అగ్రరాజ్య దాడులతో తమ అణుకేంద్రాలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు మిగతా 2లో..

### అణుశక్తిపై చట్టబద్ధమైన హక్కులను కాపాడుకుంటాం

- అణ్వాయుధాలు తయారు చేయాలనుకోవడం లేదు
- ప్రకటించిన ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజిష్కియాన్
- ఐఏఈఏలో భాగస్వామ్యం కాబోం.. ఇకపై ఆ సంస్థతో కలిసి పనిచేయం.. ఆ దేశ పార్లమెంట్ తీర్మానం

వార్త 2లో

### ఇరాన్ యురేనియం శుద్ధి చేస్తే మళ్లీ దాడులు చేస్తాం : ట్రంప్



## మెట్రోపై కేంద్రం మొండివైఖరి

ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు

తాజాగా క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరం : మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ముగ్గురు కేంద్రమంత్రులను మిగతా 2లో..

## ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా..

### కేంద్రకేబినెట్ తీర్మానం ఆమోదం

### దేశవ్యాప్తంగా పలు కీలక ప్రాజెక్టులకు నిధులు విడుదల



న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఎమర్జెన్సీ బాధితులకు నివాళిగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించిన క్యాబినెట్.. అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించింది. శుభాంశు శుక్లాతో కూడిన మిషన్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతిస్తూ చేసిన మరో తీర్మానానికి ఆమోదం తెలిపిన మంత్రివర్గం పుణె, ఆగ్రాలలో పలు ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇంటర్నేషనల్ పొటాటో సెంటర్ లో భాగంగా రూ.111.5 కోట్లతో దక్షిణాసియా ప్రాంతీయ పరిశోధనా కేంద్రాన్ని ఆగ్రాలో ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పుణె మెట్రో రైలు విస్తరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మిగతా 2లో..

### ది ఎమర్జెన్సీ డైరీస్

అత్యవసర పరిస్థితి రోజుల్లో తన ప్రయాణాన్ని వివరించే ఓ పుస్తకం రానున్నట్లు ప్రకటించిన ప్రధాని మోదీ 9లో

నాటి అనుభవాలను అందులో పొందుపరచనున్నట్లు వెల్లడి

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
26.06.2025

## మా అణుస్థావరాలు ధ్వంసమయ్యాయి

అంగీకరించారు. అయితే.. పూర్తి వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. పదేపదే జరిగిన దాడులతో తమ అణుకేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఇది మాత్రం స్పష్టమని తెలిపారు. ఇరాన్ అణుసంస్థ, ఇతర ఏజెన్సీలు పరిస్థితిని అంచనా వేస్తున్నా యని చెప్పారు.అంతకుముందు.. తమ అణుకేంద్రాల భద్రతకు హామీ ఇచ్చే దాకా అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ)కు సహకారాన్ని నిలిపి వేయాలని ఇరాన్ పార్లమెంట్ తీర్మానించిన విషయం తెలిసిందే. "ఇరాన్ అణుకేంద్రాలపై జరిగిన దాడులను ఖండించేందుకు ఐఏఈఏ నిరాకరించింది. దీంతో విశ్వసనీయతను వేలానికి పెట్టినట్లైంది" అని పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలిబాఫ్ వ్యాఖ్యానించారు.

## అణుశక్తిపై చట్టబద్ధమైన హక్కులను కాపాడుకుంటాం

టెహ్రాన్(జనంసాక్షి): ఇరాన్- ఇజ్రాయెల్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో పశ్చిమాసియా శాంతించింది. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజిష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాలు తయారుచేయాలనేది తమ లక్ష్యం కాదన్నారు. అయితే, శాంతియుత ప్రయోజనాల కోసం అణుశక్తి ఉపయోగించుకునే చట్టబద్ధమైన హక్కులను కాపాడుకుంటామని వెల్లడించారు.కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్‌తో పెజిష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. 'ఇరాన్ తన చట్టబద్ధమైన హక్కులకు కట్టుబడి ఉంది. మా దేశం ఎప్పుడూ అణ్వాయుధాలను సంపాదించడానికి ప్రయత్నించలేదు. అది కోరుకోము కూడా. ఇరాన్ ఎలాంటి సంఘర్షణలు కోరుకోవడం లేదు. అయితే, మా హక్కులను వదులుకోవడానికి సిద్ధంగా లేము. చర్చలతో అన్ని సమస్యలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నాం' అని పెజిష్కియాన్ పేర్కొన్నట్లు ఇరాన్ మీడియా పేర్కొంది. గత 12 రోజులుగా ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం సాగిన సంగతి తెలిసిందే. దీంతో పశ్చిమాసియాలో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని తొలుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీనితర్వాత కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని ఇరాన్ మీడియా పేర్కొంది. అటు నెతన్యాహు కూడా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు.

ఇక ఐఏఈఏలో భాగస్వామ్యవ కాబోం

ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన 24 గంటల్లోనే ఇరాన్ కీలక నిర్ణయం తీసుకొంది. ఇక మీదట అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ)కు ఏమాత్రం సహకరించకూడదని నిర్ణయించింది. ఇరాన్ పార్లమెంట్ ఈ నిర్ణయానికి అనుకూలంగా ఓటు వేసింది. దీనికి ఆ దేశ సుప్రీం నేషనల్ కౌన్సిల్ ఆమోద ముద్ర వేయాల్సి ఉంది."ఇరాన్ అణు కేంద్రాలపై జరిగిన దాడులను ఖండించడానికి అంతర్జాతీయ అణు శక్తి సంస్థ నిరాకరించింది. దీంతో విశ్వసనీయతను వేలానికి పెట్టినట్లైంది" అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలిబాఫ్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తమ అణు కేంద్రాల భద్రతకు గ్యారెంటీ ఇచ్చే దాకా ఐఏఈఏకు సహకారాన్ని నిలిపివేయాలని పార్లమెంట్ తీర్మానించింది. తాజాగా ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ జరగడాన్ని అంతర్జాతీయ అణు శక్తి సంస్థ స్వాగతించింది. ఈ యుద్ధం జరిగినన్ని రోజులు ఐఏఈఏ ఇన్‌స్పెక్టర్లు ఇరాన్‌లోనే ఉన్నారు.ఈ నెల 22వ తేదీ తెల్లవారుజామున అమెరికా బాంబర్ విమానాలు ఇరాన్‌లోని నతాంజ్, ఫోర్డో, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై భారీ ఎత్తున దాడి చేశాయి. ఈ క్రమంలో అమెరికా బంకర్ బస్టర్లను ప్రయోగించింది. ఇవి ఆ కేంద్రాలను ఎంతవరకు దెబ్బ తీశాయనే విషయం మాత్రం తెలియరాలేదు. కొన్ని అమెరికా పత్రికలు మాత్రం ఫోర్డో కేంద్రం స్వల్పంగానే దెబ్బతిన్నట్లు చెబుతున్నాయి. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పందిస్తూ.. ఇరాన్‌పై దాడి చెప్పుకోదగిన స్థాయిలో నష్టం జరిగిందన్నారు. దీంతో ఆ దేశ అణు కార్యక్రమం చాలా వెనక్కి వెళ్లినట్లు తెలిపారు.

## ఇరాన్ యురేనియం శుద్ధి చేస్తే మళ్లీ దాడులు చేస్తాం: ట్రంప్

న్యూయార్క్(జనంసాక్షి): ఇరాన్ యురేనియం శుద్ధి చేయడానికి దూరంగా ఉండాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. టెహ్రాన్ మరోసారి అణ్వాయుధ కార్యక్రమం జోలికి వెళితే మళ్లీ దాడులు చేస్తామని హెచ్చరించారు. ఇరాన్ మద్దతున్న సాయుధ ముఠాల ఆర్థిక మూలాలపై ఇజ్రాయెల్ దాడులు తీవ్రత పెంచిన సమయంలో అమెరికా అధ్యక్షుడి నుంచి ఈ హెచ్చరికలు రావడం గమనార్హం. ఇక ఇజ్రాయెల్ వాయుసేన దక్షిణ లెబనాన్‌లోని అల్ సాదిక్ కరెన్సీ ఎక్స్ఛేంజి అధిపతి అబ్దుల్లా బక్రిని హతమార్చింది. ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ నుంచి వచ్చే డబ్బును ఈ సంస్థ హెజ్‌బొల్లాకు మళ్లిస్తుంది.మరోవైపు "యుద్ధం ఆగాలని ఇజ్రాయెల్ , ఇరాన్ సమానంగా కోరుకున్నాయి. ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలు, అణు సామర్థ్యాలను ధ్వంసం చేయడం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఆ తర్వాతే యుద్ధాన్ని ఆపా" అని ట్రంప్ సోషల్ మీడియాలో పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో కాల్పుల విరమణకు సాయం చేస్తానని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆఫర్ చేసినట్లు అమెరికా అధినేత ట్రంప్ వెల్లడించారు. అయితే.. తాను ఆ ఆఫర్‌ను తిరస్కరించినట్లు చెప్పారు. ఆయన నెదర్లాండ్‌లో ప్రారంభం కానున్న నాటో సదస్సుకు వెళుతున్న సందర్భంగా 'ఎయిర్‌ఫోర్స్ వన్'లో జర్నలిస్టులకు ఈ విషయాన్ని వివరించారు. "రష్యాతో ఓ ఒప్పందం కుదుర్చుకోవాలనుకొంటున్నాను. ఇటీవల పుతిన్ నాకు ఫోన్ చేసి 'ఇరాన్ యుద్ధంలో సాయం చేయమంటారా..?' అని అడిగారు. ఇరాన్ విషయంలో నాకు సహాయం అవసరం లేదని చెప్పాను. మీ విషయంలోనే నాకు సాయం కావాలి" అని అన్నట్లు ట్రంప్ తెలిపారు.నాటో సదస్సులో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని కలిసే అవకాశాలున్నట్లు చెప్పారు. ప్రస్తుతం అతడు ఎన్నడూ లేనంత ఇబ్బందికర పరిస్థితిలో ఉన్నట్లు పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య సంధి కుదిర్చి మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధానికి ముగింపు పలకనున్నట్లు వెల్లడించారు. గత వారం ఆ యుద్ధంలో ఆరు వేల మంది సైనికులు చనిపోయినట్లు ట్రంప్ పేర్కొన్నారు.

## కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతులను పాఠశాలల్లో కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. మధ్యాహ్న భోజనం తయారీకి సంబంధించి గ్యాస్, కట్టెల పొయ్యిల బాధల నుంచి మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు విముక్తి కల్పించాలని... సోలార్ కిచెన్ల ఏర్పాటుపై తక్షణమే దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు తెలియజేశారు. పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఇంటర్మీడియట్‌లో నమోదు అవుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఎక్కువ ఉండడంపై ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా కచ్చితంగా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ అనంతరం జీవనోపాధికి అవసరమైన స్కిల్డ్ కోర్సుల్లో శిక్షణ పొందవచ్చని.. తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఏ.శ్రీదేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.హరిత తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైజింగ్ 2047 అద్భుతం

ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో లక్ష్యాల గురించి ఆయనతో చర్చించారు. ఈ నేపథ్యంలో టోనీ బెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్, తెలంగాణ మధ్య అవగాహన ఒప్పందం కుదరగా.. రైజింగ్ విజన్ రూపకల్పన, అమలుకు లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను ఇరువైపుల ప్రతినిధులు మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రైజింగ్ 2047 తనను ఆకట్టుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డిని అభినందించిన టోనీ ఈ విజన్‌కు సహకరిస్తామని తెలిపారు. తెలంగాణ రైజింగ్-2047పై సీఎం రేవంత్ రెడ్డిని టోనీ ప్రశంసించారు. రే తెలంగాణ రైజింగ్ విజన్-2047లో నిర్దేశిరచుకున్న 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ, పెట్టుబడుల సాధన, రైతులు, మహిళా, యువ సాధికారిత, మౌలిక వసతుల కల్పన, ఐటీ, ఇతర రంగాల అభివృద్ధి లక్ష్యాలను, చేరుకునే మార్గాలను వివరించారు. తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన అమలుకు సంబంధించి లెటర్ ఆఫ్ ఇంటెంట్ మార్చుకున్నారు టోనీ బ్లెయిర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్ , తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు. తెలంగాణ రైజింగ్ విజన్-2047లోని స్పష్టత నిర్దేశించుకున్న లక్ష్యాలు ఎంతో ఆకట్టుకున్నాయంటూ టోనీ ప్రశంసలు కురిపించారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047లో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు ఇండియాలోని ప్రతినిధి తెలంగాణ ప్రభుత్వానికి సహకరిస్తారని టోనీ తెలియజేశారు. ఈ క్రమంలో సీఎంవోకు ఏవైనా సందేహాలు ఉంటే ఎటువంటి సంకోచాలు లేకుండా తమ ఃఃఎఉఅ భారత ప్రతినిధిని సంప్రదించాలని సీఎం రేవంత్ రెడ్డికి టోనీ బెయిర్ సూచించారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంట్ ఆవిష్కరణకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు టోనీ బ్లేయిర్ తెలిపారు.

## అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా కేబినెట్ తీర్మానం ఆమోదం

రూ.3,626 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.ఝూరండ్‌లోని ఝరియా బొగ్గు గనుల నిర్వాసితుల పునరావాసానికి (ఝరియా మాస్టర్ ప్లాన్) రూ.5,940 కోట్లు కేటాయించింది. నిర్వాసిత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం కోసం నైపుణ్య శిక్షణ, స్థిరమైన జీవనోపాధి మార్గాలు చూపడం వంటివి ఇందులో ఉన్నాయి.శుభాంశు శుక్లాతో కూడిన వ్యోమగాముల బృందం విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతిస్తూ చేసిన తీర్మానానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 140కోట్ల భారతీయుల ఆశయాలను ఆయన మోసుకెళ్లారని, ఈ సందర్భంగా శుభాంశుతోపాటు ఇతర వ్యోమగాములకు అభినందనలు తెలిపింది.ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన బాధితులకు సంఘీభావంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించిన క్యాబినెట్.. వారి త్యాగాలను గౌరవించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. ఈ ఏడాదితో సంవిధాన్ హత్యా దివాస్‌కు 50ఏళ్లు పూర్తైందని పేర్కొంది.

## మెట్రోపై కేంద్రం మొండివైఖరి

కలిశారు. కేంద్రమంత్రులు కుమారస్వామి, పీయూష్ గోయల్, శ్రీపాద యశోనాయక్‌లను కలిసిన శ్రీధర్‌బాబు.. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన భూముల అంశంపై చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని కోరారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2పై కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రధాని, కేంద్రమంత్రిని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర క్యాబినెట్‌లో మెట్రోకు అనుమతి వస్తుందని భావించామన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

## బనకచర్లపై బహిరంగ చర్చకు సిద్ధం

బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రశాంత్ పాటిల్‌కి హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హరీశ్‌రావు వెంట ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, బీఆర్‌ఎస్ శ్రేణులు ఉన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. అబద్దాల్లో సీఎం రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ చర్చకు పోదామని అంటున్నారని.. ఎక్కడికి రమ్మంటారో చెప్పాలని.. తాను సిద్ధమని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రతి సవాల్ విసిరారు. ఏ టీవీలో కూర్చుందామో, ఎక్కడ మాట్లాడుదామో చెప్పు తాను రెడీ... రేవంత్‌రెడ్డి వస్తారో, మహేష్ కుమార్ గౌడ్ వస్తారో చెప్పాలని ప్రతి సవాల్ చేశారు. అసెంబ్లీ నిర్వహించడం చేతగాక రేవంత్‌రెడ్డి పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. వారం రోజులకు మించి అసెంబ్లీ నడిపే పరిస్థితి లేదని చెప్పుకొచ్చారు. మళ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచేది కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు పూర్తిగా అధికారంలో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మూడు నెలల్లో పంచాయతీ ఎన్నికలు

ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు 2024 జనవరి 30వ తేదీతో ముగిసినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ టి.మాధవిదేవి తీర్పు ఇచ్చారు. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరు స్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులుపడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి' అని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల పక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ పక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు.

## ఎన్డీఎస్ఏ నివేదిక ఆధారంగా కాళేశ్వరంకు మరమ్మతులు

సంభవించనున్న ముప్పును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలసి ఈ నెల 19 న కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ కు సవివరంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను ఇచ్చామన్నారు.బంకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీ-ఫిజిబిలిటీని నివేదికను ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదించవద్దని తేల్చిచెప్పామన్నారు.ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణా రాష్ట్ర నీటి కేటాయింపులపై ప్రభావం చూపుతుందని దానిని దృష్టిలో పెట్టుకుని నివేదికను తిరస్కరించాలని కోరామన్నారు.అందుకు స్పందించిన కేంద్ర మంత్రి పాటిల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన నివేదికను ఆమోదించ లేదని,త్వరలోనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఆయన వివరించారు పదేళ్ల బి.ఆర్.యస్ పాలనలో పుట్టుకొచ్చిన గోదావరి-బంకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే తెలంగాణా ప్రయోజనాలకు జరిగే నష్టం పై ఈ నెల 30 న ప్రజాభవన్ లో మధ్యాహ్నం 3 గంటలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను ఏర్పాటు చేశామన్నారు.టన్నెల్ నిర్మాణాలలో అపారమైన అనుభవం కలిగిన సుప్రసిద్ధ సైనికాదికారు లిద్దరిని నీటిపారుదల శాఖలోకి తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.ఇటీవల రోహ్తాంగ్,జోజిలా టన్నెల్ నిర్మాణంలో పనిచేసిన ఇద్దరు అధికారులను వినియోగించుకునేందుకు నీటిపారుదల శాఖా కసరత్తు చేస్తుందన్నారు. భారత సైన్యంలో ఇంజినీర్ ఇన్-చీఫ్ గా పనిచేసిన జనరల్ హార్బల్ సింగ్ ను తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల శాఖకు సలహా దారుడిగా ఉండమని అహ్వానించామన్నారు అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన టన్నెల్ టెక్నాలజీ నిపుణులు కర్నల్ పరిక్షిత్ మోహ్రా ఈ జులైలో రాష్ట్ర నీటిపారుదల శాఖలో చేరనున్నారని ఆయన పేర్కొన్నారు.అదేవిధంగా మేడిగడ్డ ,అన్నారం,సిందిళ్ళ బ్యారేజి లపై ఎన్.డి.ఎస్.ఏ ఇచ్చిన నివేదికలపై సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ధరణ పనులకై ఎన్.డి.ఎస్.ఏ డిజైన్ కన్సల్టెంట్ గా వ్యవహరిస్తుందన్నారు.ఎన్.డి.ఎస్ ఏ ఇచ్చిన ఆదేశాలను సత్వరమే అమలులోకి తీసుకు రావాలని ఆయన అధికారులను ఆదేశించారు.

## సీబీఎస్ఈ 'పది' పరీక్షలు.. ఇక ఏడాదికి రెండుసార్లు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పదో తరగతి పరీక్షలు ఏడాదికి రెండుసార్లు చేపట్టనున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెల్లడించింది. ఫిబ్రవరిలో నిర్వహించే తొలి విడత పరీక్షలను తప్పనిసరి చేయగా..మే నెలలో నిర్వహించే రెండో విడత పరీక్షలను ఆప్షనల్‌గా పెట్టింది. 2026 నుంచి ఇది అమల్లోకి రానుందని తెలిపింది. వీటికి సంబంధించి కొత్త నిబంధనలకు సీబీఎస్ఈ తాజాగా ఆమోదం తెలిపింది. విద్యార్థులపై బోర్డు పరీక్షల ఒత్తిడి తగ్గించేందుకు వీలుగా నూతన జాతీయ విద్యా విధానం పలు సిఫార్సు చేసింది. ఇందులో భాగంగానే ఫిబ్రవరి, మే నెలల్లో రెండు విడతల్లో పది పరీక్షలు నిర్వహించనున్నామని సీబీఎస్ఈ పరీక్షల విభాగాధిపతి సన్యం భరద్వాజ్ పేర్కొన్నారు. తొలి విడత పరీక్షా ఫలితాలు ఏప్రిల్‌లో, రెండో విడత జూన్‌లో వెల్లడిస్తామన్నారు. వీటివల్ల విద్యార్థులు మార్కులు మెరుగుపరచుకునే వీలు ఉంటుందన్నారు. అయితే, అంతర్గత మదింపు మాత్రం ఏడాదికి ఒకసారి ఉంటుందని చెప్పారు.ఇదిలాఉంటే, పదోతరగతి పరీక్షలు రెండు దశల్లో నిర్వహణకు సంబంధించి నిబంధనల ముసాయిదాను సీబీఎస్ఈ గతంలోనే వెలువరించింది. ఈ రెండు పరీక్షలూ పూర్తిస్థాయి సిలబస్‌తోనే నిర్వహిస్తామని అందులో స్పష్టం చేసింది. ఈ విధానంపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి స్పందనలు స్వీకరించిన బోర్డు వాటి అమలుకు సిద్ధమైంది.



# మిషన్ 'శుభా'రంభం..

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఆయనతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములను తీసుకుని ఫాల్కన్ 9 రాకెట్ బుధవారం మధ్యాహ్నం నింగిలోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. వీరి వ్యోమనౌక తాజాగా భూకక్ష్యలోకి ప్రవేశించి అక్కడ ప్రయాణిస్తోంది. ఈ క్రమంలోనే అంతరిక్షం నుంచి శుభాంశు శుక్లా భారత పౌరులను పలకరించారు. ఇదో గొప్ప ప్రయాణం అని పేర్కొన్నారు. "నా ప్రియమైన దేశవాసులకు నమస్కారం. 41 ఏళ్ల తర్వాత మనం అంతరిక్షాన్ని చేరుకున్నాం. ఇదో గొప్ప ప్రయాణం. ఇప్పుడు మేం భూ కక్ష్యలో సెకనుకు 7.5 కిలోమీటర్ల వేగంతో తిరుగుతున్నాం. నా భుజాలపై మన త్రివర్ణ పతాకం ఉంది. అది చూస్తుంటే నాతో మీరంతా ఉన్నారనే భావన కలుగుతోంది. ఇది కేవలం నా అంతరిక్ష ప్రయాణం మాత్రమే కాదు.. భారత మానవ సహిత రోదసి యాత్రకు నాంది. ఈ ప్రయాణంలో మీరంతా భాగమవ్వాలని కోరుకుంటున్నా. మన దేశ మానవ సహిత అంతరిక్ష కార్యక్రమాన్ని మనమంతా కలిసి ప్రారంభిద్దాం. జై హింద్. జై భారత్" అని శుభాంశు శుక్లా తన సందేశంలో పేర్కొన్నారు.ఫ్లోరిడాలోని నాసా కెన్నెడీ స్పేస్‌సెంటర్‌లో బుధవారం మధ్యాహ్నం 12:01 గంటలకు (భారత కాలమానం ప్రకారం) చేపట్టిన ఫాల్కన్ 9 రాకెట్ విజయవంతంగా అంతరిక్షంలోకి వెళ్లింది. కొన్ని నిమిషాల తర్వాత వీరు ప్రయాణిస్తున్న వ్యోమనౌక రాకెట్ నుంచి విడిపోయి భూకక్ష్యలోకి ప్రవేశించింది. 28 గంటల ప్రయాణం తర్వాత.. గురువారం సాయంత్రం 4.30 గంటలకు (భారత కాలమానం ప్రకారం) వీరి వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో అనుసంధానం అవుతుంది. ఐఎస్ఎస్‌లో శుభాంశు బృందం 14 రోజుల పాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో అక్కడినుంచి ముచ్చటిస్తారు.

### ఐఎస్ఎస్‌లో 'శుక్స్'గా..

అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ 'యాక్సియం స్పేస్' ఈ మిషన్‌ను చేపట్టింది. భారత రోదసి పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)లు ఇందులో భాగస్వామ్యం వహించాయి. శుభాంశు శుక్లాతో పాటు మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ (అమెరికా), స్పెషలిస్టులు టిబర్ కపు (హంగరీ), స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ- విస్నియెస్కీ (పోలండ్) రోదసిలోకి వెళ్లారు. ఈ ప్రయోగంలో శుభాంశు మిషన్ పైలట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతరిక్షంలో ఆయనను 'శుక్స్'గా పిలవనున్నారు. వీరు 28 గంటల ప్రయాణం తర్వాత భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) చేరుకుంటారు. గురువారం సాయంత్రం 4.30 గంటలకు (భారత కాలమానం ప్రకారం) వీరి వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో అనుసంధానం అవుతుంది. ఐఎస్ఎస్‌లో శుభాంశు బృందం 14 రోజుల పాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో అక్కడినుంచి ముచ్చటిస్తారు.ఐఎస్ఎస్‌లో శుభాంశు బృందం 14 రోజుల పాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో అక్కడినుంచి ముచ్చటిస్తారు.

### ఇస్రో తరఫున ఏడు ప్రయోగాలు..

ఈ ప్రయాణం ద్వారా శుభాంశు గడించే అనుభవం.. 2027లో చేపట్టే స్వీయ మానవసహిత యాత్ర గగన్‌యాన్‌కు ఉపయోగపడుతుందని ఇస్రో చెబుతోంది. ఐఎస్ఎస్‌లో శుభాంశు.. ఇస్రో తరఫున ఏడు ప్రయోగాలు నిర్వహిస్తారు. దీర్ఘకాల రోదసి యాత్రల సమయంలో పోషకాహారం, జీవనాధార వ్యవస్థల విషయంలో ముందడుగు వేయడానికి ఉద్దేశించిన ప్రయోగం కూడా ఇందులో ఉంది. భారరహిత స్థితి వల్ల ఎముకలు, కండరాలు, గుండె, రక్తనాళాలు, రోగనిరోధక వ్యవస్థపై ప్రభావాన్ని శోధిస్తారు. నాసా నిర్వహించే ఐదు ఉమ్మడి అధ్యయనాల్లో శుభాంశు పాల్గొంటారు. మొత్తం మీద యాక్సియం-4 వ్యోమగాములు 31 దేశాలకు చెందిన 60 శాస్త్రీయ ప్రయోగాలను నిర్వహిస్తారు. తద్వారా ఐఎస్ఎస్‌లో ఒకే మిషన్‌లో అత్యధిక సంఖ్యలో ప్రయోగాలు చేపట్టినట్లవుతుంది.

## మీ ప్రయాణంపై దేశం మొత్తం గర్వంగా ఉంది

న్యూఢిల్లీ(జనంసాక్షి):యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రకు పయనమయ్యారు. ఆయన ఈ గ్రూప్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. దీనిపై తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని నరేంద్ర మోదీలు స్పందించారు. 'భారత్ నుంచి గ్రూప్ కెప్టెన్‌గా వెళ్లిన శుభాంశు శుక్లా భారత అంతరిక్ష చరిత్రలో కొత్త మైలురాయిని సృష్టించారు. మీ ప్రయాణంపై దేశం మొత్తం సంతోషంగా, గర్వంగా ఉంది. మీరు, యాక్సియం-4 మిషన్‌లోని ఇతర దేశాల వ్యోమగాములు ప్రపంచమంతా ఒకే కుటుంబమని నిరూపించారు. నాసా, ఇస్రో మధ్య శాశ్వత భాగస్వామ్యాన్ని ప్రతిబింబించే ఈ మిషన్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా. అక్కడ వ్యోమగాములు చేసే విస్తృత ప్రయోగాలు శాస్త్రీయ అధ్యయనాలు, అంతరిక్ష యాత్రలకు ముందడుగుగా మారనున్నాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.ఇక, భారత్, హంగేరీ, పోలాండ్, యూఎస్ వ్యోమగాలులతో కూడిన అంతరిక్ష మిషన్ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని మోదీ కూడా స్పందించారు. ఈసందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్రలో నిలిచారన్నారు. కోట్లమంది భారతీయుల కలలు, కోరికలు, ఆకాంక్షలను ఆయన మోసుకెళ్లారని వెల్లడించారు. ఫ్లోరిడాలోని నాసా కెన్నెడీ స్పేస్‌సెంటర్‌లో బుధవారం మధ్యాహ్నం 12:01 గంటలకు (భారత కాలమానం ప్రకారం) చేపట్టిన ఫాల్కన్ 9 రాకెట్ ప్రయోగం విజయవంతంగా అంతరిక్షంలోకి వెళ్లింది. కొన్ని నిమిషాల తర్వాత వీరు ప్రయాణిస్తున్న వ్యోమనౌక రాకెట్ నుంచి విడిపోయి భూకక్ష్యలోకి ప్రవేశించింది. 28 గంటల ప్రయాణం తర్వాత.. గురువారం సాయంత్రం 4.30 గంటలకు వీరి వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో అనుసంధానం అవుతుంది.

## నోబెల్‌ప్రైజ్‌కు ట్రంప్ పేరు..

### అధికారికంగా ప్రతిపాదించిన అమెరికా



**వాషింగ్టన్(జనంసాక్షి):** నోబెల్ శాంతి బహుమతి పొందాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆకాంక్ష రోజురోజుకు తీవ్రమవుతోంది. తాజాగా ఆయన పేరును అధికారికంగా నామినేట్ చేశారు. అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు బడ్డీ కార్టర్ ఈ మేరకు నార్వేలోని నోబెల్ కమిటీకి ఓ లేఖను పంపించారు."అసాధ్యమనుకొన్న సంక్షోభాల్లో కూడా వేగంగా ఒప్పందాలు చేయించడంలో ట్రంప్ కీలక పాత్ర పోషించారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం కుదర్చడంలో చరిత్రాత్మక పాత్ర పోషించారు. దీంతోపాటు ప్రపంచంలోనే ఉగ్రవాదులను పోషించే అతిపెద్ద దేశానికి అత్యంత వినాశకర ఆయుధం అందకుండా చేశారు. ఆయన నాయకత్వాన్ని నోబెల్ ప్రైజ్‌తో గుర్తించాలి" అని కోరారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య 12 రోజుల నుంచి జరుగుతున్న యుద్ధాన్ని ఆపుతూ ఆయన ఒప్పందం కుదిర్చారు.సాధారణంగా నోబెల్ శాంతి బహుమతికి ఆయా దేశాల జాతీయ పార్లమెంట్ సభ్యులు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, ఇతరులు నామినేషన్లను సమర్పించవచ్చు. మరోవైపు నోబెల్ శాంతి బహుమతి తనను వరించకపోవచ్చని ఇటీవల కాలంలో ట్రంప్ తీవ్ర నిరాశ వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్టు చేస్తూ "నేను ఏం చేసినా.. నాకు నోబెల్ ప్రైజ్ రాదు. భారత్-పాక్ మధ్య యుద్ధం ఆపినా.. సెర్బియా - కొసావో మధ్య పోరాటాన్ని నిలిపినా తనకు మాత్రం బహుమతి లభించదు" అని విచారం వ్యక్తం చేశారు.


ప్రతిపాదన విరమించుకొన్న ఉక్రెయిన్ సభ్యుడు..

ట్రంప్ పేరును ఉక్రెయిన్‌కు చెందిన చట్టసభ సభ్యుడు ఒలెక్సాండర్ మెరెఝూకో కూడా నోబెల్‌కు ప్రతిపాదించారు. కానీ, అమెరికా అధ్యక్షుడు రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడంలో విఫలం కావడంతో ఇప్పుడు తాజాగా ఆ నామినేషన్‌ను ఉపసంహరించుకొంటున్నట్లు ప్రకటించారు. తనకు ట్రంప్‌పై నమ్మకం పోయిందని ఆయన ఈసందర్భంగా వ్యాఖ్యానించారు. తాను అధికారంలోకి వచ్చిన 24 గంటల్లో ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ఆపుతానని ఎన్నికల వేళ ట్రంప్ హామీ ఇచ్చారు. ఆయన ప్రతిపాదించిన శాంతి ఒప్పందాన్ని ఉక్రెయిన్ అంగీకరించినా.. రష్యా ఒప్పుకోలేదు.ఇటీవల ట్రంప్ పేరును పాకిస్థాన్ ప్రభుత్వం నోబెల్ ప్రైజ్‌కు నామినేట్ చేసింది. ఆ మర్నాడే ఆయన ఇరాన్‌పై బంకర్ బస్టర్ బాంబులతో దాడులు చేయించారు. ఈ పరిణామాలతో ఒక్కసారిగా పాక్ షాక్‌కు గురైంది. తమ పొరుగుదేశం పైనే ట్రంప్ విరుచుకుపడటంతో ఏం చేయాలో పాలుపోలేదు. చివరికి పాక్ ప్రతిపక్షాలు ఆ ప్రభుత్వాన్ని తప్పుపట్టాయి. నోబెల్ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఇక భారత్ కూడా పాక్‌తో ఘర్షణను ట్రంప్ ఆపలేదని పలుమార్లు తేల్చిచెప్పింది.

## కుటీర పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

### ఆరోగ్య తెలంగాణను నిర్మిస్తాం

### :డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్(జనంసాక్షి):** పెద్ద ఎత్తున ఉపాధి, ఆదాయాన్ని సృష్టించే కుటీర పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం ట్యాంక్ బండ్ పై బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బిసి చేతి వృత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకానికి సంబంధించిన స్టాల్స్ ను ప్రారంభించిన అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. చేతివృత్తులు, కళాకారుల ఉత్పత్తులు సమాజానికి పెద్ద ఎత్తున ఉపయోగపడతాయి అన్నారు. చేతి వృత్తుల ఉత్పత్తులను ప్రోత్సహించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.ఈనెల 25 నుంచి 29 వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, హైదరాబాద్ నగరానికి చెందిన వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి కుటీర పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుందని ఈ ఎగ్జిబిషన్ ను రాష్ట్ర ప్రజలు ఉపయోగించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. ఈ ప్రదర్శనను తిలకించి నచ్చిన వస్తువులు, పర్యావరణహితమైన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఉత్పత్తులు కొనుగోలు చేసి చేతి వృత్తుల వారికి చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం సూచించారు. బిసి కార్పొరేషన్ల పై ప్రత్యేక దృష్టి సారించి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారుచేసిన మట్టి పాత్రలు మేదరి వారు తయారు చేసిన వెదురు వస్తువులు పూసల వారి సామగ్రి అదే విధంగా పోచంపల్లి, గద్వాల, నారాయణపేట మొదలైన చేనేత ఉత్పత్తులు గౌడ అన్నలతో ఏర్పాటుచేసిన నీరా ఉత్పత్తులు, వారు తయారు చేసిన వస్తువులను డిప్యూటీ సీఎం ఆసాంతం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెస్త సోదరులచే ఏర్పాటుచేసిన చేపల వంటకాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కలిసి డిప్యూటీ సీఎం ఆరగించారు.

# అంగుష్టమాత్రుడితో అపర భగీరథుడికి పోలికా?

### ఏ బేసిన్ ఎక్కడుందో రేవంత్‌కు తెలుసా..? : నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్, జూన్25 (జనంసాక్షి) : అంగుష్టమాత్రుడితో..అపర భగీరథుడు కేసీఆర్‌కు పోలికా.. అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఏ బేసిన్ ఎక్కడుందో తెలియదు.. దేవాదుల ఎక్కడుందో తెలియదు.. మరి కేసీఆర్ వచ్చి మీకు ఏం చెప్పాలి. తెలంగాణ ప్రాజెక్టులు, కేంద్రం తీరుపై నిండు శాసనసభలో కేసీఆర్ సమూలంగా వివరించారు.. అప్పుడు నీవున్న పార్టీ సభ నుండి పారిపోయిందని ఎద్దేవా చేశారు. మీరు లేవనెత్తే అంశాలకు శాసనసభలో ఉన్న కేటీఆర్, హరీష్ రావు లేదా గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్ రెడ్డిలు సమాధానం ఇస్తారు.. వారు చెప్పే అంశాలకు ప్రజలు కన్విన్స్ అవుతారో లేదో చూద్దాం. మీరు ఎన్ని గంటలు మాట్లాడతారో.. దమ్ముంటే వీళ్లకు కూడా అంతే సమయం మైక్ కట్ చేయకుండా ఇవ్వండి అని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ కూలి ఎనిమిది మంది మరణించారు.. వారి శవాలను బయటకు తేలేకపోయారు అయినా మీకు సిగ్గు లేదు. కాళేశ్వరంలోని మేడిగడ్డలో కేవలం రెండు పిల్లర్లు కుంగితే వాటిని బాగు చేయకుండా కాళేశ్వరం కూలేశ్వరం అని అంటారా కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం అని చెబితే రాష్ట్రంలో బడి పిల్లలకు కూడా అర్థం అయింది కానీ.. రేవంత్ రెడ్డికి అర్థం కాకుంటే మేము ఏం చేస్తాం.. తెలంగాణ ప్రాజెక్టులకు నీటి లభ్యత లేదు అని అనేకమార్లు చంద్రబాబు నాయుడు కేంద్రానికి లేఖ రాశాడు.. మరి ఇప్పుడు ఏపీ ప్రాజెక్టులకు నీళ్లు ఎక్కడి నుండి వస్తాయి..? కేంద్రం ఎందుకు వివక్ష చూపుతుంది.. అకారం కోసం ఆంధ్రప్రదేశ్‌కు అనుమతులు ఇస్తారా? పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి హైడ్రాలజీ అనుమతి తప్ప అన్నీ ఉన్నాయి.. పాలమూరు రంగారెడ్డికి నీటి కేటాయింపులు లేవని కేంద్రం డీపీఆర్ వెనక్కు పంపింది.. మరి సీఎం ఏం చేస్తున్నాడు.. అని నిరంజన్ రెడ్డి నిలదీశారు. విభజన చట్టం ప్రకారం కొత్తగా ఏ ప్రాజెక్టు కట్టినా అపెక్స్ కౌన్సిల్ సమావేశం అనుమతి తీసుకోవాలని చెప్పింది.. కానీ అసలు సమావేశమే ఏర్పాటు చేయకుండా రూ.82 వేల కోట్లతో గోదావరి బనకచర్లకు అనుమతులు ఎందుకు కేంద్రం ఆ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చడం వెనక అసలు వ్యవహారం కేంద్రంలో చంద్రబాబు మద్దతు ఇవ్వడమే కారణం కాదా బనకచర్ల ప్రాజెక్టును కేంద్రం తిరస్కరించాలి.. దానికి ఎలాంటి అనుమతులు కేంద్రం ఇవ్వకూడదు. దానికి ఎలాంటి అనుమతులు వచ్చినా తెలంగాణకు శాశ్వత ప్రమాదం తప్పదు.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులను అడ్డుకోవాలి. కేసీఆర్ మీద, కాళేశ్వరం మీద మాట్లాడడం మానేసి బనకచర్ల అనుమతుల మీద కేంద్రంతో పోరాడాలి. ఒక్కసారైనా కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని సీఎం, మంత్రులు పూర్తిగా పరిశీలించారా అసలు నీళ్లు ఎలా పారుతాయో వీరికి తెలుసా అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద కాంగ్రెస్ పార్టీ నీళ్లు ఇచ్చింది కేవలం 13 వేల ఎకరాలకే.. కేసీఆర్ హయాంలో దానిని 4 లక్షల ఎకరాలకు పైగా సాగునీళ్లు ఇచ్చాం.. కల్వకుర్తి ఎత్తిపోతలకు రూ.5789 కోట్లు ఖర్చయ్యాయి.. అందులో రూ.4 వేల కోట్లు కేసీఆర్ హయాంలోనే ఖర్చయ్యాయి. పైసలు ఖర్చు చేసిన ప్రతిసారీ కాంగ్రెస్ మీద బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ అభాండాలు మోపలేదు.. సీఎం స్థానంలో ఉంటూ నిత్యం కేసీఆర్‌ను ఆడిపోసుకోవడం శోచనీయం. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యమంలో కేసీఆర్ తనను నిత్యం దూషించిన వారిని కూడా అక్కున చేర్చుకున్నారు.. అది నిజమైన నేతల లక్షణం అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.

# ఎవరైనా కుటుంబ సభ్యుల ఫోన్లు వింటారా!?

### ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

### నా భార్య ఫోన్ ట్యాప్ చేశారు : ఫయిమ్ ఖురేషి

### స్టేట్‌మెంట్‌ని రికార్డ్ చేసిన సిట్ అధికారులు



హైదరాబాద్, జూన్ 25 (జనంసాక్షి) : ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ బుధవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో హాజరయ్యారు. బల్మూరి వెంకట్ స్టేట్‌మెంట్‌ని సిట్ అధికారులు రికార్డ్ చేశారు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ విచారణలో భాగంగా సిట్ అధికారులు తనను విచారణకు పిలిచారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయం కోసం నీచానికి దిగిందని మండిపడ్డారు. కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా వినడం దారుణమని ఫైరయ్యారు. ఫోన్లు ట్యాపింగ్ చేసి సంభాషణలు విని తమను ఇబ్బందులకు గురి చేశారని ధ్వజమెత్తారు. వాళ్లకు కుటుంబాలు లేవా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌కి పాల్పడ్డ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హెచ్చరించారు.

**నా భార్య ఫోన్ ట్యాప్ చేశారు : ఫయిమ్ ఖురేషి**

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు టీఎంఆర్ఈఐఎస్ వైస్ చైర్మన్ ఫయిమ్ ఖురేషి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో హాజరుకాగా, స్టేట్‌మెంట్‌ని సిట్ అధికారులు రికార్డ్ చేశారు. ఫయిమ్ ఖురేషి మీడియాతో మాట్లాడారు. తన ఫోన్ ట్యాప్ అయిందని మూడు రోజుల క్రితం డీసీపీ నుంచి సమాచారం అందిందని తెలిపారు. తన ఫోన్‌తో పాటు, తన భార్య డ్రైవర్ ఫోన్లను కూడా ట్యాప్ చేశారని అన్నారు. ఇప్పటికే తమ డ్రైవర్ సిట్ ముందు హాజరై స్టేట్‌మెంట్ ఇచ్చారని వెల్లడించారు. రాజకీయంలో ఉన్న తన ఫోన్ కాకుండా తన భార్య ఫోన్ కూడా ఎందుకు టాప్ చేశారని ప్రశ్నించారు. భార్యాభర్తల మధ్య వ్యక్తిగత సంభాషణలు కూడా విన్నారని మండిపడ్డారు. అధికారం కోసం ఇంత నీచానికి దిగజారుతారా అని ఫైర్ అయ్యారు. ఎన్నికల ముందు తన ఫోన్ ట్యాప్ చేసి తనపై చాలా ఒత్తిడి తెచ్చారని అన్నారు. తన సిద్ధాంతం కాంగ్రెస్ సిద్ధాంతమని, తాను నమ్ముకున్నది రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని అని ఫయిమ్ ఖురేషి పేర్కొన్నారు.

# మిమ్మల్ని చూసి భారత్ గర్విస్తోంది

### అంతరిక్షంలోకి ప్రయాణిస్తున్న భారతీయుడు శుభాన్షు శుక్లాకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అభినందన



న్యూఢిల్లీ (జనంసాక్షి) : ‘ఆగ్జియోమ్ మిషన్ 4’లో భాగంగా 140 కోట్ల మంది భారతీయులకు వహిస్తూ అంతరిక్షంలోకి వెళ్తున్న శుభాన్షు శుక్లాకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. 41 ఏళ్ల క్రితం రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్షంలోకి అడుగు పెడుతున్న రెండో భారతీయుడిగా, ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ కు వెళ్తున్న తొలి భారతీయుడిగా శుభాన్షు చేస్తున్న ప్రయాణం ప్రతిభారతీయుడికీ గర్వకారణమన్నారు. ఈ 14రోజుల ఈ ప్రయాణం విజయవంతమై అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధిని సాధించేలా ఈ ప్రయోగం నిలవనుంది. శుభాన్షు శుక్లాతో పాటు ఈ ప్రయోగంలో భాగంగా అంతరిక్షంలో అడుగుపెట్టిన హంగేరీ, పోలండ్, అమెరికా దేశ వ్యోమగాములకు శుభాకాంక్షలు తెలిపారు.

# అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

హైదరాబాద్, జూన్25 (జనంసాక్షి) : ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో మొక్కలు నాటాలని మేడ్చల్ జిల్లా బీజేపీ కన్వీనర్ మల్లారెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవరం కాంతరావు, మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. మూసాపేటలో ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశాన్ని కాలుష్యరహితంగా మార్చాలన్న ఉద్దేశంతో ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారని, మన ఇంటికి ఇరువైపులా, ఖాళీ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అడవులు రోజురోజుకు అంతరించి పోతున్నాయని దానివల్ల వర్షాలు తగ్గడమే కాకుండా సూర్యతాపం మరింత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి బీజేపీ కన్వీనర్ శ్రీకర్‌రావు, పద్మయ్య, ఎర్రస్వామి, మహిళా మోర్చా అధ్యక్షురాలు జానకి, లీగల్‌సెల్ సద్గుణరెడ్డి, రవిగౌడ్, రేవతి, శోభరాజన్ తదితరులు పాల్గొన్నారు.

# బూర్గంపాడు ఘటనలో నివేదిక కోరాం

### రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

### సురేఖతో ఫోన్ లో ఘటన వివరాలు తెలుసుకున్న మంత్రి సీతక్క



హైదరాబాద్ (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి ఫారెస్ట్ బీట్లో లోని కొసగుంపు వలస ఆదివాసీ గ్రామంలో ఇటీవల చోటు చేసుకున్న ఘటనపై తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఫారెస్ట్ భూమికి కందకాలు తవ్వేందుకు వెళ్లిన జేసీబీని కొసగుంపుకు చెందిన వలస ఆదివాసీ మహిళలు అడ్డుకున్న నేపథ్యంలో చోటు చేసుకున్న ఘర్షణ విషయంలో మంత్రి సురేఖ, జిల్లా అటవీ అధికారులను, జిల్లా ఉన్నతాధికారులను నివేదిక కోరుతానని చెప్పారు. ఈ మేరకు మంత్రి సురేఖ మీడియాకి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కందకాలు తవ్వకుండా జేసీబీకి అడ్డుగా మహిళలు బైఠాయించగా, ఫారెస్ట్ అధికారులు మహిళలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వలస ఆదివాసీ మహిళలకు, ఫారెస్ట్ అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నదని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. కాగా, ఇదే విషయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క కూడా మంత్రి సురేఖతో ప్రత్యేకంగా ఫోన్ లో మాట్లాడారు. నివేదిక వచ్చిన తర్వాత తదనుగుణంగా ముందుకు వెళదామని అటవీ మంత్రి సురేఖ, సీతక్కకు హామీనిచ్చారు.

# ఐటీబీపీ వీరులు భారతదేశ శక్తి ప్రతీకలు

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

### మధ్యప్రదేశ్ లోని శివపురి క్యాంపస్‌లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



హైదరాబాద్ (జనంసాక్షి) : ఇండో టిబెటిన్ బోర్డర్ పోలీసులు(ఐటీబీపీ) భారతదేశ శక్తికి ప్రతీకలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. ఐటీబీపీ వీరుల ధైర్యాల్ని మర్చిపోలేమని, వారి కష్టాలను విస్మరించలేమని, వారి సేవలను తక్కువగా అంచనా వేయలేమని చెప్పారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని శివపురిలోని ఐటీబీపీ క్యాంపస్ కు విచ్చేసిన బండి సంజయ్ కుమార్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. జబల్పూర్‌లోని 29వ బెటాలియన్‌కు చెందిన జవాన్ల కోసం నూతనంగా నిర్మించిన 105 నివాస గృహాలను, కమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌లో 360 మంది సామర్థ్యం గల జవాన్ బ్యారక్స్ను, 38 కొత్త నివాస గృహాలను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మానే మహారాజ్ ఐజీ ట్రైనింగ్ ఐటిబిపి, మహేశ్ కలావట్ డీఐజీ శివపురి ఐటిబిపి, శివపురి నియోజకవర్గ ఎమ్మెల్యే దేవేందర్ జైన్, గాయత్రి శరణ్ శివపురి నగరపాలక సంస్థ అధ్యక్షురాలు మరియు పలువురు ఐటిబిపి ఉన్నతాధికారులువారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులు అర్పించారు. ఐటీబీపీ సైనికులు త్యాగాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు.

# రైతు భరోసా ఎందుకు సంబరాలు : డీకే అరుణ

హైదరాబాద్, జూన్ 25 (జనంసాక్షి) : స్థానిక సంస్థలకు వెళ్లే ధైర్యం కాంగ్రెస్‌కి లేదని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. రెండు ఎకరాలు ఉన్నవారికి కూడా రైతు భరోసా ఇంకా రాలేదని.. అలాంటప్పుడు రైతు భరోసా పేరుతో సంబురాలు ఎందుకు చేసుకుంటున్నారో కాంగ్రెస్ నేతలకే తెలియదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌లో బీజేపీ నాయకులందరూ బాధితులేనని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ ప్రభుత్వం ఇంత వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదని నిలదీశారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ చేయించాలని కోరారు. బుధవారం నల్లగొండలో ఎంపీ డీకే అరుణ పర్యటించారు. బీజేపీ నేతలతో పార్టీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ఎమర్జెన్సీ పేరుతో కాంగ్రెస్ చేసిన అరాచకాల గురించి ప్రజలందరికీ తెలియాలని ఎంపీ డీకే అరుణ అన్నారు.

# కేసీఆర్ దమ్ముపై మాట్లాడే అర్హత రేవంత్‌కు లేదు : కవిత



హైదరాబాద్, జూన్25 (జనంసాక్షి) : మాజీ సీఎం కేసీఆర్ దమ్ము గురించి మాట్లాడే అర్హత సీఎం రేవంత్‌రెడ్డికి లేదని.. ఆయన దమ్మేంటో కాంగ్రెస్ పెద్దలకు తెలుసునని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మహిళలకు రూ. 2500, పెన్షన్ల మొత్తం పెంపుపై ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలు, మహిళలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసంపై అసెంబ్లీలోనే చర్చిద్దామన్నారు. రేవంత్ రెడ్డి చంద్రబాబును పిలిచి హైదరాబాద్ బిర్యాని పెట్టి గోదావరి నీళ్లను గిఫ్ట్‌గా ఇచ్చారు. 2016లో పోలవరం, బనకచర్ల అంశమే లేదు. రేవంత్ రెడ్డికి అబద్దాలు ఆడడం అలవాటైంది. గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించడం సరికాదు. యస్.. అసెంబ్లీ పెడుదాం ఆరు గ్యారెంటీల అమలు, మహిళలను మోసం చేసినదానిపై చర్చిద్దామన్నారు కవిత. రేవంత్ రెడ్డి హుందాగా వ్యవహరించాలి. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయరు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించరు అని కవిత పేర్కొన్నారు. ఇక ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు రాశారు. అబిడ్స్ జీపీవోలో ఎమ్మెల్సీ కవిత, జాగృతి కార్యకర్తలు పోస్ట్ కార్డులను పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్న హామీ ఏమైంది..? గ్యారెంటీలపై సోనియా గాంధీ సంతకం పెట్టిన గ్యారెంటీ కార్డులను ఇంటింటికి పంచారు. సోనియాగాంధీ ముఖం చూసి ఓట్లేసిన మహిళలను, వృద్ధులను, వికలాంగులు మోసం చేశారు. అందుకే సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు పంపించాము. పెన్షన్ల మొత్తాన్ని పెంచాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలివ్వాలని సోనియా గాంధీని కోరామని కవిత పేర్కొన్నారు.

# రాయదుర్గంలో యువతి అనుమానాస్పద మృతి

హైదరాబాద్, జూన్ 25 (జనంసాక్షి) : రాయదుర్గంలో ఓ యువతి ఓయో హెూటల్లో యువతి సూసైడ్ చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... నల్లగండ్లలో నివాసం ఉంటున్న అనూష (26) బ్యూటీషియన్‌గా పనిచేస్తున్నారు. అనూషకు పెళ్లి జరిగినప్పటికీ భర్తతో విభేదాలు తలెత్తాయి. దీంతో భర్త నుంచి విడిపోయిన యువతి.. తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. వారిని చూసుకుంటూ బ్యూటీషియన్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈనెల 22న సాయంత్రం ఆరు గంటల సమయంలో స్నేహితుల వద్దకు వెళ్తున్నట్లు యువతి తల్లిదండ్రులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. అయితే రాత్రి గడిచినప్పటికీ అనూష ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆమెకు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో యువతి కోసం గాలించడం మొదలుపెట్టారు. బంధువులను ఫోన్ చేసి అనూష గురించి ఆరా తీశారు. అయితే ఎవరూ రాలేదని చెప్పడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే రాయదుర్గంలోని క్యాబిన్ ఓయో లాడ్జ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది అనూష. ఈ విషయాన్ని ఓయో లాడ్జ్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా... వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే అనూష ఎందుకు సూసైడ్ చేసుకుందనే విషయం తెలియాల్సి ఉంది. యువతి మృతి విషయంపై తల్లిదండ్రులకు సమాచారం అందించారు పోలీసులు. కానీ యువతి ఆత్మహత్యపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. అసలు యువతి లాడ్జ్‌కు ఎందుకు వచ్చింది.. యువతితో పాటు ఎవరైనా వచ్చారా.. ఆత్మహత్యకు గల కారణాలు ఏంటి.. యువతిది ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

### ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు పట్టాలు పంపిణీ

### రైతు సంక్షేమం కోసం రైతు భరోసా నిధులు జమ చేశాం

### రాష్ట్ర కార్మిక, భూగర్భ గనుల శాఖల మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల ప్రతినిధి (జనంసాక్షి) : రాష్ట్రంలో నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా వారి సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నెరవేరుస్తున్నామని రాష్ట్ర కార్మిక, భూగర్భ గనుల శాఖల మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జైపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు పట్టాలు పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహశీల్దార్ వనజారెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుర్రం సత్యనారాయణలతో కలిసి హాజరై లబ్దిదారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ... పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసి అర్హులైన పేదలకు గూడు కల్పించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తూ అర్హులైన లబ్దిదారులకు ఇండ్లు అందించడం జరుగుతుందని తెలిపారు. నిరుపేదలకు ఆశ్రయం కల్పిస్తూ స్థిర నివాస హక్కును అందిస్తుందని, రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 3 వేల 500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. స్వంత ఇంటి స్థలం కలిగి ఉండి అర్హత గల లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద ఆర్థిక సహాయం అందిస్తుందని, ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తుందని, లబ్దిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకొని పథకం లబ్ది పొందాలని తెలిపారు. బుధవారం రోజున మండలంలోని 11 గ్రామపంచాయతీలకు చెందిన 316 మంది లబ్దిదారులకు పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని, గతంలో అందించిన 198 మంది లబ్దిదారులతో కలిపి మొత్తం 514 మందికి అందించడం జరిగిందని, పైలెట్ ప్రాజెక్టు క్రింద మండలంలో 117 మంది లబ్దిదారులకు పట్టాలు అందించడం జరిగిందని తెలిపారు. 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయల రైతుభరోసా నిధులను అర్హులైన రైతుల ఖాతాలలో జమ చేయడంతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని, వానాకాలం పంట సాగు ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం అందించడం జరిగిందని తెలిపారు.

# నేటినుంచి బోనాల సందడి

### తొలిబోనం గోల్కొండతో ప్రారంభం

### నెలరోజుల పాటు బోనాల జాతర



హైదరాబాద్, జూన్25 (జనంసాక్షి) : నేటి నుంచి ఆషాడం ప్రవేశంతో జంటనగరాల్లో బోనాల సందడి మొదలు కానుంది. ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బోనాల ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం బోనాలను అధికారిక పండుగగా ప్రకటించినది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని అలయాల్లో ఉన్న అమ్మవార్లకు భక్తులు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. నెల రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లను చేసింది. గోల్కొంట కోటలో బోనాలు మొదట ప్రారంభించే సంప్రదాయం వస్తుంది. దీంతో గోల్కొండ బోనాలతో సందడి మొదలు కానుంది. గురువారం మొదలు కానున్న ఈ సందడిలో భాగంగా ఆదివారం గోల్కొండ బోనాలు జరగనున్నాయి. బోనాలు సంప్రదాయం ప్రకారం ప్రసిద్ధి చెందిన గోల్కొండ కోటలోని శ్రీఎల్లమ్మ (జగదాంబిక) ఆలయంలో ప్రారంభం కావడం ఆనవాయితీ. ప్రతీ సంవత్సరం ఆషాడమాసంలో ఆమావాస్య తర్వాత వచ్చే గురువారం, లేదా ఆదివారం బోనాలు ప్రారంభవవుతాయి. అయితే, ఈ నెల బుధవారం అమవాస్య కావడంతో ఆ తర్వాత రోజు గురువారం బోనాల జాతర మొదలుకానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేస్తుంది. బోనాలు ఉత్సవాలకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని శ్రీజగదాంభిక ట్రస్టు బోర్డు ఏర్పాట్లు మొదలుపెట్టింది. ఇప్పటికే మంత్రి పొన్న ప్రభాకర్ సమిక్ష చేశారు. గురువారం నుంచి జూలై 24వతేదీ వరకు తెలంగాణలో బోనాల జాతర జరుగనుంది. నెలరోజుల పాటు ఇక్కడ తొమ్మిది ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజలకు నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. వీరికోసం గోల్కొండ కోటలోని అక్కన్న మాదన్న కార్యాలయాలు, బాడిగార్డ్స్ లైన్స్ ప్రాంతాలు సిద్ధం చేస్తున్నారు. పూజల ప్రారంభోత్సవంలో భాగంగా మొదటి రోజు లంగర్‌హౌజ్ చౌరస్తా నుంచి అమ్మవారి తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తారు. చోటాబజార్‌లోని ఆలయం పూజారి ఇంటి నుంచి అమ్మవారి విగ్రహం, ఘట్టం ఊరేగింపు, బంజారాదర్వాజ నుంచి మొదటి బోనం ఊరేగింపు నిర్వహిస్తారు. ఇవన్నీ గోల్కొండ కోటపైకి చేరిన తర్వాత ఆలయం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, బోనం అమ్మవారిక సమర్పిస్తారు. కోటలో బోనాల జాతర జరుగనుండ దడంతో గోల్కొండ కోట పాలన చూస్తున్న కేంద్ర పురావస్తు శాఖ పలు మార్పులు చేయనుంది. బోనాలు జరిగే ఆదివారం, గురువారం రోజుల్లో ఉచిత ప్రవేశం కల్పించారు. కోటలో ప్రతీ రోజు రాష్ట్ర పర్యాటక సంస్థ రెండు లైట్ అండ్ సౌండ్ షోలు నిర్వహిస్తుంది. ఆదివారం, గురువారాలు మొదటి షోను రద్దు చేస్తారు. రెండవ షో 8 గంటల నుంచి యధావిధిగా ఉంటుంది.

**LOST OF DOCUMENT**


I, Mohd Azam S/o.Mohd Shareef R/o.8-4-549/06/18, Netaji Nagar, Yerragadda, Sanathnagar, Hyderabad-18, Telangana . Have lost my original Sale Deed document bearing no.5658/1991 While travelling from Suraram to Sanathnagar . If Found. 9399915860

**CHANGE OF NAME**

I, SHAMAMMA TURPU, H.NO.2-36, VILLEGE &POST THUNKIMETLA, MANDAL BOMRASPET, VIKARABAD (DIST), TELANGANA STATE, PIN:509338, CHENGED MY NAME AS FOR VOTAR ID CARD KAVALI SHYMALAM-MA D/O LAXMAPPA.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
26 జూన్ 2025
తెలంగాణ

# సికాసలో లేచిన బొగ్గు రవ్వలు




1969ల్లో ఉద్భవించిన నక్సల్బరీ ఉద్యమం ఊపిరిగా తెలుగు నాట శ్రీకాకుళం లో అడుగుపెట్టి తెలంగాణ నేలన విస్తరించిన రాడికల్ ఉద్యమం లో చురుకైన పాత్ర పోషించిన గురిజాల రవీందర్ వ్రాసిన బొగ్గురవ్వలు పుస్తకంలో తన జీవన ప్రస్థానాన్ని, తనతో పాటు తన సహచరుల పోరాటాన్ని అక్షరీకరించిన తీరు నేటి తరానికి కావాల్సిన వైద్యం పుష్కలంగా ఉంది. సమస్యలనుండి పారిపోయే నేటి తరం వాట్సాప్ ల్లో ఫార్వార్డ్ చేయబడుతున్నదే చరిత్రగా అదే నిజమనే భ్రాంతిలో కొట్టుమిట్టాడుతున్న తరం చదవాల్సిన పుస్తకం ఇది. నమ్ముకున్న సిద్ధాంతం కోసం, విలువల కోసం బ్రతికిన బ్రతుకులోని ఆనందం కన్నా మించినది మరొకటి ఉండదని మొగిలమ్మ లింగయ్య ల పుత్రుడు రవీందర్ ఋజువు చేసారు. బతుకు దెరువు కోసం ఊరు విడిచి కార్మిక ఆవాసాల మధ్య ఓ హోటల్ నడుపుకుంటూ హోటల్ నిర్వహణ కోసం కావాల్సిన పాలకై పశువులను పెంచుతూ వనరులను సమకూర్చుకోవడం నాటి తరంలోని శ్రమైక జీవన సౌందర్యాన్ని ప్రతిబింబిస్తుంది.

తన చుట్టూ ఉన్న మనుషుల జీవితాలని గమనిస్తూ చదువుతూ లోతుపాతుల పై విశ్లేషిస్తూ లోటుపాట్లను సరిదిద్ద అవసరమైన సిద్ధాంతాన్ని ఆచరిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్ళ గలిగిన రవీందర్ పయనం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఊరు వదిలి వచ్చినా ఆప్యాయతను వదలలేని హుస్సేన్ మామ తిరిగి వెతుక్కుంటూ హోటల్ కి రావడం పాటలతో ఉత్తేజితులను చేయడం, దొరల చేతుల్లో నడుస్తున్న సింగరేణి యూనియన్ లకు ప్రత్యామ్నాయంగా సికాస ను ఏర్పాటు చేయడంలో రవీందర్ పాత్ర మాత్రమే కాక నాటి కార్యకర్తల కఠోర శ్రమ ను త్యాగాన్ని గుర్తు చేసారు. ఈ నేలన జరిగిన సాయుధపోరాట స్ఫూర్తి ని నిలబెట్టిన ఆర్ వై ఎల్ పోరాటాలను సమస్యలను ఉటంకిస్తూ చర్చించిన అంశాలు సోదాహరణంగా ఉన్నాయి. సింగరేణి బొగ్గు గనుల్లో అలసిన శరీరాల వల్ల చెదిరిన దాంపత్య జీవితాలను జైలు జీవితాల్లోని బీడీలు డబ్బులు హోమోసెక్సువల్ ఘటనలు, బలం ఉన్న వాడి చేతుల్లో బానిసలు గా ఆ జైలు గోడల మధ్య%ొ% బాహ్య ప్రపంచానికి తెలియచేసారు.

తన ఆత్మకథ అని అనటం కన్నా తాను నడిచిన మార్గం లోని ఒడిదుడుకులను తెలియచేస్తూ అనుభవించిన పోలీసు చిత్రహింసల ను నిర్బంధాలను పాఠకులకు పరిచయం చేయడం ద్వారా ఎన్ని నిర్బంధాలైనా ఉద్యమాలను ఆపలేవని చెప్పగలిగారు. తన బాట ముళ్ళబాట అని తెలిసినా ఆ బాటలోనే నడవటానికి నిర్ణయించుకున్న మేన మరదలు సరళ పదిహేడేళ్ళకే పరిణతి చెందిన నిర్ణయం తీసుకోవడం వెనుక సిద్ధాంత స్ఫూర్తి ఉంది. షెల్టర్ ఇవ్వడానికి తోబుట్టువులు తండ్రి జంకినా సానుభూతిపరుల ఇంట అజ్ఞాత జీవితం గడిపి తాను నడిచే బాటలోని ఔన్నత్యాన్ని గుర్తు చేసారు. చదివే క్రమంలో బతుకుల బాగుకోసం సామాజికార్థిక అసమానతలు మూలమని గ్రహించి లీగల్ గా సేవలందిస్తూ పార్టీ కి అవసరమైనప్పుడు అండర్ గ్రౌండ్ కి వెళ్ళి అత్యవసర సమయంలో మురుగు నీరు సైతం మంచి నీరు గా సేవించాల్సిన పరిస్థితులను విశదీకరించారు. అజ్ఞాత జీవితంలోకి భార్యాభర్తలను ఒకేసారి పార్టీ అనుమతించ నిరాకరించడంతో కలిసే జీవించాలనుకునే మౌలిక సూత్రానికనుగుణంగా కోర్టులో లొంగిపోయానని రవీందర్ తేటతెల్లం చేసారు.

ఉద్యమకారులకు పిల్లలు వుంటే ఉద్యమంలో చురుకుగా పాల్గొనేందుకు అడ్డని భావించి పిల్లలు పుట్టకుండా సరళ ఆపరేషన్ చేసుకున్నా ఆపాటికే గర్భం దాల్చడం అబార్షన్ కోసం వివిధ డాక్టర్లను సంప్రదించడం జరిగినది జరిగినట్లు ఎక్కడా అతిశయోక్తి లేకుండా రచించారు. పుట్టిన పిల్లను తాత దగ్గర వదిలి ఉద్యమంలో పాల్గొంటూ బిడ్డ తమకు దూరం అవుతుందనే బాధను వెలిబుచ్చారు సగటు తల్లితండ్రుల్లా. పోలీసు చిత్ర హింసలకు వెన్ను నొప్పి నివారణకు ఆయుపంక్చర్ వైద్యాన్ని ఆశ్రయించి డాక్టర్ మిత్ర చేసిన వైద్య సహాయాన్ని ఉటంకించారు. వివిధ ప్రముఖ ఉద్యమకారులను ఉద్యమ నేపథ్యంలో కలిసిన, చర్చించిన మరియు ఏర్పాటు చేసిన సందర్భాలను తేదీలవారీగా ఇన్నాళ్ళ తర్వాత సైతం వ్రాయగలగడంలో తన డైరీ లు ఉపయోగ పడ్డాయని భావించవచ్చు లేదా జ్ఞాపక శక్తి కి సెల్యూట్ చేయవచ్చు. పార్టీలు వేరైనా తాను జైలు లో ఉన్నప్పుడు ఎం ఎల్ ఏ బోడ జనార్దన్ వచ్చి వెళ్ళాడని తెలియ చేయడంలో మానవీయ కోణం ఉంది.

తోటి కామ్రేడ్ గంగారం ఎన్కౌంటర్ అయినప్పుడు తాను అనుభవించిన బాధను అధిగమించటానికి చాలా సమయం తీసుకున్నారని తన వేదన ద్వారా గ్రహించవచ్చు. కొత్త దంపతుల నివాసానికి గుడిసెల మధ్య పందులు తిరుగాడుతుంటే సరళ వేరే ప్రాంతం చూడమన్నప్పుడు రెండు కవితలు చెబుతూ ఆ నివాసాల మధ్య ఉంటే సదరు ప్రజానీకం తమతో కలిసిపోతేనే సిద్ధాంత భూమిక త్వరగా నెరవేరుతుందని చెప్పటంలో తన సామాజిక బాధ్యత ను పరిణతిని అంచనా వేయవచ్చు . అజ్ఞాత జీవితం నుండి బైటికి వచ్చి ముప్పై ఏళ్ల పాటు విద్యాసంస్థలను నడిపి తాను ఆశించినట్లు నేడు నడపలేకపోతున్నందున తప్పుకోవడం అతని వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది.

చివరగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స కు ముందే బీజం పడి అబార్షన్ ను తప్పించుకుని పుట్టిన బిడ్డే వ్యాఖ్యాత గా ఈ బొగ్గురవ్వలు ఆవిష్కరణ జరగడం గమనార్హం! ప్రతులకు అమెజాన్ ను సంప్రదించవచ్చు లేదా రచయిత చరవాణి 91 98495 88825 ని సంప్రదించండి.

- గిరి ప్రసాద్ చెలమల్లు
201 క్లాసిక్ అవెన్యూ మియాపూర్
హైదరాబాద్ 500049, 9493388201

## అనాదిగా అణిగిపోయిన గొంతుకలకు ఆశాదీపం

# బాను ముష్తాక్



సాహిత్య లోకంలో ఈ మధ్యే ఓ గొప్ప సంబరం జరిగింది. తరతరాలుగా తెరమరుగైన గొంతుకలకు దక్కిన అపురూప విజయం అది. ఈ వారం మన తెలుగు పక్క రాష్ట్రం కర్ణాటకకు చెందిన రచయిత్రి, న్యాయవాది, సమాజ సేవకురాలు బాను ముష్తాక్‌కు అంతర్జాతీయ బుకర్ బహుమతి 2025 దక్కింది. ఆమె హృదయాన్ని మెలిపెట్టే కథల సంపుటి "హార్ట్ ల్యాంప్"ని దీప భాస్తి కన్నడ నుండి ఆంగ్లంలోకి అద్భుతంగా అనువదించారు. ఈ పుస్తకం దక్కన్ పీఠభూమి నుండి ఓ బలమైన గొంతుకను ప్రపంచ సాహిత్య వేదికపైకి తీసుకురావడమే కాకుండా, కన్నడ భాషలో ఈ ప్రతిష్టాత్మక పురస్కారం పొందిన మొట్టమొదటి రచనగా మొట్టమొదటి కథల సంపుటిగా చరిత్రలో నిలిచింది. ఇది కేవలం బాను ముష్తాక్ సాధించిన విజయం కాదుబీ సమాజంలోని చీకటి కోణాలను వెలికితీసి, ఎవరూ పట్టించుకోని గొంతుకలను ప్రపంచానికి వినిపించే సాహిత్యపు మహత్తర శక్తికి ఇది ఓ గొప్ప నిదర్శనం.

**"హార్ట్ ల్యాంప్" - ఆడబిడ్డల బతుకు చిత్రాలు:**

"హార్ట్ ల్యాంప్" అనేది మూడు దశాబ్దాల (1990–2023) పాటు రాసిన పన్నెండు కథల సంకలనం. ఇది దక్షిణాదిలోని ఆడబిడ్డల, ముఖ్యంగా ముస్లిం మహిళల జీవితాల్లోని కష్టనష్టాలు, పోరాటాలు, చిన్నచిన్న ధిక్కారాలను లోతుగా విశ్లేషిస్తుంది. 1990 నుంచీ న్యాయవాదిగా పనిచేస్తూ, మహిళా హక్కుల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముష్తాక్, తన అనుభవాలనే కథలుగా మలిచారు. మతం, కుల వివక్ష, అధికార పోరాటాలు, పితృస్వామ్య బంధనాలతో అల్లుకున్న బతుకు చిత్రాలను ఆమె సూక్ష్మంగా ఆవిష్కరించారు. బుకర్ బహుమతి జ్యూరీ ఆమె సృష్టించిన పాత్రలను "నిజంగా బతుకు దెరువు కోసం పోరాడిన, ధైర్యంగా నిలబడిన అద్భుతమైన చిత్రాలు"గా కొనియాడింది. మతం, సమాజ కట్టుబాట్లు, రాజకీయ శక్తుల ప్రభావం బలంగా ఉండే చోట, అవి ఆడవారిని ప్రశ్నించకుండా లొంగిపొమ్మని డిమాండ్ చేస్తాయి. అలాంటి ప్రపంచంలో ఈ పాత్రలు పడే కష్టాలను ముష్తాక్ తన ఆర్ద్రమైన మాటల్లో ఇలా వివరించారు: "వారిపై అమానుషమైన క్రూరత్వం చూపబడి, దాదాపు బానిసలుగా మార్చబడ్డారు."

**ఈ పురస్కారం తెచ్చిన లాభాలు- భాషకు, అనువాదానికి గౌరవం:**

ఈ పురస్కారం వల్ల అనేక మంచి జరిగింది. ముఖ్యంగా ఇది కన్నడ సాహిత్యానికి అంతర్జాతీయ వేదికపై ఓ మంచి పేరు తెచ్చింది. కన్నడ భాషకు గొప్ప చరిత్ర, అద్భుతమైన భావ వ్యక్తీకరణ సంప్రదాయం ఉన్నాయి. ఎన్నడూ లేనంతగా ప్రపంచ సాహిత్య రంగం కొన్ని ఎంపిక చేసిన భాషలకే ప్రాధాన్యత ఇస్తోంది. అలాంటిది భాస్తి చేసిన సూక్ష్మమైన "కొత్త ఒరవడి" సృష్టించిన అనువాదం, దక్షిణాది భాషల సౌందర్యాన్ని కాపాడాలనే స్పృహతో చేసిన కృషి, ముష్తాక్ విజయాన్ని సులభతరం చేసింది. ఇది ప్రపంచ సాహిత్యానికి మరింత సమ్మిళితత్వాన్ని, ప్రాతినిధ్యాన్ని తెచ్చే దిశగా ఓ కీలకమైన అడుగు. భాషల మధ్య వారధులుగా అనువాదకుల పాత్ర ఎంత ముఖ్యమో ఇది నొక్కి చెబుతుంది. 2016 నుండి ప్రస్తుత రూపంలో ఉన్నప్పటి నుండి ఈ బహుమతిని గెలుచుకున్న మొట్టమొదటి భారతీయ అనువాదకురాలు దీప భాస్తి. ˇ50,000 బహుమతిని ముష్తాక్‌తో సమానంగా పంచుకున్నారు. ఇది విస్తృత పాఠకులకు సాహిత్యాన్ని అందించడంలో రచయిత, అనువాదకుడి సహకారం ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది.

**చిన్న కథల సత్తా-బుకర్ వేదికపైకి:**

రెండో ముఖ్యమైన విషయం ఏంటంటే ఈ బహుమతి ఒక చిన్న కథల సంకలనానికి దక్కడం. సాహిత్య మార్కెట్లో నవలలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న ఈ రోజుల్లో, బుకర్ కమిటీ "హార్ట్ ల్యాంప్"ను గౌరవించాలనే నిర్ణయం చిన్న కథల ప్రత్యేకతను చాటిచెబుతోంది. దాని కచ్చితత్వం, చిన్న చిన్న సంఘటనలలోని లోతైన భావాలను పట్టుకునే దాని సామర్థ్యం, విభిన్న దృక్పథాలన్నిటినీ కలిపి ఒక అందమైన చిత్రంగా చూపగల దాని సత్తా. న్యాయమూర్తులు "అందమైన, చైతన్యవంతమైన, జీవితాన్ని ఆశావాదంగా చూపిన కథలు"గా వర్ణించిన ముష్తాక్ సంకలనం, దీనికి సరైన ఉదాహరణ. ప్రతి కథా ఒక పెద్ద, సంక్లిష్టమైన వాస్తవికతలోని ఒక కోణాన్ని ప్రతిబింబించే మెరుస్తున్న రత్నంలా ఉంటుంది.

**సాహిత్యం-క్రియాశీలత- విడదీయరాని బంధం:**

ముష్తాక్ సాహిత్య ప్రయాణం ఆమె సామాజిక సేవతో విడదీయరాని విధంగా ముడిపడి ఉంది. 1970, 80 దశకాలలో నైరుతి భారతదేశంలో కుల, వర్గ వ్యవస్థలపై విమర్శనాత్మక దృష్టి సారించిన బండాయ (తిరుగుబాటు) సాహిత్య ఉద్యమం నుండి ఆమె రచనలు పుట్టుకొచ్చాయి. ఆమె రచనలు సామాజిక విశ్లేషణకు, మార్పుకు ఒక శక్తివంతమైన సాధనంగా నిలబడ్డాయి. తన నిష్కపటమైన వాదనల కోసం ఆమె బెదిరింపులు, సామాజిక బహిష్కరణలను కూడా ఎదుర్కొన్నారు. అయినా సరే, అట్టడుగు వర్గాల జీవితాలను నమోదు చేయాలనే ఆమె తపన ఏమాత్రం తగ్గలేదు. ఆమె ఆరు కథల సంకలనాలు, ఒక నవల, ఒక వ్యాస సంకలనం, ఒక కవితా సంపుటి, వీటిలో చాలా వరకు కర్ణాటక సాహిత్య అకాడమీ అవార్డు వంటి ప్రాంతీయ గుర్తింపులను పొందాయి. ఇవన్నీ ఆమె అంకితభావానికి నిదర్శనం. ముఖ్యంగా, "హార్ట్ ల్యాంప్" ఆమె రచనలలో ఆంగ్లంలోకి అనువదించబడిన మొదటి పుస్తక రూపం. ఇది మన ప్రాంతీయ భాషల్లో ఇంకా వెలుగు చూడని ఎన్నో సాహిత్య నిధులు ఉన్నాయని గుర్తుచేస్తుంది.

**ఆంగ్ల పాఠకులకు సరికొత్త అనుభవం:**

బుకర్ న్యాయమూర్తులు "హార్ట్ ల్యాంప్"ను "ఆంగ్ల పాఠకులకు నిజంగా కొత్తదనం" గా అభివర్ణించారు. ఈ కొత్తదనం కేవలం కథల్లోనే కాదు, అవి అందించే నిగర్వియైన సత్యాలలో, మనం తప్పక ఎదుర్కోవాల్సిన కఠిన వాస్తవాలలో కూడా ఉంది. ముష్తాక్ స్వయంగా ఇలా అన్నారు: "నేను విస్తృతంగా పరిశోధనలు చేయనుబీ నా హృదయమే నా అధ్యయన క్షేత్రం." ఆమె ఈ లోతైన వ్యక్తిగత, సానుభూతితో కూడిన విధానం వల్ల వ్యక్తిగత స్థాయిలోనూ, మానవజాతి సార్వత్రిక స్థాయిలోనూ ప్రతిధ్వనించే కథలను సృష్టించగలిగారు. ఈ ఆశాదీపం ఎప్పటికీ వెలుగుతూనే ఉంటుంది!

బాను ముష్తాక్ సాధించిన అంతర్జాతీయ బుకర్ బహుమతి ఒక అద్భుతమైన సాహిత్య గొంతుకను, ఒక ప్రతిభావంతులైన అనువాదకురాలిని, మన సజీవ సాహిత్య సంప్రదాయాన్ని, మానవ స్ఫూర్తి యొక్క అజేయ శక్తిని వేడుక చేసుకునే సమయం. అంచులనుండి వెలువడే కథలను మరింత శ్రద్ధగా వినమని ఇది మనందరికీ ఒక తక్షణ పిలుపునిస్తుంది. ఎందుకంటే, మన భాగస్వామ్య మానవత్వం గురించి అత్యంత లోతైన అంతర్దృష్టులను మనం తరచుగా ఈ కథల నుండే తెలుసుకుంటాము. ఈ అవార్డు భారతీయ ప్రాంతీయ సాహిత్యం పట్ల మరింత ఆసక్తిని రేకెత్తిస్తుందని, విస్తృతమైన గొంతుకలను అనువదించి ప్రచురించడాన్ని ప్రోత్సహిస్తుందని మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుదాం. తద్వారా ఆంగ్ల సాహిత్య ప్రపంచం మాత్రమే కాకుండా ప్రపంచంపై మన సమిష్టి అవగాహన కూడా సుసంపన్నం అవుతుంది. "హార్ట్ ల్యాంప్" నిజంగా ఒక కొత్త దారిని వెలిగించింది, దాని వెలుగు శాశ్వతంగా ఉంటుందని మనం నమ్ముదాం.



కింజరాపు అమరావతి
82472 86357

## తొందరపడవద్దు!


పచ్చిమాంసంతింటూ
కొండగుహల్లోనూ
చెట్ల తొర్రల్లోనూ
జీవించే తొలిదశ!

ఇళ్ళు నిర్మించుకొని
వ్యవసాయం చేస్తూ
నదీతీరాల్లోజీవించే
గ్రామరాజ్యాలదశ!

దండయాత్రలతో
రాజ్య విస్తరణ!
సామ్రాజ్యాలు
చట్టాలు శిక్షలు!

ఆ కాలపరిస్థితుల్లో
దేవుణ్ణి సృష్టించటం
గుళ్ళు నిర్మించటం
ప్రజల్లోఅది క్రమశిక్షణ!

రానురానువ్యాపారం
సముద్రమార్గాలు




రోడ్డు మార్గాలు-నేటికి
విమాన మార్గాలు!
సంపాదనమొదలై
లాభ నష్టాలు
కుట్రలు కుయుక్తులు
స్వార్థ సమాజం!
నేడు ఆధునికం!
ప్రకృతి రహస్యాలు
సైన్స్ వెల్లడించగా

దేవుడితో పనిలేదు!
లేడని చెప్పాలంటే
వివక్షలు వైషమ్యాలు
లేనిసమాజంలోమాత్రమే
అది సాధ్యమౌతుంది!
అదే నా ఆలోచన-నా
సామాజిక బాధ్యత!
మెల్లమెల్లగా చెపుతాను
ఖచ్చితంగా చెపుతాను!
మానవ సమాజం
వివక్షా రహితమై
దేవుడి స్థానంలో
మానవత్వం నిండాలి!
సైన్స్ నాకుసహకారం
అతివాదం కాదు!
తొందరపడేది లేదు!
అన్నంఇంకాఉడకలేదు!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# మానవత్వం మాయమైన వేళ

## తెలంగాణలో దారుణ సంఘటనలు



మాతృత్వంలోని మాధుర్యం, అమ్మతనంలోని ఆత్మీయత, కుటుంబ బంధాల పవిత్రతుఇవన్నీ ఎక్కడో మాయమై, మానవ సంబంధాలు మంట కలిసిన ఈ దుర్దినంలో, తెలంగాణలో జరిగిన దారుణ సంఘటనలు సమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నాయి. పేగు బంధాన్ని ఎంగిలి విస్తరుల్లా విసిరేస్తూ, కొందరు క్రూర మృగాల కన్నా హీనంగా ప్రవర్తిస్తున్నారు. నవమాసాలు గర్భంలో మోసి, పురిటి నొప్పులు భరించి జన్మనిచ్చిన తల్లులు పిల్లలను చంపుతుంటే, మరోవైపు ప్రేమ, అక్రమ సంబంధాల పేరుతో కన్న తల్లిదండ్రులను కడతీర్చడానికి కొందరు వెనుకాడడం లేదు.

**హృదయాన్ని కలచివేసే ఘటనలు**

తెలంగాణలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు సభ్య సమాజాన్ని కలవరపెడుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో ఓ తల్లి, తన బాల్యమిత్రుడి కోసం స్వంత పిల్లలకు విషమిచ్చి చంపిన ఘటన ఇంకా మరువక ముందే, కుత్బుల్లాపూర్‌లో ఓ మైనర్ బాలిక తన ప్రియుడి కోసం కన్నతల్లిని కిరాతకంగా చంపించిన ఉదంతం సంచలనం సృష్టించింది. ఈ ఘటనలు 2018లో రెండు తెలుగు రాష్ట్రాలను కదిలించిన అమృత-ప్రణయ్ హత్య కేసును గుర్తుకు తెచ్చాయి, ఇందులో ఇరు కుటుంబాలు అపార నష్టాన్ని చవిచూశాయి. ఇటీవల సూర్యాపేట జిల్లాలో జరిగిన మరో దారుణ ఘటనలో, 30 ఏళ్ల దళిత యువకుడు వడ్లకొండ కృష్ణ తన భార్య భార్గవి కుటుంబ సభ్యులచే హత్యకు గురయ్యాడు. ఆమె కుటుంబం, ఓబీసీ సామాజిక వర్గానికి చెందినవారు, ఈ వివాహాన్ని వ్యతిరేకించారు. కృష్ణ శవం మూసీ కాలువ ఒడ్డున తీవ్ర గాయాలతో కనిపించింది. పోలీసులు ఈ హత్యను కుల ఆధారిత నేరంగా గుర్తించి, నిందితులపై ఎస్సీ/ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నవంబర్ 2024లో జరిగిన మరో ఘోర ఘటనలో, 30 ఏళ్ల స్వాతి అనే మహిళను ఆమె ప్రియుడు వీరభద్ర ఆర్థిక వివాదాల నేపథ్యంలో హత్య చేసి, ఆమె శరీరాన్ని 20 ముక్కలుగా కోసి ఖననం చేశాడు. ఈ ఘటన స్థానికుల్లో తీవ్ర భయాందోళనలను రేకెత్తించింది.

**సామాజిక, సాంస్కృతిక కారణాలు**

ఈ దారుణ ఘటనల వెనుక సామాజిక, సాంస్కృతిక అంశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. "మానవ సంబంధాలు రోజురోజుకు దూరమవుతున్నాయి. సోషల్ మీడియా, మొబైల్‌లలో అసభ్యకర కంటెంట్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం యువత మనస్తత్వాన్ని వక్రీకరిస్తున్నాయి," అని కవి, పాత్రికేయుడు మోహన్ బైరాగి ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు ఒకచోట కూర్చున్నా, ఒకరి ఆలోచనలను మరొకరు పంచుకోవడం లేకపోవడం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.

2024లో తెలంగాణలో నేరాలు 22.5% పెరిగాయని, ముఖ్యంగా మహిళలపై నేరాలు 4.8% పెరిగాయని రాష్ట్ర డీజీపీ జితేందర్ వెల్లడించారు. రాష్ట్రంలో మత్తు పదార్థాల స్వాధీనం, సైబర్ నేరాలు కూడా గణనీయంగా పెరిగాయి, ఇవి ఈ దారుణ ఘటనలకు దోహదం చేస్తున్నాయి.


**సమాజంలో మార్పు అవసరం**

ప్రేమించడం తప్పు కాదు, కానీ ప్రేమ పేరుతో కుటుంబ బంధాలను, నీతిని విస్మరించడం సమాజానికి సవాలు. బంగారు భవిష్యత్తు కోసం యుక్తవయసులో ఉన్న యువత జైలు గోడల మధ్య జీవితాన్ని గడపడం స్వయంకృతాపరాధం. కుటుంబ సంబంధాలను బలోపేతం చేయడం, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కల్పించడం, మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేయడం అవసరం.

మేధావులు, నాయకులు ఈ సమస్యపై ఆలోచించాలి. చట్టాలను మరింత కఠినతరం చేయడం, కౌన్సెలింగ్ కార్యక్రమాల ద్వారా యువతలో నైతిక విలువలను పెంపొందించడం, కుటుంబ సంబంధాలను బలపరిచే చర్యలు తీసుకోవడం ద్వారా ఈ విషాదాలను నివారించవచ్చు. తెలంగాణలో జరిగిన ఈ దారుణ ఘటనలు మానవత్వం మాయమవుతున్న వేళలో ఒక హెచ్చరిక. కుటుంబ బంధాలను గౌరవించడం, ప్రేమను నీతిబద్ధంగా గెలిపించుకోవడం, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడం ద్వారా మాత్రమే ఈ సమస్యలను అధిగమించగలం. ఇది కేవలం తెలంగాణ సమస్య కాదు, ఇది మన సమాజం మొత్తం ఎదుర్కొంటున్న సవాలు.

# ఇరాన్ సుప్రీం ఖమేనీ నాయకత్వం భేష్

*అలీ హొస్సేనీ ఖమేనీ ఇరాన్ యొక్క సుప్రీం నాయకుడిగా 1989 నుండి దేశ రాజకీయ, మతపరమైన మరియు సైనిక వ్యవహారాలను నడిపిస్తున్న ఒక ప్రముఖ వ్యక్తి. 36 సంవత్సరాలకు పైగా ఈ పదవిలో కొనసాగుతూ, మధ్యప్రాచ్యంలో అత్యధిక కాలం పాలన సాగించిన నాయకులలో ఒకరిగా, ఇరాన్ చరిత్రలో షా మొహమ్మద్ రెజా పహ్లవి తర్వాత రెండవ అత్యధిక కాలం పాలించిన నాయకుడి గా నిలిచారు. ప్రస్తుతం ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న సంఘర్షణలో ఖమేనీ యొక్క నాయకత్వం అంతర్జాతీయ రాజకీయా లలో కీలకమైన చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యాసం ఖమేనీ యొక్క గతం, ప్రస్తుత స్థితి మరియు అతని నాయకత్వం యొక్క ప్రభావాన్ని విశ్లేషిస్తుంది.*



**ఖమేనీ యొక్క రాజకీయ ప్రస్థానం**

అలీ ఖమేనీ ఒక షియా మత గురువుగా (అయతొల్లా) తన జీవితా న్ని ప్రారంభించారు. 1979లో ఇరానియన్ విప్లవం సమయంలో, షా పహ్లవి రాజవంశాన్ని పడగొట్టడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. విప్లవం తర్వాత, ఖమేనీ ఇరాన్ యొక్క రాజకీయ నిర్మాణంలో వేగంగా ఎదిగారు. 1981 నుండి 1989 వరకు ఇరాన్ అధ్యక్షుడిగా పనిచేశారు, ఆ తర్వాత సుప్రీం లీడర్ రుహొల్లా ఖొమేనీ మరణం తర్వాత సుప్రీం నాయకుడిగా నియమితుల య్యారు. సుప్రీం నాయకుడిగా, ఖమేనీ ఇరాన్ యొక్క రాజ్యాంగం ప్రకారం అత్యున్నత అధికారాన్ని కలిగి ఉన్నారు. ఆయ న సైన్యం, న్యాయవ్యవస్థ, మీడియా, అధ్యక్ష ఎన్నికల పర్యవేక్షణపై నియంత్రణ కలిగి ఉన్నారు. ఈ విస్తృత అధికారాలు ఇరాన్ యొక్క రాజకీయ వ్యవస్థను ఒక థియోక్రటిక్ (మతపరమైన) నిర్మాణంగా బలపరిచాయి, దీనిలో ఖమేనీ అంతిమ నిర్ణయాధికారి గా ఉన్నారు. ఆయన పాలనలో, ఇరాన్ అంతర్జాతీయంగా అణు కార్యక్రమం, ప్రాంతీయ సంఘర్షణలలో పాత్ర, మరియు అమెరికా-ఇజ్రాయెల్ వ్యతిరేక వైఖరి కారణంగా వివాదాస్పద దేశంగా మారింది.

**ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో ఖమేనీ నాయకత్వం**

2025 జూన్ నాటికి, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు ఒక పూర్తి స్థాయి సైనిక సంఘర్షణగా మారాయి. ఈ యుద్ధంలో ఖమేనీ యొక్క నాయకత్వం ఇరాన్ యొక్క సైనిక వ్యూహాన్ని రూపొందించ డంలో కీలకంగా ఉంది. ఇజ్రాయెల్ ఇరాన్ యొక్క అణు స్థావరాల పై దాడులు చేయడం, ఇరాన్ దానికి ప్రతిగా క్షిపణి దాడులతో స్పందించడం వంటి ఘటనలు పశ్చిమాసియాను అస్థిరత్వంలోకి నెట్టాయి. ఖమేనీ ఈ దాడులను సమర్థిస్తూ, ఇరాన్ "ఎవరి వేధింపు లకు లొంగదు" అని ప్రకటించారు, ఇది దేశ రాజకీయ స్థిరత్వం మరియు సైనిక సామర్థ్యంపై ఆయన ఆత్మవిశ్వాసాన్ని చాటింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇరాన్‌తో దౌత్యపరమైన పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ, ఇరాన్‌పై సైనిక చర్యలను పరిశీలిస్తున్నట్లు ప్రకటించారు. ట్రంప్ "బేషరతు లొంగిపోవాలి" అని డిమాండ్ చేయగా, ఖమేనీ దీనిని తీవ్రంగా ఖండించారు, ఇజ్రాయెల్‌పై "కఠిన శిక్ష" హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఘర్షణలో ఖమేనీ యొక్క స్థిరమైన వైఖరి, ఇరాన్‌ను ప్రతిఘటన యొక్క చిహ్నంగా నిలబెట్టిందని కొందరు భావిస్తున్నారు, అయితే ఇది అంతర్జాతీయ ఒత్తిడిని మరింత పెంచింది.

ఖమేనీ యొక్క సోషల్ మీడియా వ్యాఖ్యలు, "యుద్ధం మొదలైంది" మరియు "జియోనిస్టులపై దయ చూపబోము" వంటివి, ఇరాన్ యొక్క దృఢమైన వైఖరిని స్పష్టం చేశాయి. ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో, ఖమేనీ భద్రత కోసం బంకర్‌లో ఉన్నట్లు కొన్ని నివేదికలు సూచించినప్పటికీ, ఆయన నాయకత్వం ఇరాన్ సైన్యాన్ని ఏకీకృతం చేయడంలో విజయవంతమైంది.

**ఖమేనీ యొక్క నాయకత్వ ప్రభావం**

**1) ప్రాంతీయ శక్తి :**

ఖమేనీ యొక్క నాయకత్వంలో, ఇరాన్ మధ్యప్రాచ్యంలో ఒక ప్రధాన శక్తిగా ఆవిర్భవించింది. హిజ్బొల్లా, హమాస్ వంటి సమూహాలకు మద్దతు ఇవ్వడం ద్వారా, ఇరాన్ ఇజ్రాయెల్ మరియు అమెరికాకు వ్యతిరేకంగా "ప్రతిఘటన అక్షం"ను బలపరిచింది. ఈ వ్యూహం ఇరాన్ యొక్క ప్రాంతీయ ప్రభావాన్ని పెంచినప్పటికీ, ఇజ్రాయెల్ మరియు గల్ఫ్ దేశాలతో శత్రుత్వాన్ని మరింత లోతుగా చేసింది.

**2) అంతర్జాతీయ ఒత్తిడి :**

ఖమేనీ యొక్క దృఢమైన విదేశాంగ విధానం, అమెరికా మరియు ఇజ్రాయెల్ నుండి ఆర్థిక ఆంక్షలు మరియు సైనిక ఒత్తిడిని తెచ్చిపెట్టింది. 2025లో ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా దాడులు, ఇరాన్ యొక్క ప్రతీకార దాడులు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా చమురు ధరలపై ప్రభావం చూపాయి. హర్మూజ్ జలసంధిని మూసివేయాలన్న ఇరాన్ నిర్ణయం, ప్రపంచ వాణిజ్యానికి తీవ్ర విఘాతం కలిగించే అవకాశం ఉంది.

**3) అంతర్గత సవాళ్లు :**

ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభం, యువతలో నిరుద్యోగం, మరియు రాజకీయ సంస్కరణల కోసం పెరుగుతున్న డిమాండ్‌లు ఖమేనీ నాయకత్వానికి సవాళ్లుగా ఉన్నాయి. అయినప్పటికీ, బాహ్య శత్రువులపై (ఇజ్రాయెల్, అమెరికా) దృష్టి కేంద్రీకరించడం ద్వారా, ఖమేనీ దేశంలో ఐక్యతను కొనసాగించగలిగారు.

**4) ట్రంప్‌తో ఘర్షణ :**

ట్రంప్ యొక్క బలమైన ఇజ్రాయెల్ మద్దతు విధానం, ఇరాన్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నాలు ఖమేనీకి పెద్ద సవాలుగా మారాయి. ట్రంప్ యొక్క యుద్ధ విరామ ప్రతిపాదనలు విఫలమవడం, ఖమేనీ యొక్క రాజకీయ స్థిరత్వాన్ని, అతని దౌత్య వ్యూహాన్ని హైలైట్ చేస్తుంది.

అలీ హొస్సేనీ ఖమేనీ యొక్క నాయకత్వం ఇరాన్‌ను మధ్యప్రాచ్యంలో ఒక శక్తివంతమైన దేశంగా నిలబెట్టింది, అయితే ఇది అంతర్జాతీయ ఒత్తిడి మరియు ప్రాంతీయ సంఘర్షణలను కూడా తీవ్రతరం చేసింది. ప్రస్తుత ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో, ఖమేనీ యొక్క దృఢమైన వైఖరి ఇరాన్ యొక్క సైనిక సామర్థ్యాన్ని మరియు రాజకీయ ఐక్యతను ప్రదర్శిస్తున్నప్పటికీ, ఇది దేశాన్ని మరింత ఒంటరిగా మార్చే ప్రమాదం ఉంది. ఖమేనీ యొక్క భవిష్యత్ నిర్ణయాలు, ఇరాన్ యొక్క అంతర్గత స్థిరత్వం మరియు ప్రపంచ రాజకీయాలలో దాని స్థానాన్ని నిర్ణయించే కీలక అంశాలుగా ఉంటాయి.

# జూలై 30 వరకు ఎస్సీ, ఎస్టీ కేసుల సమస్యలు పరిష్కరించాలి

- **ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 25 (జనం సాక్షి) :** జూలై 30 వరకు ఎస్సీ, ఎస్టీ కేసుల సమస్యలు, భూముల సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ లో ఎస్సీ ఎస్టీ కమిషన్ కుల సంఘాల నాయకులు, అధికారులతోసమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారుల నిర్దేశించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పెండింగ్ కేసులు జూలై 30వ తేదీలోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి నెల అన్ని మండలాలలో పౌర హక్కుల దినోత్సవం కచ్చితంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమానికి తహసీల్దారులు, ఎస్సైలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అలా హాజరుకాని అధికారులకు శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం నుండి వచ్చే ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసమే వినియోగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంబేద్కర్ ఓవర్సీస్ పథకంపై విస్తృతస్థాయిలో అవగాహన కల్పించి ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఈ పథకాన్ని వినియోగించుకొని లబ్ధి పొందేల చూడాలని అధికారులకు ఆదేశించారు. సంక్షేమ హాస్టల్లో నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులు ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

ఇందిరమ్మ ఇండ్లు ఎస్సీ ఎస్టీలకు 41 శాతం కేటాయించినందుకు జిల్లా యంత్రాంగాన్నీ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ భూ సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుకూలంగా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్,ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం రమేష్, రాంబాబు నాయక్, శంకర్, నీలాదేవి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థుల కోసం బెస్ట్ అవైలబుల్ పథకం



**మెదక్ జిల్లా బ్యూరో, జూన్ 25 (జనం సాక్షి) :** ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పథకానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్లో తెలంగాణా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ, ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబల్ స్కీం నందు ప్రైవేటు స్కూల్ ప్రవేశం కొరకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ , గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ,షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆయన పాల్గొన్నారు. లాటరీ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో 1వ తరగతి నందు 59 మంది విద్యార్థినీ, విద్యార్థులు 5వ తరగతి నందు 61 మంది విద్యార్థినీ, విద్యార్థులు లక్కి డీప్ నందు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపిక చేసిన విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు



**జవహర్‌నగర్, జూన్ 25 (జనంసాక్షి) :** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లోని ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులకు మంజూరు ప్రతాలు ఇవ్వడానికి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వసంత అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జి తోటకూర వజ్రెష్ యాదవ్ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్,మాజీ మేయర్ శాంతి కోటేశ్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు,పలువురు నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులకి మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జి తోటకూర వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని బట్టి లబ్ధిదారులకు ప్రతి సోమవారం చెల్లింపులు జరుగుతున్నాయని,మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నాలుగు విడతల్లో లబ్దిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలోని జమ చేస్తున్నాం. బేస్మెంట్ పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు,గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత 1లక్ష25 వేలు,స్లాబ్ పూర్తయిన తర్వాత 1లక్ష75 వేలు,మిగిలిన పనులు పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు విడుదల చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గానికి మొదటి విడతలో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారని,పలు ఇండ్లు నిర్మాణాలు జరుగుతున్నాయని, మిగతా ఇండ్లను కూడా త్వరలో ప్రారంభించి పూర్తి చేయాలని లబ్ధిదారులకు తెలియజేశారు,పలు సాంకేతిక కారణాల వల్ల కొంతమందికి ఇండ్లు రాలేవని,ఇది నిరంతర ప్రక్రియ అని,ఇంకా అర్హులైన వారు ఎవరు ఉన్న వారందరికీ ఇండ్లు కేటాయించడానికి కృషి చేస్తామని తెలిపారు.

# ఆయిల్‌ఫామ్ రైతులకు తీవ్ర నష్టం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు

- **నర్మెట గ్రామంలో నిర్మిస్తున్న ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**
- **కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే ఈ ప్రాంతం ఆయిల్‌ఫామ్‌కు అనుకూలం**



**నంగునూర్ జూన్ 25 (జనం సాక్షి) :** నంగునూర్ మండలం నర్మేట గ్రామంలో లో నిర్మాణం లో ఉన్న అయిల్ ఫామ్ ఫ్యాక్టరి పనులను ఫ్యాక్టరి పనుల పురోగతి పై క్షేత్ర స్థాయి లో పరిశీలించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అనంతరం ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతు రైతులకు లాభదాయకమైన పంటలు పండాలని ఆయిల్ పామ్ ప్యాక్టరీలను మాజీ సీఎం కెసిఆర్ ఏర్పాటు చేశారు. సిద్దిపేట జోన్ కి 300కోట్లు తో ఏషియా ఖండంలోనే అత్యుతమైంది ప్యాక్టరీ నిర్మించాం. ప్రభుత్వ జీతాగాళ్ళు వలె రైతులకు ఆదాయం వస్తుంది.అన్ని జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు సహకరించాను. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు ను నిర్లక్ష్యం చేస్తుంది.కాంగ్రెస్ వచ్చాక కొత్తగా ఎక్కడ ఆయిల్ పామ్ సాగు చేయలేదుప్రభుత్వం పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగు కు సహకరించాలి. బీజేపీ దేశంలోని రైతులను చిన్నచూపు చూస్తుంది.బీజేపీ మూడు నల్ల చట్టాలు తెచ్చి రైతుల ఉసూరు పోసుకుంది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వెలేటి రాధాకృష్ణ శర్మ, మండల మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతు వెల్ఫేర్ ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య, పిఎసిఎస్ చైర్మన్ కోల రమేష్ గౌడ్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు లింగం గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కూతురు రాజిరెడ్డి , బద్దిపడగ కృష్ణారెడ్డి, ఆల్ఫామ్ ఫ్యాక్టరీ అధికారులు, వివిధ గ్రామాల బిఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరస్తులను పట్టుకోవాలి

- **జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు**



**మెదక్ జిల్లా బ్యూరో, జూన్ 25 (జనం సాక్షి) :** జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం పోలీస్ స్టేషన్ల వారిగా కేటాయించబడిన సైబర్ వారియర్లతో జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ డియస్పి శ్రీ. సుభాష్ చంద్ర బోస్ ఆధ్వర్యంలో నూతన సాంకేతిక పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ సైబర్ బాధితుల పట్ల త్వరితగతిన స్పందించి సైబర్ పోర్టల్ నందు ఫిర్యాదును నమోదు చేసి డబ్బులను త్వరితగతిన ఆపే విధంగా కృషి చేయాలన్నారు. పోలీసు వ్యవస్థలో చాలా రకాల అప్లికేషన్లు మరియు విధానాలు రూపొందించబడి ఉన్నాయని వాటిని వినియోగించి సైబర్ నేరగాళ్లను పట్టుకొని పరిశోధన చేసి తిరిగి వారికి డబ్బులు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. సాంకేతికతన పూర్తి నైపుణ్యని కలిగి ఉండి నేరస్తులను కనుగొని వారిని కోర్టులో ప్రవేశపెట్టి తగు శిక్షలు పడేవిదంగా కృషి చేసినప్పుడు మాత్రమే ఇలాంటి నేరాలు తగ్గుతాయి అని అన్నారు. ప్రతి ఒక్కరు ఉన్నత విద్యను అభ్యసించినా వారే పోలీస్ ఉద్యోగం లోకి వస్తున్నారు కాబ్బట్టి ప్రతి ఒక్కరు ఎప్పటికిప్పుడు సాంకేతిక నైపుణ్యని మెరుగు పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డి యస్పి సుభాష్ చంద్ర బోస్, డి సి ఆర్ బి ఇన్స్పెక్టర్ మధుసూదన్ గౌడ్, సైబర్ క్రైమ్ సిబ్బంది సతీష్, సాయి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**



**శంకర్‌పల్లి, జూన్ 25 (జనం సాక్షి) :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదుగా శంకర్పల్లి మున్సిపాలిటీ మరియు మండల పరిధిలో గల లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి 22 మందికి గాను రూపాయలు 22,02,552/-మరియు సీఎంఆర్ఎఫ్ 23 గాను 9,60,000/- రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నిరుపేద కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. అనంతరం మండల పరిషత్ ఆవరణలో రావులపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే యాదయ్య తో తమ ఊరికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉన్నందున వెంటనే మా ఊరి రోడ్డు సమస్య పరిష్కరించండి అంటూ గ్రామస్తులు అడిగారు. వెంటనే ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంట్రాక్టర్కు ఫోన్ చేసి రావులపల్లి రోడ్డు వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకయ్య గౌడ్, తాసిల్దార్ సురేందర్, నాయకులు సాత ప్రవీణ్ కుమార్, వెంకట్ రెడ్డి, కాడిగారి రాజశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, బొల్లారం వెంకటరెడ్డి, ఆయా చెక్కుల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ శ్రీనివాసరావు



**చిన్నశంకరంపేట, జూన్ 25 (జనం సాక్షి) :** చిన్న శంకరంపేట పోలీస్ స్టేషన్ను బుధవారం మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్లోని పలు అధికారులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు, స్టేషన్ను పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ లో పలు రికార్డులను, పరిశీలించారు. స్టేషన్లో ఉన్న కెమెరాలను పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎస్సై నారాయణతో తిరిగి పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి నరేందర్ రెడ్డి, రామాయంపేట సిఐ వెంకట్ రాజా గౌడ్, ఎస్ ఐ. నారాయణ ఉన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతు సంక్షేమానికి ప్రాధాన్యత



**యాచారం, జూన్ 25 (జనంసాక్షి) :** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని కాంగ్రెస్ పార్టీ యాచారం మండల అధ్యక్షులు నరసింహ, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లిక్కి పాండురంగారెడ్డి అన్నారు. రైతు భరోసా సంబరాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఏకకాలంలో తొమ్మిది రోజుల్లో 9000 కోట్ల రూపాయల రైతు భరోసా విడుదల చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే సాధ్యమైందని అన్నారు. అధికారంలోకి వచ్చిన నుంచి దేశానికి వెన్నెముక అయినా రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ప్రాధాన్యత ఇస్తామని చెబుతూనే రైతాంగానికి బ్రహ్మాండమైన నిధులు మంజూరు చేసిందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పేద ప్రజల సంక్షేమం నిమిత్తమై ఇచ్చిన హామీ మేరకు ఒక్కొక్క సంక్షేమ పథకాన్ని అమలు చేస్తూ పేదలంతా సంక్షేమ పథకాల లబ్ధి పొందేలా పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గులాం అక్బర్, జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్, సీనియర్ నాయకులు ఉప్పల భాస్కర్, మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, బిసి సెల్ అధ్యక్షులు తిరుమలేష్, నాయకులు బిక్షపతి గౌడ్, ముచ్చర్ల యాదగిరి, పాశం జయప్రకాష్, పాల్గొన్నారు.

# పంచాయతీ అభివృద్ధి సూచిక అమలు విధానాలపై అవగాహన

- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జిల్లా బ్యూరో, జూన్ 25 (జనం సాక్షి) :** పంచాయతీ రాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ అభివృద్ధి సూచిక (పై 2.0)లో పేర్కొన్న అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో ,మండల పరిషత్ అభివృద్ధి అధికారులు , మండల పంచాయతీ అధికారులు ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. ఈ శిక్షణలో గ్రామీణాభివృద్ధికి సంబంధించి క్రింది తొమ్మిది ప్రధాన అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. పేదరికరహిత జీవనోపాధి కలిగిన పంచాయతీ, ఆరోగ్యకర పంచాయతీ, టీబీ ముక్త గ్రామ పంచాయతీ, త్రాగునీటి సరఫరాలో స్వయం సమృద్ధిగల పంచాయతీ, శుభ్రమైన, హరిత పంచాయతీ, స్వయం సమృద్ధిగల మౌలిక సదుపాయాల పంచాయతీ, సామాజికంగా న్యాయంగా రక్షణ పొందిన పంచాయతీ, మంచి పాలన కలిగిన పంచాయతీ, మహిళలకు అనుకూలమైన పంచాయతీ లపై గ్రామ స్థాయిలో మొత్తం 147 సూచికలపై శిక్షణ ద్వారా అధికారులకు పంచాయతీ అభివృద్ధి సూచిక అమలు విధానాలపై అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మన జిల్లా గ్రామాలు ముందంజలో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా పరిషత్ సీఈఓ ఎల్లయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా శ్రీరామ్, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపిఓలు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలోనే పోలీస్ స్టేషన్ నిర్మించాలి



**జిల్లేడ్ చౌదరిగుడా, జూన్ 5 (జనంసాక్షి) :** ప్రజాతీర్పు వ్యతిరేకించినప్పుడు తిరుగుబాటు మొదలుకాక తప్పదు. ప్రజల హక్కు కాల రాస్తే అధికారుల హక్కులు ప్రజల్లోకి వస్తాయి అని అనుకోవడంతప్పుదేమో. అదేవిధంగా జిల్లేడు చౌదరి గూడ మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రజా తీర్పు అధికారుల వెన్నులో వణుకు పుట్టించింది. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు అన్ని రకాల రూపుదిద్దుకున్న అంతలోనే ఒక పోలీస్ బాస్ కు పోలీస్ స్టేషన్ స్థలం నచ్చక వనంపల్లి శివారు లాలుపాడు సమీపంలో నిర్మించాలని ఆగమేఘాల మీద పర్మిషన్ తెచ్చుకున్నారు. ఇదేమిటని మండల పప్రజాలు చింతిస్తూ అవాక్కయ్యారు. మండలంలో ఉన్న నాయకులందరూ ఏకమై ఒక జేఏసీగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. రెవెన్యూ కార్యాలయం ముందు బెటాయించి నల్ల బ్యాచులతో నిరసన తెలిపారు. ఇందులో భాగంగా బిసి సేన మండల అధ్యక్షురాలు ప్యాట జయ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ దగ్గరగా ఉంటే మహిళలు ఫిర్యాదు చేయడానికి సులువుగా ఉంటుందని అన్నారు. అది లాలుపాడు సమీపంలో నిర్మిస్తే మహిళలు రాత్రిలో ఫిర్యాదు చేయడానికి అక్కడికి పోలేరు చాలా ఇబ్బందులు ఎదురవుతాయి 24 గ్రామాలకు కేంద్రంగా ఉన్న మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గర పోలీస్ స్టేషన్ నిర్మించాలని కోరారు. లేనిచో పెద్ద ఎత్తున మహిళలతో రాస్తారోకో చేపడతామని హెచ్చరించారు. అదేవిదంగా మాజీ జడ్పిటిసి మచ్చ సుధాకర్ మాట్లాడుతూ జిల్లేడ్ చౌదరిగుడా మండల కేంద్రం లో పోలీస్టేషన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. చౌదరిగుడా రైతువేదికదగ్గర గత ప్రభుత్వంలో స్థలాన్ని కేటాయించడం జరిగింది.ఒక పోలీసు బాస్ కు అస్థలం నచ్చక లాల్పడ్ తరలించడం బాగాలేదని అన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాలిసి వస్తుంది ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అపట్లో జేఏసీగా ఏర్పడి మండలనే ఏర్పాటు చేసుకున్నాము ఈ పోలీస్టేషన్ మండల కేంద్రానికి తేలేమా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆపేజ్.జబర్.బంగారు రాములు.మాన్యాయ.కోండి యాదయ్య. బోయ చెన్నయ్య. రమేష్.కోనేరు శ్రీనివాస్. అనిల్.రాములు. జిలెడ్ వెంకటేష్.బీసీ సేన సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి

- **చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**




**చేవెళ్ల, జూన్ 25 (జనంసాక్షి) :** విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అధ్యాపకులకు సూచించారు. బుధవారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధ్యాపకులు విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. కళాశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కళాశాలలో జరుగుతున్న నూతన తరగతి గదులను త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలన్నారు. కళాశాలలో ఎలాంటి సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

# నేరాల నియంత్రణపై దృష్టి సారించి, పెండింగ్ కేసులను తగ్గించాలి

- జిల్లా ఎస్పీ యోగేష్ గౌతం

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 25 (జనం సాక్షి) :** నేరాల నియంత్ర ణపై దృష్టి సారించింది పెండింగ్ కేసులను తగ్గించాలని జిల్లా ఎస్పి యోగేష్ గౌతం అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశంలో నిర్వహించి జిల్లా పరిధిలో నేరాల నియంత్రణపై దృష్టి సారించి, పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులను త్వరి తంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టి గేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పూర్తి పారదర్శకంగా చేయాలి అన్నారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి అన్నా రు. ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని అన్నారు. ప్రతి అధికారికి సి.సి.టి.యన్.ఎస్‌పై పూర్తి అవగా హన కలిగి ఉండాలని అన్నా రు. ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. అవసరమైతే సంబంధిత న్యాయమూ ర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరి ష్కరించేలా చర్యలు తీసుకో వాలని, పెండింగ్ కేసుల విష యంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే



దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సంవర్ధవం తమైన సేవలు అందజేస్తు సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలని అన్నారు. గ్రామ పోలీసు అధికారులు ప్రతీ రోజు గ్రామానికి సందర్శించి ప్రజలతో మమేకం అవుతూ నేర నియంత్రణకు కృషి చేయాలని అన్నారు. కమ్యూని టీ పోలిసింగ్ ద్వారా గ్రామాల లో సిసిటీవిలు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ ఏర్పా టుకు కృషి చేయాలని అన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆన్లైన్ మోసాలకు గురి అయినట్లైతే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు. మాదకద్రవ్యాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృ ష్టి సారించాలని, ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లు గా గుర్తించి, సైన్ బోర్డు లను ఏర్పాటు చేయిం చాలని సూచించారు. హైవే రోడ్లను కలుపుతూ ఉండే లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్స్ వేయించడం, రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలిగించే విధంగా చూడాలని అన్నారు.రోడ్డు ఇంజనీరింగ్‌లో లోపాలున్నట్లయితే నేషనల్ హైవే స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారుల సమ న్వయంతో ప్రమాదాల నివా రణ కృషి చేయాలని అన్నా రు.అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహిం చాలని,ఓవర్ స్పీడ్,ట్రిపుల్ డ్రైవింగ్,మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో రోడ్డు భద్రత నిబంధనల గురించి అవగాహన కల్పించాలని అన్నారు.విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయా లని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని, దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు.అసాంఘిక కార్యకలాపాలు గంజాయిని ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా క్రయ విక్రయాలపైన,జూదం,పి.డి.యస్ అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన చర్యలు తీసుకో వాలని అన్నారు. రిపీటెడ్ గా ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్ ను నమో దు చేయాలని సూచించారు.

### మక్తల్ పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ

మక్తల్ పరిధిలో పలు దొంగ తనం కేసులకు సంబంధించి జూన్ నెలలో ఇద్దరు దొంగ లను పట్టుకుని జైలుకు పంపించినందున మక్తల్ పోలీసులకు రివార్డ్ అందజేసి మక్తల్ పోలీసు లను ఎస్పి గారు అభినం దించడం జరిగింది.ఈ సమావేశంలో డీఎస్పీలు ఎన్ లింగయ్య, మహేష్, సిఐలు శివశంకర్, రామ్లాల్, రాజేందర్ రెడ్డి, సైదులు, ఎస్ఐ లు వెంకటే శ్వర్లు, రాముడు రాజు, రాజా శేఖర్, రాము, భాగ్యలక్ష్మి రెడ్డి, నవీద్, రమేష్, నరేష్, సునీత, పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత

- డిఎస్పీ మొగిలయ్య



**గద్వాల నడిగడ్డ, జూన్ 25 (జనం సాక్షి) :** యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఆదేశాల మేరకు డి.ఎస్పీ వై. మొగిలయ్య గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి జిల్లా కేంద్రం లోని బాయ్స్ హై స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డి.ఎస్పీ మాట్లాడుతూ యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశానుసారం గవర్నమెంట్ హై స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని తెలిపారు. యువత ఎంతో బంగారు భవిష్యత్తు కలిగి ఉండవలసిన వారు కొంతమంది చెడు మార్గాల వైపు ఆకర్షితులవుతున్నారని మత్తుకు అలవాటు పడి గంజాయి అలవాటు చేసుకుని జీవితాలు నాశనం చేసుకుంటున్నారని వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.గంజాయి ఇతర మత్తు పదార్థాలు సేవించేవారు వారి మానసిక స్థితిని కోల్పోయి నేరాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు మానవుల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతాయని నరాలు గుండె సహా ప్రధాన అవయవాలు దెబ్బతినే అవకాశం ఉన్నదని తెలిపారు.గ్రామాలలో పట్టణాలలో మారకద్రవ్యాల విషయములో మారకద్రవ్యాలకు యువతను దూరంగా ఉంచాలని డ్రగ్ రహిత తెలంగాణ సమాజం కొరకు అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షి టీం ఎస్సై స్వాతి, షి టీం సిబ్బంది, ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి



**చేర్యాల, జూన్ 25 (జనంసాక్షి) :** చేర్యాల మండల పరిధిలోని కడవెరుగు గ్రామంలో రోడ్డు మీద చెత్తను వేయిస్తూ, ఎవరు చెప్పినా వినకుండా తను చేసిందే చట్టం,తను చెప్పిందే వేదం అన్నటుగా వ్యవహరిస్తూ గాలికి వదిలేస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత వారం రోజుల క్రితం రోడ్డుమీద చెత్తను తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి చెప్పినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి పై చట్టపరమైన చర్యలు తీసుకుని చెత్తను రోడ్డు మీద నుంచి తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కమిటీ సభ్యుడు పొనుగోటి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# యువత యాంటీ డ్రగ్స్ సోల్జర్స్‌గా పనిచేయాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 25 (జనం సాక్షి) :** నేటి యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వాడకాన్ని నిర్మూలించి భావితరాలకు బంగారు బాటలు వేసేందుకు యాంటీ డ్రగ్స్ సోల్జర్స్ గా పనిచేయాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని ముఖ్యంగా యువత భాగస్వామ్యం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వారోత్సవాలలో భాగంగా బుధవారం డీ డబ్ల్యు ఓ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ నేతృత్వంలో జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ లో కలెక్టరేట్, పోలీస్, ప్రెస్, డీ.డబ్ల్యు.ఓ మొత్తం నాలుగు జట్లు పాల్గొన్నాయి. ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్పీ, అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వారు సూచించారు. అనంతరం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ లో భాగంగా కలెక్టరేట్ పోలీస్ టీం ల మధ్య ప్రారంభ మ్యాచ్ ను ఎస్పీ, అదనపు కలెక్టర్ టాస్ వేసి ప్రారంభింపజేశారు.మొదట బ్యాటింగ్ చేసిన పోలీసు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 91 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యారు. 92 పరుగుల లక్ష్యంతో బలిలోకి దిగిన కలెక్టరేట్ జట్టు 7 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఆ తర్వాత ప్రెస్, డీ.డబ్ల్యు.ఓ జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన



ప్రెస్ టీమ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఏకంగా 148 పరుగుల భారీ లక్ష్యాన్ని విధించగా, డీ.డబ్ల్యు.ఓ జట్టు కేవలం 76 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. చివరగా మొదటి మ్యాచ్ లో గెలిచిన పోలీస్ జట్టు, రెండో మ్యాచ్ లో గెలిచిన ప్రెస్ జట్టు తుది పోరులో తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ప్రెస్ జట్టు పది ఓవర్లలో 49 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని పోలీస్ జట్టు ముందు ఉంచింది. అయితే పోలీస్ జట్టు 5 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు కోల్పోయి విజయాన్ని సొంతం చేసుకుంది. గెలుపొందిన విన్నర్, రన్నర్ జట్లకు జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హాక్, డిపిఆర్ఓ ఎం.ఏ. రషీద్ కప్ లను అందజేసి ఇరు జట్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి నల్లపు లింగయ్య, ఆర్ఐ నరసింహ, డి వై ఎస్ ఓ వెంకటేష్, స్థానిక ఎస్.ఐ. వెంకటేశ్వర్లు, కలెక్టరేట్, పోలీసు, డిడబ్ల్యుఓ, మీడియా మిత్రులు, వ్యాయామ ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట యోధులకు ఘన సన్మానం



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూన్ 25 (జనం సాక్షి) :** నాటి ప్రధాని ఇందిర్గాంధీ దేశంలో విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసి జైలు జీవితం గడిపిన పోరాట యోధులకు బుధవారం నారాయణపేటలో బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట యోధులు జి.కుర్మన్న, కుంటి ఎల్లప్ప, జి.నింగిరెడ్డి, నాగురావు నామాజీ, రమేష్, సంఘం నాథ్, నర్సింహులు పాల్గొన్నారు. వీరిని రాష్ట్ర బిజెపి కార్యవర్గసభ్యులు కే. రతంగ పాండు రెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్, మాజీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, నాయకులు ఆశప్పా, ఈ.వెంకట్ రాములు, సాయిబన్న, గణప శ్రీనివాస్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ నాటి జైలు అనుభవాలను వారు గుర్తు చేస్తూ కార్యకర్తలకు వివరించారు. స్వార్థం కోసమే కాంగ్రెస్ పని చేస్తున్నదని వారు విమర్శించారు. కానీ ఏ స్వార్థం లేకుండా దేశ హితం కోసం సర్వం త్యజించి ప్రధాని నరేంద్రమోడీ పనిచేస్తున్నారని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని దేశం కోసం పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్,ప్రధాన కార్యదర్శి వడ్డే దత్తు, నాయకులు వై.నారాయణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చిన్న రఘు, నక్క సత్యనారాయణ ఉమాకాంత తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం విషయంలో రాజీపడేది లేదు

- మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి కనకయ్య



**చేర్యాల, జూన్ 25 (జనంసాక్షి) :** తెలంగాణ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి కనకయ్య అన్నారు. వానాకాలం పంటల సాగు కోసం రైతుభరోసా నగదు బదిలీ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో కనకయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జనగామ జిల్లా డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బండారి కనకయ్య మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల్లో రూ.కోట్లలో రైతు భరోసా నిధులు విడుదల చేసి, కోటి 49 లక్షల 39వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎకరాకు రూ.12 వేల చొప్పున అన్ని వ్యవసాయ భూములకు ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా రైతు సంక్షేమం విషయంలో రాజీ పడకుండా పెట్టుబడి సాయం అందించారంటూ సీఎం రేవంత్‌కి కృతజ్ఞతలు తెలిపారు. రుణమాఫీ పథకాన్ని కూడా ఇలాగే 2024 ఆగస్టు 15 లోగా పూర్తిచేశామని చెప్పారు. కేంద్రం కొనుగోలు చేయలేని పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయిస్తోందని కొమ్మురవి పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు ఇవేమీ కడపడటం లేదా..? రైతులకు మేలు చేసే ప్రభుత్వంపై బురదజల్లడమేనా..? అని కనకయ్య ధ్వజమెత్తారు. రోజుల్లో రూ.9 వేల కోట్ల నగదు బదిలీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే అరుదైన రికార్డు అని అన్నారు. రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రైతులకు బాసటగా నిలవాలనే సంకల్పంతోనే రైతు భరోసా పథకం

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, జూన్ 25 (జనం సాక్షి) :** రైతులకు బాసటగా ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రైతు భరోసా నిధులను వారి వారి ఖాతాలలో జమ చేయనుందని తెలిపారు. పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతు భరోసా ఉపయుక్తంగా నిలుస్తుంది. అధికారికంగా నమోదు పూర్తయిన వారికి రైతు భరోసా కింద ఎకరాకు 6 వేల రూపాయలు చొప్పున ఏడాదికి రెండు సార్లు 12 వేల రూపాయల ఆర్థిక సాయం అందుతుంది. రైతు భరోసా కింద ఇప్పటి వరకు మెదక్ జిల్లాలో 2,62,340 మంది రైతుల ఖాతాల్లో రూ.221.15 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు.

# ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా సహకరిస్తేనే డ్రగ్స్, గాంజా అంతం

- పాలెం ఏజీ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన
- జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

**బిజినేపల్లి, జూన్ 25 (జనం సాక్షి) :** ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా సహకరిస్తేనే డ్రగ్స్, గాంజా మహమ్మారిని అంతం చేయడం సాధ్యమవుతుందని నాగర్కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. మండలంలోని పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో బుధవారం యాంటీ డ్రగ్స్ వారోత్సవాల్లో భాగంగా ఏజీ బీఎస్సీ విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు యువత బానిసలై బంగారు భవిష్యతును నాశనం చేసుకుంటున్నారని అవేదన వ్యక్తం చేశారు. చెడు వ్యసనాలకు లోనవ్వకుండా లక్ష్యంతో ఉన్నత విద్య అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యతు కోసం ఎంతో కష్టపడి చదివిస్తున్న కొందరు యువత పెడదారి పట్టి జీవితాలను నాశనం చేసుకొని తీరని శోకం మిగుల్చుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పుడికప్పుడు వారి నడవడికను గమనిస్తుండాలని తెలిపారు. ప్రపంచ దేశాలన్నింటి కంటే భారతదేశంలో యువతరం జనాభా అధికంగా ఉందని, డ్రగ్స్




వంటి మత్తు పదార్థాలకు బానిసలై చిత్తవోద్దని హెచ్చరించారు. డ్రగ్స్ వ్యాప్తిని, వినియోగాన్ని ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా అడ్డుకోవాలన్నారు. అన్ని పోలీసులే వచ్చి అడ్డుకోవడం సాధ్యకాదని, ప్రజలు కూడా భాగస్వామ్యులైనప్పుడే విజయవంతంగా యాంటీడ్రగ్స్ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్న గాంజ, డ్రగ్స్ వి నియోగం ఇప్పిడిప్పుడే తెలంగాణ రాష్ట్రంలో తీవ్రస్థాయిలో విస్తరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదిలోనే ఐకమత్యంగా ఎక్కడిక్కడ డ్రగ్స్ ౹ు అనిచివేస్తే డ్రగ్స్ మహమ్మారి నుంచి యువతను కాపాడుకోవచ్చని అన్నారు. సోషల్ మీడియా ప్రభావం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూడా గాం డ్రగ్స్ అమ్మకాలు, వినియోగం విస్తరిస్తుందన్నారు. సోషల్ మీడియా, సెల్ఫోన్ లను మంచి విషయాలకు మాత్రమే వినియోగించాలని యువతకు సూచించారు. ఈ ప్రాంతంలో గాంజ వాడకం జరుగుతుందని విశ్వసనీయ సమాచారం ఉన్నందునే ఇక్కడ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ వ్యాప్తిపై చాలా కఠినంగా ఉందన్నారు. అనవసరంగా డ్రగ్స్ కు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేస కోవద్దన్నారు. ఎవ్వరైనా మొదటి సారి డ్రగ్స్ వినియోగించినట్లు తెలిస్తే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ఎలాంటి కేసులు పెట్టకుండా వదిలేస్తామన్నారు. పదే పదే డ్రగ్స్ తీసుకున్నట్లు గుర్తిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు స్కూల్ స్థాయి నుంచి కళాశాల స్థాయికి రావడంతో ఒకసారిగా స్వతంత్ర పక్షులుగా వ్యవహరించి తమకు తెలియకుండానే చెడు వ్యసనాలకు ఆకర్షితులవుతున్నారని, కళాశాలల్లో అధ్యాపక లు లక్ష్యసాధన వైపు సాగేలా అవగాహన కార్యక్రమాలు విరివిగా నిర్వహించి యువత బంగారు భవిష్యతుకు బాటలు పర్చాలని తెలిపారు. అనం తరం యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ విద్యార్థులతో కలిసి చేసి యాంటీ డ్రగ్స్ పోస్టర్ను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐ కనకయ్య, ఎస్ఐ శ్రీనివాస్, కళాశాల ఏడీ డాక్టర్ పుష్పావతి, శాస్త్రవేత్తలు డాక్టర్ శశిభూషన్, డాక్టర్ ఈటల సత్యనారాయణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్షర కాన్సెప్ట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి



**వెల్దండ, జూన్ 25 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని అక్షర కాన్సెప్ట్ స్కూల్లో అక్రమంగా పుస్తకాల దందా నిర్వహిస్తున్న యాజమాన్యపై చర్యలు తీసుకోవాలని పిడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు సంతోష్ అన్నారు. బుధవారం విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బుక్స్ అమ్మే అనుమతి లేకున్నా వెల్దండ అక్షర కాన్సెప్ట్ స్కూల్లో ప్రిన్సిపాల్ రూమ్లో బహిరంగంగా పుస్తకాలు పెట్టుకొని అమ్ముతున్నారని అన్నారు. అనంతరం ఎంఈఓ చంద్రుడికి పాఠశాలపై వినతి పత్రాన్ని అందజేశారు.మండలంలోని మిగతా అన్ని ప్రైవేట్ స్కూల్లను ఎం ఈ ఓ తనిఖీలు చేసి అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్ అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు అనంతరం ఎమ్ ఈ ఓ స్పందిస్తూ త్వరలో స్కూల్ యాజమాన్యంపై సోకాజ్ నోటీస్ ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు కార్తీక్,నితిన్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి జిల్లాలో పోలీసుల నిఘా

- ముమ్మరంగా వాహనాల తనిఖీలు
- మారుమూల ప్రాంతాల్లో పోస్టర్లు..
- గాజర్ల రవి స్వగ్రామమైన వెలిశాలపై ప్రత్యేక దృష్టి..








**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పోలీసులు గట్టి నిఘా వేశారు.. వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు.. మావోయిస్టులకు ఆశ్రయం కల్పించొద్దని, వారిని పట్టించి తగిన పారితోషికం పొందాలని కోరుతూ మారుమూల ప్రాంతాల్లో వాల్ పోస్టర్లు అంటించారు.. ముఖ్యంగా మారేడుమిల్లి ఎన్ కౌంటర్ మృతుడు గాజర్ల రవి అలియాస్ గణేశ్ స్వగ్రామమైన వెలిశాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.. అంత్యక్రియలు జరిగిన రోజు కూడా రహస్యంగా నిఘా వేసినట్లు తెలిసింది.

ఏపీలోని అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీప్రాంతంలో ఈ నెల 18న తెల్లవారుజామున జరిగిన ఎన్ కౌంటర్ లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత, చర్చల ప్రతినిధి, కేంద్ర కమిటి సభ్యుడు, ఏఓబి కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ గణేశ్, అలియాస్ ఉదయ్ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా స్వగ్రామమైన వెలిశాలలో రవి అంత్యక్రియలు ఘనంగా జరిగాయి. కుటుంబసభ్యులు, సానుభూతిపరులు, అభిమానులు, పౌరహక్కుల నేతలు, విరసం నేతలు, బంధుమిత్రుల కమిటీ సభ్యులు, మాజీలు భారీగా తరలివచ్చారు. ఎర్ర జెండాలు, విప్లవ గేయాలు, నినాదాలతో వెలిశాల హోరెత్తింది. అయితే పోలీసులు కూడా అంత్యక్రియలకు మఫ్టీలో వచ్చి ఎవరెవరు హాజరయ్యారనే దానిపై ఆరా తీసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ, అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించి వదిలేస్తున్నారు. మరికొన్ని చోట్ల బండి నంబర్ చెక్ చేసి, దానిపై ఉన్న చలాన్లను ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలోను నిఘా తీవ్రతరం చేశారు. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని సరిహద్దు గ్రామాలలో హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాల నుండి కాళేశ్వరం, కాటారం, భూపాలపల్లి ప్రాంతాలకు మావోయిస్టులు వచ్చే అవకాశం ఉందని భావించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగుతున్నారు. అదేవిధంగా భూపాలపల్లి మండలంలోని మారుమూల గ్రామాల్లో జిల్లా పోలీసుల పేర హెచ్చరికలు జారీ చేస్తూ పోస్టర్లు వెలువడడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లోకి మావోయిస్టులను రానివ్వొద్దని, వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూనే, మావోలు వస్తే సమాచారం ఇవ్వాలని, తగిన పారితోషికం ఇస్తామని, మీ పేరు రహస్యంగా ఉంచుతామని పోస్టర్లలో పేర్కొన్నారు. దీంతో పాటు ఆయా మండలాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండి అన్ని కోణాల్లో నిఘా ఉంచారు. వెలిశాలలో గాజర్ల రవి దశదినకర్మ రోజు కూడా సంస్మరణ సభకు ఎవరెవరు వస్తున్నారు? స్థూపాలు ఏమైనా ఏర్పాటు చేస్తారా అనే విషయాలపై ఇప్పటినుండే ఆరా తీసే పనిలో పోలీసులు ఉన్నట్లు తెలుస్తుంది. ఇదిలాఉండగా ఓ మండలంలోని సరిహద్దు గ్రామాల్లో మావోల కదలికలు ఉన్నాయనే ప్రచారం జరుగుతుంది. ఏదిఏమైనా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది.

## ఉప్పరపల్లి వైన్స్ షాప్‌ను తరలించండి

- యువత చెడిపోవడానికి కారణమని గ్రామస్తుల ఆగ్రహం

**చెన్నారావుపేట, జూన్ 25 (జనంసాక్షి) :** మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వైన్ షాప్ ను తరలించాలని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన సెంటర్లో వైన్ షాపు ఉండడం మూలంగా గ్రామ యువత చెడు అలవాట్లకు, మద్యానికి బానిసలై బలైపోతున్నారని గ్రామంలోని పలు సంఘాలు, రాజకీయ నాయకులు, యువకులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, వ్యవసాయదారులు గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే గ్రామంలోని వైన్ షాపును వేరే చోటుకి తరలించాలని లేనిచో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇటీవల కాలంలోనే యువత మద్యానికి అలవాటు పడి రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు తగిన చొరవ తీసుకుని వైన్ షాప్ ను తరలించాలని డిమాండ్ చేశారు.

## జేసీబీ, కారు ఢీ

- కారులో ఇద్దరు వ్యక్తుల అక్కడికక్కడే మృతి
- ఆదిలాబాద్ జిల్లా వాఘాపూర్ సమీపంలో ఘటన



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం వాఘాపూర్ గ్రామ సమీపంలో గల జాతీయ రహదారిపై బుధవారం జేసీబీ, కారు రెండు ఢీ కొన్న ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారు బోల్తా కొట్టి పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదంలో మృతి చెందిన వారు జైనూర్ మండలానికి చెందిన వారుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్ఎస్పీసి 2025 పోస్టర్ ఆవిష్కరణ

- జూలై 1 నుంచి పర్యావరణ క్విజ్ పోటీకి నమోదు ప్రారంభం



**ములుగు ప్రతినిధి, జూన్ 25(జనంసాక్షి) :** జిల్లాలో నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ పోటీ (ఎన్ఎస్పిసి ) 2025 పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. "వాతావరణ మార్పుల పర్యవసానాల నుండి రక్షణకు విద్యార్థులలో పర్యావరణ నైపుణ్యాలు, జీవన శైలిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, వ్యర్థాల వేరుచేసే అలవాట్లను విద్యార్థులలో అలవరచాల్సిన అవసరం ఉంది," అని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ తయారుచేసిన పోస్టర్ ని విడుదల చేసి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు జిల్లా లోని అన్ని విద్యా సంస్థలు ఈ పోటీలో పాల్గొన వలసిందిగా పిలుపునిచ్చారు. "హరిత్ – ది వే అఫ్ లైఫ్ " అనే థీమ్‌పై దేశవ్యాప్తంగా ఎన్ ఎస్ పి సి పోటీని పర్యావరణ సంరక్షణ గతివిధి (పిఎస్జి ) నిర్వహిస్తోంది. ఈ పోటీకి జూలై 1 నుండి ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంటుంది. ఈ పోటీకి కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహాయ సహకారం ఉంది. ఫలితాలు ఆగస్టు 30న ప్రకటించబడతాయి.

## విద్యా నాణ్యత పెంపుకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, జూన్ 25 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదు వుతున్న విద్యార్థులకు ప్రైవేట్ కు ధీటుగా నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సోన్ కస్తూర్బా గాంధీ బాలికల వసతి పాఠశాల (కేజీబీవీ)ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రిజిస్టర్లు,హాజరు, తరగతి గదులు, వసతిగృహం, మరుగుదొడ్లు,భోజనశాల, స్టోర్‌రూమ్ లను కలెక్టర్ పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేసారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని సూచించారు. బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికతో సిద్ధం కావాలన్నారు. విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పి. రామారావు,తహసిల్దార్ మల్లేష్,ఎంపీడీవో సురేష్, విద్యాశాఖ అధికారులు పరమేశ్వర్,సలోమి, లింబాద్రి,ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు లతాదేవి ఉపాధ్యాయులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి యువరైతు బలి

**నేరడిగొండ జూన్25 (జనంసాక్షి) :** మండలంలోని లింగట్ల గ్రామానికి చెందిన యువరైతు సాబ్లే సుభాష్ బుధవారం రోజున తన చేనులో పత్తి పంటకు కలుపు తీస్తున్న క్రమంలో వేలాడుతూ ఉన్న విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గత కొన్ని నెలల నుండి విద్యుత్ తీగ వేలాడుతున్న విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా దానిని బాగు చేయాలని ఎన్నో సార్లు మొర పెట్టుకున్న పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమైతే. దీనికి నేడు ఒక నిరుపేద యువ రైతు మృతి చెందాడు. బాధిత రైతుకు 24 గుంటలు భూమి కలదు,మిగత కొంత వేరే వాళ్ల చెను కౌలు బటాయికి పట్టుకుని భూమి సాగు చేస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు.



# విస్తృత పర్యటన, అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- కార్మిక,మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



**చెన్నూర్, జూన్ 25 (జనంసాక్షి) :** నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్మిక మైనింగ్ శాఖ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం నియోజకవర్గ సమస్యలపై పలువురు వినతి పత్రం సమర్పించారు. మంత్రి స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో అన్ని సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అనంతరం పాత బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రైతు భరోసా సంబరాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ఎంపి వంశీకృష్ణ చిత్రపటాలకు నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 34 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రిబ్బన్ కట్ చేసి పనులు ప్రారంభించారు. మండలంలో సుబ్బరంపల్లి, కిష్టంపేట గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసే కార్యక్రమంలో పాల్గొని పనులు ప్రారంభించారు. విస్తృత పర్యటంలో భాగంగా భీమారం మండలంలో కస్తూరిబా గాంధీ పాఠశాలలో 66 లక్షల నిధులతోఅదనపు డార్మెటరీ గదుల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి శంకుస్థాపన చేసి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు అన్ని పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం లో రేవంత్ రెడ్డి అమలు చేయడం జరుగుతుందని ఉచిత బస్సులు,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రైతు భరోసా పథకములో తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రూపాయల నిధులు విడుదల చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు,అధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ రెడీ

- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** రానున్న వర్షాకాలం దృష్ట్యా , జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఒకవేళ చోటు చేసుకున్న వాటి నుంచి ఎలాంటి ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరగకుండా కాపాడడానికి జిల్లా విపత్తు నిర్వహణ బృందం డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ 20 మంది పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ బుదవారం నియమించారు. సాత్ నాల మండలంలోని ప్రాజెక్టు లో సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ టీమ్ పక్కా ప్రణాళికతో ఎప్పుడు అలర్ట్ గా ఉంటారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఈ విపత్తు నిర్వహణ బృందం జిల్లాలో ఒక రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ స్థాయి ఆధ్వర్యంలో 20 మంది పోలీసు సిబ్బందితో శిక్షణ పూర్తి అయి, ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో వరదలు సంభవించినప్పుడు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు, రోడ్లపై చెట్లు విరిగిపడ్డ సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తమదైన శైలిలో వ్యవహరిస్తూ ప్రజలకు పోలీసులు మీకు ఉన్నాం అంటూ రక్షణ కల్పిస్తామని తెలిపారు. ఈ బృందం హైదరాబాద్ లో వారం రోజులు పాటు శిక్షణ తీసుకొని అత్యవసరంగా స్పందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు డి సాయి నాథ్, కె ఫణిదర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి, ఎన్ చంద్రశేఖర్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రాకేష్, డిడిఆర్ఎఫ్ బృంద సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# గురుకుల పాఠశాల స్థాయిలో అభివృద్ధి చేస్తా

- కార్పొరేట్ విద్యా సంస్థల కంటే మెరుగైన ఫలితాలు సాధించాలి
- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్పూర్, జూన్ 25 (జనంసాక్షి) :** గిరిజన హాస్టల్ ను ఆశ్రమ పాఠశాలగా అప్ గ్రేడ్ చేయించడంతో పాటు గురుకుల పాఠశాల స్థాయిలో అభివృద్ధి చేస్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని గిరిజన హాస్టల్ డార్మీటరీ భవన ప్రారంభోత్సవకార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిలాఫలాకాన్ని ఆవిష్కరించి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ గిరిజన హాస్టల్ భవనం పూర్తిగా నిరూపయోగంగా ఉందని నా దృష్టికి వచ్చిన వెంటనే 63లక్షల 50వేల రూపాయలు మంజూరు చేయించి పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేయించి ఈ రోజు పునర్ ప్రారంభించుకున్నామని తెలిపారు. అతిత్వరలో నే గిరిజన వసతి గృహాన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రహరీ గోడ, ల్యాండ్ లేవలింగ్ చేయాల్సిన అవసరం ఉందని దీనికి త్వరలోనే ప్రతిపాదనలు పంపి మంజూరు చేయి స్తానని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఎక్కడా లేనన్ని గురుకుల పాఠశాలలు ఉన్నాయని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని గురుకుల, కస్తూరిభా, మాడల్, ఆశ్రమ పాఠశాలల ప్రిన్సిపాల్స్ తో సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఆర్డీవో వెంకన్న, డిటిడివో ప్రేమకళ, తాహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడివో విజయ శ్రీ, డిఈవో భోజన్న, ఎంఈఓ కొమురయ్య, ఏటిడిఓ రూపా దేవి, ఏఈ వినీల్, హెచ్ఎం సోమ్లా నాయక్,హెచ్ డబ్ల్యుఓ వెంకటే ష్, ఏవో నాగసాగర్, నాయకులు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, బెలిదె వెంకన్న, పోగుల సారంగపాణి,సింగపురం వెంక టయ్య, నాగరబోయిన శ్రీరాములు, వెంకటేశ్వర్ రెడ్డి,నీల నరసింహులు,భూక్య రమేష్ నాయక్,స్వామి నాయక్, ఫాతికుమార్, కొర్ర వెంకటేష్ నాయక్,గిరిజన సంక్షేమ శాఖఅధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్



**మహబూబాబాద్ బ్యూరో, జూన్ 25 (జనం సాక్షి):** జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, బుధవారం బయ్యారం మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక అయిన నామలపాడు పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఇళ్ళ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. విడతల్లో 5 లక్షల రూపాయలను ప్రభుత్వం సహాయం అందుతుందని అన్నారు. త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యచరణ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం సూచించిన విధంగా జిల్లాలో ప్రత్యేక నోడల్ అధికారులను నియమించి ఇందిరమ్మ కమిటీల ద్వారా ప్రభుత్వ సూచనల ప్రకారం వచ్చిన ఐ టి డి ఏ, పట్టణ గ్రామలాల దరఖాస్తుల లబ్ధిదారులకు 85 శాతం గ్రౌండ్లో పూర్తిచేసి నిర్మాణాలను వేగవంతం చేయడం జరిగిందని, ప్రొసీడింగ్ కాపీలను కూడా పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. మహిళ సంఘాలలో సభ్యులుగా ఉన్న వారికి నిర్మాణం నిమిత్తం బ్యాంకు రుణాలను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాదులకు సంబందించిన అన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, సూచించారు, పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ మరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో విజయలక్ష్మి, డాక్టర్ విజయ్, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలపై తీసుకున్న చర్యలు ప్రశంసనీయం

- జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 25 (జనంసాక్షి) :** భూగర్భ జలాలపై తీసుకున్న చర్యలు ప్రశంస నీయం అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. బుధ వారం కేంద్ర జల శక్తి బృంద సభ్యులు సైంటిస్ట్ సుధీర్, డిప్యూటీ డైరెక్టర్ చరణ్, ఆదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తో కలిసి స్టేషన్ ఘనపూర్ డివిజన్‌లోని తాటికొండలో పర్యటించారు. తాటికొండ రైతు వేదికలో మహిళాసంఘ సభ్యులతోసమావేశమై తాగు నీటి సరఫరాపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్టేషన్ ఘన్పూర్‌లో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడం ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగాయని వ్యవసాయంపై ఆధార పడి ప్రజలు జీవిస్తున్నట్లు కేంద్ర బృందానికి వివరించారు. మత్స్యశాఖ ద్వారా ఫిష్ పాండ్ జీవనోపాధి సాధి స్తున్న మారపాక రాములు నిర్వహణ తీరును కేంద్ర బృందానికి వివరించారు. గ్రామంలో నాలుగు ఎకరాల్లో మామిడి చెట్లు సాగు చేపట్టిన గుగులోతు రమేష్ రైతుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ వసంత, వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయక్, మత్స్యశాఖ అధికారి రాణా ప్రతాప్ అదనపు డిఆర్డిఏ పిడి చంద్రశేఖర్, గ్రామపంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నివారణే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ ప్రతినిధి, జూన్ 25(జనంసాక్షి):** మత్తు పదార్థాల నివారణే లక్ష్యంగా అధికారులు సమష్టిగా పని చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డిసిపి అంకిత్ కుమార్‌తో కలిసి జిల్లాస్థాయి నార్కోటిక్ సమన్వయ సమావేశం నిర్వహించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, నషా ముక్త్ భారత్ లో భాగంగా చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మత్తు పదార్థాలు వినియోగిస్తే వాటి వల్ల జీవితం ఏ విధంగా నాశనం అవుతుందనే వీడియోలను పాఠశాల, కళాశాల విద్యార్థులకు చూపించి అవగాహన కల్పించాలని, ఇంజనీరింగ్ మెడికల్ కళాశాలలో తప్పనిసరిగా తనిఖీ చేస్తూ ఉండాలని అధికారులను సూచించారు. వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా యువతలో చైతన్యం కల్పించాలని అన్నారు. ప్రమాదాల నివారణకు రోడ్ల పైన చిన్న చిన్న గుంతలను పూడ్చి , హెచ్చరిక బోర్డ్స్ ఏర్పాటు చేయాలని , హైవేలలో స్పీడ్ కంట్రోల్ సీసీ కెమరాలను ఏర్పాటు చేయాలని, హైవేలలో రోడ్లకు ఇరువైపుల బ్లాక్ స్పాట్స్ ప్రదేశాలను గుర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో జిల్లాలో మరణించిన 24 మంది కుటుంబాలకు భీమా అందేలా వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డీసీపీ ఈస్ట్ జోన్ అధికారి అంకిత్ కుమార్ మాట్లాడుతూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో అనునిత్యం మత్తు పదార్థాలు రవాణాపై పెట్రోలింగ్ చేయాలని అన్నారు. మాదకద్రవ్యాల నివారణకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లు,కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిసిపి ట్రాఫిక్ ప్రభాకర్, జెడ్పి సీఈఓ రామి రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, డీఈఓ జ్ఞానేశ్వర్, జిడబ్ల్యూ ఓ రాజమణి, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, డిఆర్డీఓ కౌసల్యాదేవి, ఆర్డిఓ లు సత్యపాల్ రెడ్డి,ఉమారాణి, ఏసీపీ లు సంబంధిత శాఖల అధికారులు, ఇన్సూరెన్స్ కంపని ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు నిల్... ఆర్భాటం ఫుల్

- చండూరులో లిటిల్ ఫ్లవర్ ఇంటర్నేషనల్ స్కూల్ మాయాజాలం
- ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న పాఠశాల అక్రమాలు
- విద్యాశాఖ అనుమతులు నిల్
- గత సంవత్సరమంతా నిరంతరాయంగా పాఠశాలను నడిపిన వైనం






**నల్గొండ జిల్లా చండూరు మున్సిపల్ కేంద్రంలోని స్థానిక లిటిల్ ఫ్లవర్ ఇంటర్నేషనల్ స్కూల్ కు విద్యాశాఖ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా గత విద్యా సంవత్సరం నుంచి నిరంతరాయంగా పాఠశాలను నడిపిస్తున్నారు. తమ స్కూల్ లో సీబీఎస్ఈ సిలబస్ నేర్పిస్తామంటూ చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలకు మాయ మాటలు చెబుతూ పాఠశాలలో విద్యార్థులను చేర్చుకుంటున్నారు. తమ పాఠశాలకు విద్యాశాఖ నుంచి అన్ని అనుమతులు ఉన్నాయంటూ విద్యార్థుల తల్లిదండ్రును బురిడీ కొట్టించి మోసం చేస్తుంది సదరు పాఠశాల యాజమాన్యం.**

**చండూరు, జూన్ 25 (జనంసాక్షి)**

పూర్తి వివరాల్లోకి వెళితే..నల్గొండ జిల్లా చండూరు మున్సిపల్ కేంద్రంలోని స్థానిక లిటిల్ ఫ్లవర్ ఇంటర్నేషనల్ స్కూల్ కు పాఠశాల విద్యా శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకున్నా అధికారుల అండదండలతో గత సంవత్సరం నుంచి నిరంతరాయంగా పాఠశాలను నడిపిస్తున్నారు. అయితే ఇదే యాజమాన్యం గత పది సంవత్సరాల క్రితం లిటిల్ ఫ్లవర్ స్కూల్ పేరిట పాఠశాలను నడిపింది.. అయితే ఏమైందో ఏమో కానీ కొంత కాలానికి ఆ పాఠశాలను ఎత్తివేసింది. ఇదిలా వుండగా.. మళ్ళీ అదే యాజమాన్యం వారు గత ఏడాది చండూరు లో లిటిల్ ఫ్లవర్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరిట తిరిగి నూతన పాఠశాలను ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. నూతనంగా ప్రారంభించిన పాఠశాలకు విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవని విశ్వసనీయ సమాచారం. అయితే సదరు పాఠశాల యాజమాన్యం ఎలాంటి అనుమతులు లేకున్నా గత ఏడాదిగా పాఠశాలను నిరంతరాయంగా నడిపిస్తున్నా పాఠశాల విద్యా శాఖ నుండి ఎలాంటి చర్యలు లేకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. అయితే అధికారుల కనుసన్నల్లోనే పాఠశాల యాజమాన్యం అక్రమాలకు పాల్పడుతోందని ప్రజల్లో చర్చ నడుస్తోంది. అంతే కాదు.. స్థానికంగా గత ఆరు సంవత్సరాల క్రితం మూతపడిన ఒక స్కూల్ అనుమతులను వీరు కొనుగోలు చేసినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఆ స్కూల్ అనుమతుల తోనే ఇంటర్ నేషనల్ స్కూల్ గా పేరు మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను ఏమార్చి పాఠశాల యాజమాన్యం తమ పబ్బం గడుపుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అయితే అసలు ట్విస్ట్ ఇక్కడే ఉంది. పాఠశాల విద్యా శాఖ నియమ నిబంధనల మేరకు జీవో నెం. 1 ప్రకారం ఒక సంవత్సర కాలంగా మూతపడిన పాఠశాలకు తిరిగి విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు మంజూరు చేయకూడదు. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న ఈ పాఠశాలకు మాత్రం విద్యా శాఖ పూర్తి స్థాయిలో అనుమతులు జారీ చేసిందని పాఠశాల యాజమాన్యం చెబుతోంది. కాగా ఈ విషయంపై విద్యార్థి సంఘాల నుంచి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక సారి పాఠశాలను నిరంతరాయంగా ఆరు సంవత్సరాల పాటు మూసివేసిన తర్వాత అదే పాఠశాలకు తిరిగి ఎలా అనుమతులు మంజూరు చేస్తారంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే పాఠశాల విద్యా శాఖ కొత్త రూల్స్ ప్రకారం ప్రతి పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థి వివరాలను విద్యా శాఖ వెబ్ సైట్ లో ఆన్ లైన్ చేయాల్సి ఉంటుంది. దీని ప్రకారమే భవిష్యత్తులో ఏ విద్యార్థికైనా స్టడీ కాంటాక్ట్, టీసీ లాంటి సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంటుంది. ఇలా చేయడానికి విద్యా శాఖ ప్రతీ పాఠశాలకు వెబ్ సైట్ కు సంబంధించి యూ-డైస్ పాస్ వర్డ్ జారీ చేస్తుంది. అంతే కాకుండా పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థికి పెన్ నెంబర్ అలాట్ చేస్తుంది. అయితే... ఈ లిటిల్ ఫ్లవర్ ఇంటర్నేషనల్ స్కూల్ ను గత ఏడాది నుంచి నడుపుతున్నారు. కానీ ఇప్పటి వరకు ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల వివరాలు ఆన్ లైన్ లో ఉంచిన దాఖలాలు లేవు. కానీ ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి తమ పాఠశాలకు విద్యాశాఖ నుంచి యూ-డైస్ పాస్ వర్డ్ జారీ అయిందని, ఇక నుండి తమ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి వివరాలను ఆన్ లైన్ చేస్తామని సదరు పాఠశాల యాజమాన్యం కొత్త పల్లవిని అందుకుంది.. ఇంత వరకు బాగానే ఉన్నా మరి గత సంవత్సరం నుంచి వీరి పాఠశాలలో చదివిన విద్యార్థుల భవిష్యత్తు ఏమిటి అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. భవిష్యత్తులో వారికి ఏ విధంగా సర్టిఫికెట్లను అందజేస్తారని పలువురు నిలదీస్తున్నారు. అంతే కాకుండా సదరు పాఠశాల యాజమాన్యం కొనుగోలు చేసిన వేరొక స్కూల్ అనుమతుల ప్రకారం గతంలో ఆ పాఠశాల నిర్వహించిన చోట కాకుండా వీరు నిబంధనలను తుంగలో తొక్కి తమ పాఠశాలను వేరొక చోట నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో కూడా విద్యా శాఖ అధికారులపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే.. ఇటీవలనే చండూరు మండల విద్యాశాఖాధికారి పత్రికా ముఖంగా సదరు లిటిల్ ఫ్లవర్ ఇంటర్నేషనల్ స్కూల్ కు విద్యాశాఖ నుండి ఎలాంటి అనుమతులు లేవని వెల్లడించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే ప్రజల నుండి మాత్రం విద్యా శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. దానికి కారణం గత ఏడాది నుంచి నడుపుతున్న పాఠశాలకు ఈ ఏడాది ఎలాంటి పర్మిషన్స్ లేవని చెప్పడమే. అంతే కాదు సదరు పాఠశాల అక్రమాలన్నీ అధికారుల అండదండలతోనే కొనసాగుతున్నాయడానికి నిలువెత్తు నిదర్శనం ఇది. అయితే ఇటీవల సదరు పాఠశాలపై భారీ ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతుండడంతో జిల్లా విద్యాశాఖాధికారి తో పాటు మండల విద్యాశాఖాధికారి సైతం సదరు పాఠశాలను సందర్శించినా చర్యలు మాత్రం శూన్యం అని ప్రజలు ఆరోపిస్తున్నారు. మొగుడు కొట్టినందుకు కాదు తోటి ఏరాలు చూసినందుకు ఏడ్చిందనే సామేత చందంగా సంబంధిత అధికారులు కంటితుడుపు గా చర్యలు తీసుకుంటున్నారని ఆరోపణలు సైతం వెల్లువెత్తుతుండడం ఇక్కడ గమనార్హం. ఇదిలా ఉంటే.. సదరు లిటిల్ ఫ్లవర్ ఇంటర్నేషనల్ స్కూల్ కు విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా.. లిటిల్ ఫ్లవర్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరిట స్కూల్ బస్సులకు ఆర్టీఓ అధికారులు ఎలా రిజిస్ట్రేషన్ చేశారో అనే ప్రశ్న సైతం ఇక్కడ ఉత్పన్నమవుతోంది. ఇప్పటికైనా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న సదరు లిటిల్ ఫ్లవర్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంతో పాటు వారికి సహకరిస్తున్న అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలతో పాటు ప్రజా సంఘాలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇక మీదట విద్యాశాఖాధికారులు, ఆర్టీఓ అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే మరి...

## కేంద్ర విద్యుత్ శాఖ మంత్రిని కలిసిన మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, జూన్ 25 (జనంసాక్షి) :** కేంద్ర విద్యుత్, నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ ను బుధవారం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు.

## బొంరాస్‌పేట ఎస్సైని సస్పెండ్ చేయకపోతే ఎస్పీ ఆఫీసు ముట్టడిస్తాం

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**బొంరాస్‌పేట, జూన్ 25 (జనం సాక్షి) :** కొడంగల్ నియోజకవర్గంలో రోజురోజుకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు.ఇటీవల మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త వడ్ల రవీంద్ర చారిని పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి ఎస్సై రావుఫ్ మతపరమైన దుర్భాషలు ఆడి చేయి చేసుకున్నాడని బొంరాస్ పేట లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఎస్సైని రెండు రోజుల్లో సస్పెండ్ చేయని పక్షాన వికారాబాద్ జిల్లా ఎస్పీ ఆఫీసు ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోట్ల యాదగిరి,నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి,మహేందర్ రెడ్డి, మధు యాదవ్, సుదర్శన్ రెడ్డి,నారాయణరెడ్డి, కోట్ల మహిపాల్, మడిగే శ్రీనివాస్, రవి గౌడ్, మల్లేష్ గౌడ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి యుద్ధం

- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు

**గద్వాల నడిగడ్డ, జూన్ 25 (జనం సాక్షి) :** మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ,విద్యార్థులు జిల్లా పోలీసు యంత్రాంగంతో కలిసి యుద్ధం చేయాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు పిలుపునిచ్చారు.జిల్లాలో వారం రోజుల పాటు యాంటీ డ్రగ్ వీక్ నిర్వహించడం జరుగుతుందని, ఈ యాంటీ డ్రగ్ వీక్‌లో భాగంగా పోలీస్ అధికారులు పోలీస్ స్టేషన్‌ల పరిదిలో పాఠశాలలు,కళాశాలలో యువతకు, ప్రజలకు డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్, మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ప్రస్తుత సమాజం మాదకద్రవ్యాల బారినపడి ముఖ్యంగా యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని డ్రగ్స్ వల్ల కుటుంబాలు రోడ్డున పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు. డ్రగ్స్ కు, గంజాయి కి సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్న జిల్లా ప్రజలు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారాన్ని అందించాలని తెలిపారు. డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడే ఐ యామ్ యాంటీ డ్రగ్ సోల్జర్ అంటూ జిల్లా ఎస్పీ పోటో పాయింట్ లో పోటో దిగి జిల్లాలోని విద్యార్థులు, యువత, పోలీస్ అధికారులు సిబ్బంది కూడా డ్రగ్స్ కు వ్యతిరేకంగా ఫోటో పాయింట్ వద్ద ఫోటోలు దిగి క్యూఆర్ కోడ్‌తో యాంటీ డ్రగ్ సోల్జర్ సర్టిఫికెట్ను పొంది దానికి అనుగుణంగా ప్రవర్తించాలని సూచించారు.




## డ్రగ్ రహిత సూర్యాపేటగా మారుద్దాం

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 25 (జనంసాక్షి) :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించే వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లోని సెల్ఫీ పాయింట్ వద్ద జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా అవగాహన వారోత్సవాల సందర్భంగా డ్రగ్ రహిత సూర్యాపేట లక్ష్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు యువత విద్యార్థులు కలిసికట్టుగా ముందడుగు వేయాలని అన్నారు.డ్రగ్స్ బారిన పడకుండా పోలీస్ శాఖ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.ఐ యామ్ యాంటీ డ్రగ్ సోల్జర్ అనే సెల్ఫీ పాయింట్ వద్ద జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు సిబ్బంది ఫోటోలు దిగారు.ప్రతి అధికారి సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటో దిగి మాధ్యమాలలో యువతకు అవగాహన కలిగేలా పెట్టాలని విస్తృత ప్రచారంలో అందరూ పాల్గొనాలని కోరారు.నేటి ఉదయం జరగబోయే ర్యాలీలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## అక్రమ కిడ్నీ మార్పిడీల ముఠా అరెస్ట్

- ఫోర్జరీ సంతకాలతో తప్పుడు రిపోర్టులు
- పదిమందికి పైగా కిడ్నీల మార్పిడి
- పదిమంది ముఠాగా ఏర్పడి కొనసాగిస్తున్న దందా
- ఆరుగురుని అదుపులోకి తీసుకున్న పోలీసులు నలుగురు పరారీ
- కోదాడ పట్టణంలో వివరాలు వెల్లడించిన డిఎస్పి శ్రీధర్ రెడ్డి



**కోదాడ, జూన్ 25 (జనంసాక్షి) :** మనిషిలో అత్యంత విలువైన అవయవం కిడ్నీ. ఇదే అదునుగా భావించిన కొందరు కిడ్నీ మార్పిడి దందాకు తెర లేపారు. కిడ్నీ మార్పిడి చేస్తామని లక్షల్లో డబ్బులు వసూలు చేసి మోసం చేసిన సంఘటన ఇటీవల కోదాడ పట్టణంలో చోటుచేసుకుంది. కేసును చాలెంజ్‌గా తీసుకున్న కోదాడ పోలీసులు కిడ్నీ మార్పిడి ముఠా గుట్టురట్టు చేశారు.ఫోర్జరీ సంతకాలతో బ్లడ్ శాంపిల్, డిఎన్ఏ టెస్ట్ తప్పుడు రిపోర్టు సృష్టించి లక్షల్లో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్న పదిమంది వ్యక్తుల్లో ఆరుగురును పోలీసులు పట్టుకున్నారు.బుధవారం డిఎస్పి శ్రీధర్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...గత సంవత్సరం డిసెంబర్ నెలలో కోదాడ పట్టణములోని శ్రీరంగాపురంకు చెందిన సత్తూరి నరేష్ కు విజయవాడలో కిడ్నీ మార్పిడి చికిత్స చేస్తామని చెప్పి అధికారులతో ఫోర్జరీ సంతకాలు, తప్పుడు స్టాంపులను సృష్టించి క్లియరెన్స్ సర్టిఫికెట్ల పై 22 లక్షల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకొని కిడ్నీ డయాలసిస్ సెంటర్ ల్లో ఆపరేషన్ చేసే సమయంలో డాక్టర్ కు డబ్బులు ఇవ్వకుండా వెళ్ళిపోయారని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం పదిమందికి కిడ్నీ మార్పిడి చికిత్స చట్ట విరుద్ధంగా చేశారని తెలిపారు. కడుపూరి తాతారావు, కొండం రమాదేవి, బొందిలి పృథ్వీ రాజు, కొడాలి బాబురావు, కందుకూరి విష్ణువర్ధన్, మహమ్మద్ సర్దార్ లను అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. మిగతా నలుగురు పరారీలో ఉన్నారని అన్నారు.ఈ ఆరుగురిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించడం జరిగిందని పేర్కొన్నారు. వీరి దగ్గర నుండి ఏడు సెల్ ఫోన్లు, అధికారులకు సంబంధించిన ఆరు రబ్బర్ స్టాంపు లు, ఒక ఇంకుప్యాడ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఇట్టి కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సి సి ఎస్ శివకుమార్, కోదాడ పట్టణ సిఐ శివ శంకర్,ఎస్సై సుధీర్ కుమార్,సిబ్బందిని కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి అభినందించారు..

## జూన్ 27 నుండి కరీంనగర్ లో సిసిటివి కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనల పర్యవేక్షణ

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్ బ్యూరో, జూన్ 25 (జనంసాక్షి) :** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం రోజు మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా కరీంనగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో వాటి కనెక్టివిటీ , వాటి పనితీరును ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలీస్ కమిషనర్ కరీంనగర్ పట్టణ ప్రజలకు ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాలు 2025 జూన్ 27 నుండి పూర్తిగా అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు. ఈ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను పర్యవేక్షిస్తామని, తదనుగుణంగా చలాన్లు జారీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ చర్యల ప్రధాన లక్ష్యం పౌరుల భద్రతను పెంచడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం, నగరంలో ట్రాఫిక్‌ను నియంత్రించడం అని కమిషనర్ పేర్కొన్నారు.

### సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో గుర్తించబడిన ముఖ్యమైన ట్రాఫిక్ ఉల్లంఘనలు

ట్రాఫిక్ సిగ్నల్ జంపింగ్, ట్రాఫిక్ సిగ్నల్ దాటి ముందుకు వెళ్లడం, ద్విచక్ర వాహనం నడుపుతున్నప్పుడు హెల్మెట్ ధరించకపోవడం, కారు నడుపుతున్నప్పుడు సీట్ బెల్ట్ ధరించకపోవడం, వ్యతిరేక దిశలో డ్రైవింగ్, వాహనం నడుపుతున్నప్పుడు సెల్ ఫోన్ ఉపయోగించడం, ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణించడం, చాలా వేగంగా లేదా ప్రమాదకరమైన వేగంతో వాహనాన్ని నడపడం పైన పేర్కొన్న ట్రాఫిక్ నిబంధనలలో దేనినైనా ఉల్లంఘించినందుకు వాహనదారులకు ట్రాఫిక్ చలాన్లు జారీ చేయబడతాయని కమిషనర్ హెచ్చరించారు. అందువల్ల కరీంనగర్ పట్టణ పౌరులు , వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, పోలీసులకు సహకరించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్‌స్పెక్టర్లు బిల్లా కోటేశ్వర్, ఖరీముల్లా ఖాన్, రమేష్, వెంకటేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలి

- ప్రతి పాఠశాలలో 60 రోజుల కార్యాచరణ తప్పక అమలు చేయాలి
- రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 25 (జనంసాక్షి) :** విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా జడ్పీహెచ్ఎస్‌లోని పదవ తరగతి విద్యార్థులకు జరుగుతున్న గణితం క్లాస్, 9వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న బేస్ లైన్ టెస్ట్ లను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.60 రోజుల కార్యాచరణ ప్రతి పాఠశాలలో అమలు చేసి ఆగస్టు 15 నాటికి జిల్లాలో తెలుగు చదవటం, రాయటం రాని వారు ఉండవద్దని తెలిపారు.బుక్ డిపో, కంప్యూటర్ ల్యాబ్ పరిశీలించారు.కంప్యూటర్ లకు టేబుల్స్ లేవని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా వెంటనే ఏర్పాటు చేస్తామని తెలిపారు.వంట చేస్తున్న సిబ్బందిని ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడగగా వంట గది కావాలని తెలపగా వెంటనే ప్రతి పాదనలు పంపాలని సూచించారు.చర్చి కాంపౌండ్ లో గల అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి స్టాక్ రిజిస్టర్, హాజరు రిజిస్టర్ వివరాలు పరిశీలించారు. పాలు,గుడ్లు నాణ్యత పరిశీలించి ప్రతి రోజు పిల్లలకి నాణ్యమైన పోషకాహారం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. పిల్లలను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాలను సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవిన్యూ సదస్సులలో స్వీకరించిన ఆర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులు పరిశీలించి భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవరావు, తహసీల్దార్ కృష్ణయ్య,జడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు,అధికారులు, అంగన్వాడీ టీచర్ పద్మ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# లాభాల్లోకి సూచీలు..

**• సెన్సెక్స్ 700 పాయింట్లు పైకి**

ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు చల్లారిన వేళ దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. చమురు ధరలు దిగిరావడమూ మన మార్కెట్ సూచీలకు కలిసొచ్చింది. అన్ని రంగాల షేర్లు రాణించగా.. ఐటీ, మీడియా రంగ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లు కూడా ఒకటిన్నర శాతం మేర రాణించాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 700 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 25,250 స్థాయికి చేరువైంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలమైన సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 82,448.80 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,055.11) వద్ద ఓ మోస్తరు లాభాల్లో ప్రారంభమైందది. రోజంతా లాభాల్లోనే



కదలాడింది. ఇంట్రాడేలో 82,815.91 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 700 పాయింట్ల లాభంతో 82,755.51 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 200 పాయింట్ల లాభంతో 25,244.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.07గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బీఈఎల్, కోటక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ షేర్లు మినహా మిగిలిన సెన్సెక్స్ 30 సూచీలో బీఈఎల్, కోటక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టైటాన్, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 67.60 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3340 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ముంబై ఎయిర్‌పోర్ట్ కోసం అదానీ నిధుల సమీకరణ



**(జనంసాక్షి):** గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థల నుంచి డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ బిలియన్ డాలర్లు (సుమారు రూ. 8,600 కోట్లు) సమీకరించింది. నిధులను ముంబై ఎయిర్‌పోర్ట్ రుణాల రీఫైనాన్సింగ్‌కు వినియోగించనుంది. న్యూయార్క్ సంస్థ అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్ అధ్యక్షతన మెట్‌లైఫ్ ఇంక్, బ్లాక్‌రాక్ ఇంక్, ఎఫ్‌డబ్ల్యూడీ ఇన్సూరెన్స్ నిధులు సమకూర్చాయి. ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్(ఎంఐఏఎల్) కోసం 2022లో సమీకరించిన రుణాల రీఫైనాన్స్‌కు నిధులు వెచ్చించనున్నట్లు అదానీ గ్రూప్ సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది. ఎంఐఏఎల్‌లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ వాటా 74 శాతంకాగా.. భారత ఎయిర్‌పోర్ట్స్ అథారిటీకి 26 శాతం వాటా ఉంది. దేశీయంగా రెండో పెద్ద ఎయిర్‌పోర్ట్‌ను నిర్వహిస్తున్న కంపెనీ 2029 జులైలో గడువుతీరే 75 కోట్ల డాలర్ల విలువైన నోట్లను జారీ చేసింది. వీటికి అదనంగా 25 కోట్ల డాలర్ల నోట్లను జారీ చేసే వీలుతో నిధుల సమీకరణ చేపట్టింది. తద్వారా బిలియన్ డాలర్లను సమకూర్చుకుంది. దీంతో ఎంఐఏఎల్ అభివృద్ధి, ఆధునీకరణ, సామర్థ్య విస్తరణకు ఆర్థిక వెసులుబాటు లభించనున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ తెలియజేసింది. తాజాగా జారీ చేసిన బాండ్లు 6.9 శాతం కూపన్‌రేటుతో నాలుగేళ్ల కాలానికి గడువు తీరనున్నాయి. ఎయిర్‌పోర్ట్ మౌలికసదుపాయాల రంగంలో తొలి ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ ప్రయివేట్ బాండ్ల జారీని చేపట్టినట్లు కంపెనీ పేర్కొంది.

## మలేరియా టీకా ధరలు తగ్గించిన భారత్ బయోటెక్!

**(జనంసాక్షి):** ప్రపంచంలోనే మొట్టమొదటి మలేరియా టీకా ధరలను ఈ వ్యాధి ప్రబలంగా ఉండే కొన్ని దేశాల్లో సగానికి తగ్గిస్తున్నట్లు భారత్ బయోటెక్, జీఎస్‌కేలు ప్రకటించాయి. ఆయా దేశాల్లో 2028 నుంచి మలేరియా నివారణ టీకాలు ఐదు డాలర్ల కంటే తక్కువ ధరకు లబిస్తాయని ఇరు సంస్థలు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపాయి. ప్రపంచవ్యాప్తంగా పేద దేశాలకు వ్యాక్సీన్లను పంపిణీ చేసేందుకు ఏర్పాటైన 'ద వ్యాక్సీన్ అలయన్స్'కు 2026- 2030 మధ్య సరఫరా చేసే టీకాలపై ఒక ఒప్పందం కుదిరిన సందర్భంగా ఇరు సంస్థలు ఈ విషయాన్ని తెలిపాయి. జీఎస్‌కే, పాథ్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన మలేరియా టీకా ఆర్‌టీఎస్.ఎస్‌ను మలేరియా నివారణకు ఉపయోగించవచ్చునని ప్రపంచ ఆరోగ్య సంస్థ 2021లోనే అనుమతులిచ్చింది. అయితే ఉత్పత్తి మార్గాల్లో మెరుగుదల, సామర్థ్యం పెంపు, లాభాన్ని కనీస స్థాయిలో ఉంచడం వంటి కారణాల వల్ల టీకా ధర సగానికి తగ్గించడం వీలైందని భారత్ బయోటెక్, జీఎస్‌కేలు వివరించాయి. "వ్యాక్సీన్ అలయెన్స్‌కు టీకాల సరఫరా చేస్తామన్న ఒప్పందం కుదరడం వల్ల లక్షల మంది పిల్లలు, కుటుంబాలపై మలేరియా సమ?స్య తగ్గిపోతుంది. ఈ చర్య మాకు కేవలం వ్యాక్సీన్ అలయన్స్‌కు సహకరించడం మాత్రమే కాదు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం" అని ఛైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా తెలిపారు.

## విశాఖలో కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్


ఐటీ సర్వీసులు అందించే ప్రముఖ కంపెనీ కాగ్నిజెంట్ తన భారత కార్యకలాపాలను బలోపేతం చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో రూ. 1,583 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక టెక్నాలజీ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. వైజాగ్‌లోని కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో 22 ఎకరాల్లో మూడు దశల్లో అభివృద్ధి చేయనున్న ఈ క్యాంపస్ ద్వారా 8,000 మందికి పైగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపింది. 2026లో 800 మంది అసోసియేట్లకు వసతి కల్పించేలా తాత్కాలిక కేంద్రం ద్వారా కార్యకలాపాలు ప్రారంభమవుతాయని కంపెనీ పేర్కొంది. 2029 ప్రారంభంలో పూర్తి స్థాయి క్యాంపస్ అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేసింది. విశాఖపట్నం ప్రతిభకు, మౌలిక సదుపాయాలకు ప్రత్యేకంగా నిలుస్తున్నట్లు కాగ్నిజెంట్ సీఈఓ ఎస్.రవి కుమార్ తెలిపారు. దేశంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో సంస్థ విస్తరించాలనే లక్ష్యానికి అనుగుణంగా వైజాగ్‌లో క్యాంపస్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కాగ్నిజెంట్ డిజిటల్ ఎకానమీని మరింత వేగవంతం చేస్తుందని, అదే సమయంలో భవిష్యత్తులో శ్రామిక శక్తికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను పెంచుతుందని ఏపీ ఐటీ, ఎ లక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ అన్నారు. భారతదేశం అంతటా వ్యూహాత్మక విస్తరణలో భాగంగా కాగ్నిజెంట్ ఇప్పటికే భువనేశ్వర్, ఇండోర్‌లో కొత్త కేంద్రాలను, గుజరాత్లోని గిఫ్ట్ సిటీలో ఫైనాన్స్ హబ్‌ను ఏర్పాటు చేసిందని కంపెనీ పేర్కొంది.




## కొత్త ఇన్సూరెన్స్ పథకం

**• మంచి బెనిఫిట్స్‌తో..**

**హైదరాబాద్:** ఆరోగ్య బీమా సంస్థ గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ కొత్తగా గెలాక్సీ మార్వెల్ పేరిట పాలసీని ప్రవేశపెట్టింది. తొలిసారి క్లెయిమ్ చేసేంతవరకు లేదా 55 ఏళ్లు వచ్చేంత వరకు ఒకే ప్రీమియంను కొనసాగించడం, 71 కన్జూమబుల్స్‌కు కవరేజీ, అపరిమిత స్థాయిలో 100 శాతం సమ్ ఇన్సూర్డ్‌ను రిస్టోర్ చేయడం, ప్రీమియం వెయివర్, ఔట్‌పేషంట్ బెనిఫిట్స్ మొదలైనవి ఇందులో ఉన్నాయి. తమ పాలసీల విక్రయం కోసం పాలసీబజార్‌తో చేతులు కలిపినట్లు కంపెనీ ఎండీ జీ. శ్రీనివాసన్ తెలిపారు. కార్యకలాపాలు ప్రారంభించిన గత ఏడాది కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 4,730 పైగా పాలసీదార్లకు బీమా భద్రత కల్పించామని, రెండురాష్ట్రాల్లో 1893 మంది పైగా ఏజంట్లతో పటిష్టమైన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నామని ఆయన వివరించారు.




## ఐటీ రిటర్న్ కొత్త రూల్స్..




దేశవ్యాప్తంగా పన్నుచెల్లింపుదారులు ప్రస్తుతం ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ (ఐటీఆర్) దాఖలులో తలమునకలై ఉన్నారు. ఐటీఆర్ ఫైలింగ్‌కు సాధారణంగా జూలై 31 చివరి తేదీ కాగా ఈ ఏడాది దీన్ని సెప్టెంబర్ 15 వరకూ పొడిగించారు. ట్యాక్స్ ఫైలింగ్‌లో సమ్మతి, ఖచ్చితత్వాన్ని నిర్ధారించే విస్తృత ప్రయత్నంలో భాగంగా ఆదాయపు పన్ను శాఖ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. తప్పుడు మినహాయింపులు క్లయిమ్ చేసినా, ఆదాయాన్ని దాచినా పన్ను చెల్లింపుదారులకు కఠినమైన జరిమానాలను ప్రవేశపెట్టింది. "పన్ను బకాయిలో 200% వరకు జరిమానా, 24% వార్షిక వడ్డీ, సెక్షన్ 276 సి కింద ప్రాసిక్యూషన్ కూడా ఎదుర్కోవచ్చు" అని ఆదాయపు పన్ను శాఖ పేర్కొంది. ఈ పరిణామాలను నివారించడానికి పన్ను చెల్లింపుదారులు తమ రిటర్నులను జాగ్రత్తగా సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

**కొత్త నిబంధనలు.. కీలకాంశాలు**

కఠినమైన జరిమానాలు: తప్పుదారి పట్టించే లేదా తప్పుడు ఐటీఆర్ దాఖలు చేసిన వారికి 200 శాతం జరిమానా, 24 శాతం వార్షిక వడ్డీ, సెక్షన్ 276సి ప్రకారం శిక్ష కూడా విధిస్తారు. పన్ను చెల్లింపుదారుల బాధ్యత: సీఏ లేదా కన్సల్టెంట్ పొరపాటు చేసినా కూడా పన్ను చెల్లింపుదారుడే బాధ్యత వహించాలి. అందరికీ వర్తింపు: ఉద్యోగులు, ఫ్రీలాన్సర్లు, వ్యాపారులు, ప్రొఫెషనల్స్ అందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. సాధారణ తప్పులు: తప్పు ఐటీఆర్ ఫారమ్ ఎంపిక, తప్పుడు మినహాయింపులు, ఆదాయాన్ని ప్రకటించకపోవడం జరిమానాలకు దారి తీస్తాయి. రివైజ్డ్ రిటర్న్‌తోనూ లాభం లేదు: ఇచ్చిన సమాచారం తప్పుగా ఉందని పన్ను శాఖ గుర్తిస్తే, రివైజ్డ్ రిటర్న్ దాఖలు చేసినా జరిమానా తప్పదు. సరైన ఐటీఆర్ ఫారమ్ ఎంపిక: (సాధారణ ఆదాయం), (వ్యాపార ఆదాయం) వంటి వివిధ ఫారమ్‌లు ఆదాయ రకాన్ని బట్టి ఎంచుకోవాలి. తప్పు క్లెయిమ్‌లు చేయొద్దు: వ్యాపార ఖర్చులుగా వ్యక్తిగత ఖర్చులను చూపడం, తప్పుడు హౌస్ రెంట్ అలవెన్స్ క్లెయిమ్‌లు జరిమానాలకు దారి తీస్తాయి. పన్ను చెల్లింపుదారులకు జాగ్రత్తలు: వార్షిక సమాచార ప్రకటనలోని వివరాలతో సరిపోల్చుకోవడం, సరైన రికార్డులు నిర్వహించడం, పన్ను నిపుణుల సలహా తీసుకోవడం ద్వారా జరిమానాలను నివారించవచ్చు.

## అభినందన్‌ను బంధించానన్న.. పాక్ ఆర్మీ అధికారి మృతి


**న్యూఢిల్లీ:** నాటి పుల్వామా ఉగ్రవాద దాడి(2019) తదనంతర పరిణామాలలో అప్పటి భారత వైమానిక దళం వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ నేషనల్ హీరోగా అందరి అభినందనలు అందుకున్నారు. అప్పట్లో ఆయనను బంధించానని చెప్పుకున్న పాకిస్తాన్ అధికారి మేజర్ మోయిజ్ అబ్బాస్ తాజాగా పాక్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. పాకిస్తాన్ సైన్యంలో మేజర్‌గా పనిచేస్తున్న మోయిజ్ అబ్బాస్ షా(37)దక్షిణ వజీరిస్తాన్‌లో తెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్తాన్ తో జరిగిన కాల్పుల్లో మృతిచెందాడు. ఈయన ఎస్‌ఎస్‌జీ లో పనిచేస్తున్నాడు. పాకిస్తాన్ సైన్యం విడుదల చేసిన ఒక ప్రకటనలోని వివరాల ప్రకారం లాన్స్ నా యక్ జిబ్రానుల్లాతో కలిసి ఉగ్రవాద నిరోధక ఆపరేషన్‌కు నాయకత్వం వహిస్తున్న అబ్బాస్ షా కాల్పుల్లో మృతిచెందాడు.

# ముదురుతున్న ఏఐ వార్!

**(జనంసాక్షి):** గూగుల్, ఎక్స్, మెటా, ఓపెన్‌ఏఐ.. వంటి ప్రధాన కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా జనరేటివ్ ఏఐ మోడళ్లను సృష్టిస్తున్నాయి. ఈ సంస్థల మధ్య పోటీ తీవ్రతరం అవుతుంది. దాంతో తోటివారికంటే ఓ అడుగు ముందుడాలనే భావనతో కంపెనీ ఏఐ నైపుణ్యాలున్నవారికి భారీ ప్యాకేజీలు ప్రకటిస్తున్నాయి. కృత్రిమ మేధస్సుపై ఆధిపత్యం చెలాయించే రేసులో భాగంగా మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ కీలక ప్రచారం ప్రారంభించినట్లు కొన్ని సంస్థలు తెలుపుతున్నాయి. ఈ విభాగంలో అగ్రశ్రేణి ఏఐ ప్రతిభావంతులను ఆకర్షించేందుకు భారీ ప్యాకేజీ ప్రకటిస్తున్నట్లు తెలుస్తుంది. మెరుగైన ఏఐ నైపుణ్యాలున్న ఎక్స్‌పర్ట్‌లకు 100 మిలియన్ డాలర్ల (రూ.860 కోట్లు) ప్యాకేజీ చెల్లించేందుకు కూడా వెనుకాడడం లేదని సమాచారం.

**నేరుగా సంప్రదింపులు:**

కొన్ని సంస్థలు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధకులు, డెవలపర్లు, స్టార్టప్ ఫౌండర్లను వాట్సాప్, ఈమెయిల్ ద్వారా మార్క్ జుకర్‌బర్గ్ సంప్రదిస్తున్నారు. వీరిలో కొందరిని వ్యక్తిగతంగా షార్ట్‌లిస్ట్ చేసి ఆయా నిపుణులను నేరుగా సంప్రదిస్తున్నారు. వారితో




జరుపుతున్న చర్చల్లో కేవలం నియామకాల గురించే కాకుండా ఆర్టిఫిషియన్ జనరల్ ఇంటెలిజెన్స్, భవిష్యత్తు కార్యకలాపాలు వంటి చాలా అంశాలను చర్చిస్తున్నారు.

**సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ కోసం..**

మెటా కొన్ని రోజుల నుంచి మానవ స్థాయి కృత్రిమ మేధ వ్యవస్థలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా 'సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్'ను నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందుకు ప్రపంచంలోనే టాప్ స్కిల్డ్ పర్సన్స్‌ను నియమించుకోవాలని మెటా భావిస్తోంది. దాంతో సరైన నైపుణ్యాలు ఉన్నవారికి భారీగా ప్యాకేజీలు ఇచ్చేందుకు సిద్ధం అవుతోంది. అలెగ్జాండర్ వాంగ్ స్థాపించిన స్కేల్ ఏఐ కంపెనీను 14 బిలియన్ డాలర్ల(రూ.1.2 లక్షల కోట్లు) వాల్యుయేషన్‌కు కొనుగోలు చేసింది. సిలికాన్ వ్యాలీలో అత్యంత ప్రభావవంతమైన డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టార్టప్‌ను నిర్మించడంలో ప్రసిద్ధి చెందిన వాంగ్ ఇప్పుడు కృత్రిమ మేధ ఆవిష్కరణలో మెటా తరపున పని చేస్తున్నారు.

**కొందరు విముఖత:**

అయితే కొందరు మాత్రం తమ నైపుణ్యాలకు, తాము స్థాపించిన కంపెనీలకు మెటా ఎంత వెచ్చిస్తానంటున్నా కలిసిరావడానికి విముఖత వ్యక్తం చేస్తున్నారు. జుకర్‌బర్గ్, మెటా ఏఐ చీఫ్ సైంటిస్ట్ యాన్ లెకున్ మధ్య ఫిలాసఫికల్ విభేదాల వల్ల ఈ సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ దీర్ఘకాలికంగా ఎలా అభివృద్ధి చెందుతుందనే దానిపై స్పష్టత లేకపోవడం కూడా ఇందుకు ప్రధాన కారణంగా ఉంది.

## పాక్ అత్యంత రహస్యంగా

**న్యూక్లియర్ బాలిస్టిక్ మిస్సైళ్ల తయారీ చేపట్టిన దాయాది!**



పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రపంచమంతా దృష్టిసారించిన వేళ..పాక్ రహస్యంగా శక్తివంతమైన.. అదీ న్యూక్లియర్ బాలిస్టిక్ మిసైళ్ల తయారీ చేపట్టింది!. ఈ విషయాన్ని అమెరికా నిఘా వర్గాలు వెల్లడించినట్లు ఫారిన్ ఎఫైర్స్ అనే పత్రిక కథనం ప్రచురించింది. దీర్ఘ శ్రేణి నూక్లియర్ బాలిస్టిక్ మిసైళ్ల తయారీని పాకిస్థాన్ రహస్యంగా చేపడుతోంది. వీటి సామర్థ్యం ఏకంగా.. అమెరికాకు చేరుకోగలదని వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత.. చైనా సాయంతో పాక్ వీటిని అభివృద్ధి చేస్తోంది. ఒకవేళ పాకిస్థాన్ అలాంటి క్షిపణులను సమకూర్చుకుంటే.. ఆ దేశాన్ని అణ్వస్త్ర శత్రువుగా అమెరికా గుర్తించడం ఖాయమని వాషింగ్టన్ నిఘా వర్గాలు స్పష్టం చేశాయని సదరు కథనం పేర్కొంది. అమెరికాను తాకగలిగే అణ్వాయుధాలను కలిగి ఉన్న దేశం ఏదైనా సరే.. అమెరికాకు శత్రువుగానే చూడాల్సి వస్తుందని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యలను సదరు నివేదిక ప్రముఖంగా పేర్కొంది. ఈ కథనాన్ని వైట్‌హౌజ్ వర్గాలు ధృవీకరించాల్సి ఉంది. ఐసీబీఎం అంటే.. ఖండాలను దాటగలిగే సామర్థ్యం ఉన్న క్షిపణులు. ఇందులో అణ్వాయుధాలతో పాటు సాధారణ యుద్ధ క్షిపణులు కూడా ఉంటాయి. వీటి లక్ష్యం.. 5,500 కిలోమీటర్లు దాకా ఉండొచ్చు. అయితే ప్రస్తుతానికి పాక్ దగ్గర అలాంటి క్షిపణలేం లేవు. ప్రస్తుతం అమెరికా జాబితాలో రష్యా, చైనా, ఉత్తర కొరియాలు ఉన్నాయి. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్ తన ఆర్థికాభివృద్ధిని పణంగా పెట్టి.. ఆయుధాల కొనుగోళ్లపై దృష్టిపెట్టిందని ఆ దేశ మీడియా నుంచే కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలోనే దేశ రక్షణ బడ్జెట్‌ను 20 శాతం పెంచింది. ఏకంగా 9 బిలియన్ డాలర్లకు కేటాయించింది. షెహ్‌బాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాక్ ప్రభుత్వం ఆ దేశ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ డిమాండ్లను సంతృప్తిపర్చేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఈ బడ్జెట్‌లో పెంచిన నిధులతో ఆపరేషన్ సిందూర్‌లో దెబ్బతిన్న టెర్రర్ క్యాంప్‌లను మళ్లీ పునరుద్ధరించనుందని తెలుస్తోంది. అలాగే చైనా నుంచి భారీగా ఆయుధ సంపత్తిని పాక్ దిగుమతి చేసుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతానికైతే ఆ దేశ విధానంలో.. షార్ట్, మీడియం రేంజ్ మిస్సైల్స్ మాత్రమే ఉన్నాయి. చివరగా.. 2022లో పాక్ మీడియం రేంజ్ బాలిస్టిక్ మిస్సైల్ షాహీన్-3ను ప్రయోగించింది. దీని పరిధి.. 2,700 కిలోమీటర్లు. ఇదిలా ఉంటే.. తమ దేశం చేపట్టే అణు పరీక్షలు భారత్ ముప్పును ఎదుర్కొనేందుకేనని పాక్ పలుమార్లు బాహాటంగానే ప్రకటించుకుంది. కిందటి ఏడాది.. పాక్ మీద లాంగ్ రేంజ్ బాలిస్టిక్ మిస్సైల్స్ కార్యక్రమంపై అమెరికా ఆంక్షలు విధించగా.. పాక్ వాటిని పక్షపాత ధోరణిగా ప్రకటించింది. ప్రస్తుతం పాక్ దగ్గర 170 న్యూక్లియర్ వార్‌హెడ్స్ ఉన్నాయి. తద్వారా న్యూక్లియర్ నాన్ ప్రొలైఫరేషన్ ట్రీటీ పరిధిని ఉల్లంఘించింది. న్యూక్లియర్ వెపన్స్‌ను కట్టడి చేయడం, తద్వారా అణు శక్తిని పరిమితంగా(శాంతి పరిధికి లోబడి) ఉపయోగించు కోవాలని చెప్పడం ఈ ఒప్పంద ఉద్దేశం. ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం.. మే నెలలో పాక్ ఉగ్రశిబిరాలపై, ఆ దేశ ప్రధాన ఎయిర్‌బేస్‌లపై దాడులు జరిపింది. ఆ సమయంలో పాక్ తన హైపర్‌సోనిక్ బాలిస్టిక్ మిస్సైల్ ప్రయోగించిందని.. అయితే భారత రోబస్ట్ ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ దానిని అడ్డుకుందనే ప్రచారం జోరుగా నడిచింది. అటుపై భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్రమంత్రులు పాక్ న్యూక్లియర్ కార్యకలాపాలపై దృష్టిసారించాలని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీని కోరారు. పాక్ అలాంటి ఆయుధాల విషయంలో హద్దులు మీరి ప్రవర్తించదనే ఆశిస్తున్నట్లు రాజ్‌నాథ్ కూడా వేరుగా ఓ ప్రకటన చేశారు.

## 'ది ఎమర్జెన్సీ డైరీస్'..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి నేటితో 50 ఏళ్లు పూర్తవుతోంది. ఈసందర్భంగా ఆ నాటి రోజులను గుర్తుచేసుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత కాంగ్రెస్ పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నాటి దురాగతాలను భారతీయులెవరూ ఎన్నటికీ మర్చిపోలేరని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఎమర్జెన్సీ రోజుల్లో తన ప్రయాణాన్ని వివరించే ఓ పుస్తకం రానున్నట్లు ప్రధాని ప్రకటించారు. 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో ఈ పుస్తకాన్ని తీసుకొస్తున్నారు."ఎమర్జెన్సీ విధించిన సమయంలో నేను ఆర్‌ఎస్‌ఎస్‌లో యువ ప్రచారక్‌గా పనిచేస్తున్నా. అత్యయిక స్థితికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమం.. నాకు ఎన్నో పాఠాలు నేర్పించింది. అనుభవాలను మిగిల్చింది. మన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను ఈ ఉద్యమం పునరుద్ఘాటించింది. అదే సమయంలో ఎంతోమంది రాజకీయ ప్రముఖుల నుంచి నేర్చుకునే అవకాశం కల్పించింది. ఆ అనుభవాల్లో కొన్నింటిని సమీకరించి 'బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్' పుస్తక రూపంలో తీసుకొస్తోంది. 'ది ఎమర్జెన్సీ డైరీస్ అత్యయిక స్థితి నాటి రోజుల్లో నా ప్రయాణాన్ని వివరిస్తుంది. ఎన్నో జ్ఞాపకాలను గుర్తుచేస్తుంది" అని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ పుస్తకానికి మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ ముందుమాట రాశారు. దీన్ని బుధవారం సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా విడుదల చేయనున్నారు.

ప్రజాస్వామ్యాన్ని నిర్బంధించి..

ఈసందర్భంగా ఎమర్జెన్సీకి కారణమైన నాటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రధాని విమర్శలు గుప్పించారు. "దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిన ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు పూర్తయ్యాయి.

# నా జీవితంలో అతిపెద్ద రిస్క్ అదే

దిల్లీ: రిలయన్స్.. పరిచయం అక్కర్లేని పేరిది. పెట్రోల్ పంపులు, రిటైల్ స్టోర్లు, టెలికాం, మీడియా, ఓటీటీ.. ఇలా ఈ సంస్థ అడుగుపెట్టని రంగం లేదు. చేయని వ్యాపారం లేదు. అలాంటి దిగ్గజ కంపెనీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ముకేశ్ అంబానీ.. తన జీవితంలో తీసుకున్న అతిపెద్ద రిస్క్ గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. 2016లో రిలయన్స్ జియోతో టెలికాం రంగంలోకి తిరిగి అడుగుపెట్టడాన్ని తన జీవితంలోనే 'అతిపెద్ద రిస్క్'గా అభివర్ణించారు. ఆర్థికంగా విఫలమవుతుందని విశ్లేషకులు భావించినప్పటికీ భారతదేశాన్ని డిజిటల్‌గా మార్చడంలో జియో పోషించిన పాత్రను తాను మరిచిపోలేనంటూ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ కంపెనీ మెకిన్సీ అండ్ కోకు ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఉచిత వాయిస్ కాల్స్, అతి తక్కువ ధరలో డేటా అందించడం ద్వారా 2016లో భారత టెలికాం మార్కెట్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది రిలయన్స్ జియో. దీంతో పోటీ సంస్థలు సైతం ధరలు తగ్గించాల్సి వచ్చింది. మొబైల్ ఇంటర్నెట్ అందరికీ అందుబాటులోకి వచ్చింది. అయితే, తాను జియో 4జీ సేవలను ప్రారంభించాలని అనుకున్నప్పుడు చాలా మంది అనలిస్టులు అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి భారత్ సిద్ధంగా లేదని నాడు చెప్పారని అంబానీ గుర్తు చేశారు. "ఆ సందర్భంలో మా బోర్డు సభ్యులతో ఒక్కటే చెప్పా. మనం ఎక్కువ రాబడి ఆర్జించకపోవచ్చు. అదేమంత పెద్ద సమస్య కాదు. ఇది మన సొంత డబ్బు. ఒక సంస్థగా




రిలయన్స్ భారత దేశానికి అందించిన అత్యుత్తమ సేవ అవుతుంది. డిజిటల్ భారతంగా మార్చబోతున్నామని చెప్పా" అంటూ నాటి రోజులను అంబానీ గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం 47 కోట్ల మంది యూజర్లతో దేశంలోనే అతిపెద్ద టెలికాం ఆపరేటర్‌గా ఉంది. "ఈ భూమ్మీదకు వచ్చేటప్పుడు ఏమీ లేకుండా వస్తాం. వెళ్లేటప్పుడు ఏమీ తీసుకెళ్లం. మీరు వదిలిపెట్టేది ఒక సంస్థ మాత్రమే!' అని నా తండ్రి ధీరూభాయ్ అంబానీ ఓ సందర్భంలో నాతో చెప్పారు. 'రిలయన్స్ ఒక నిరంతర ప్రక్రియ. ఈ సంస్థ శాశ్వతంగా ఉండాలి. నీవు, నేను ఉన్నా లేకున్నా రిలయన్స్ కొనసాగాలి' అని నాతో చెప్పేవారు" అని ముకేశ్ అంబానీ అన్నారు. 2027లో రిలయన్స్ గోల్డెన్ జూబ్లీ జరుపుకోబోతోందని, వందేళ్లు పూర్తయినా కూడా రిలయన్స్ భారతదేశానికి, మానవాళికి సేవ చేయాలని తాను కోరుకుంటున్నట్లు అంబానీ తెలిపారు. 1960, 70ల్లో రిలయన్స్.. 2000, 2020ల్లో రిలయన్స్‌ను చూస్తే ఈ విషయం అర్థమవుతుందన్నారు. సంస్థ ఎప్పటికప్పుడు రూపాంతరం చెందుతోందన్నారు. టెక్నాలజీ అవకాశాలను అందిపుచ్చుకున్నప్పుడు మరిన్ని కొత్త అవకాశాలు వస్తాయని, వాటిని విడిచిపెట్టాలనుకోవడం లేదని ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిస్క్ మేనేజ్‌మెంట్ గురించి ముకేశ్ అంబానీ మాట్లాడారు. టెక్నాలజీ అవకాశాలను అందిపుచ్చుకున్నప్పుడు మరిన్ని కొత్త అవకాశాలు వస్తాయని, వాటిని విడిచిపెట్టాలనుకోవడం లేదని ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిస్క్ మేనేజ్‌మెంట్ గురించి ముకేశ్ అంబానీ మాట్లాడారు. "ఏదైనా ప్రారంభించేటప్పుడు అత్యంత ప్రతికూల సందర్భం ఏం ఎదురుకావొచ్చో ముందే ఆలోచించాలి. ఆ స్థితిని ఎదుర్కోగలడానికి ముందే సిద్ధం అవ్వాలి. నేను నమ్మే రిస్క్ మేనేజ్‌మెంట్ సూత్రాల్లో ఇది ఒకటి. 30, 40 ఏళ్ల క్రితం నా ఉద్యోగులతో కళ్లలో కళ్లు పెట్టి మాట్లాడాలని నిర్ణయించుకున్నా. రిలయన్స్‌లో మా లీడర్లకు కళ్లలో చూసి మాట్లాడటం ముఖ్యమని చెప్తాం. ఎందుకంటే అది మీ నిబద్ధతను తెలియజేస్తుంది" అని ముకేశ్ అంబానీ అన్నారు. ఏ రిస్క్ తీసుకోవడానికి సిద్ధం కావడమే రిలయన్స్ సంస్థాగత సంస్కృతి అని అంబానీ పేర్కొన్నారు.

# అక్కడ తీగ లాగితే.. ఇక్కడ డొంక కదిలింది

- ఏసీబీ అదుపులో భూపాలపల్లి సింగరేణి ఉద్యోగి
- ఉద్యోగాల పేరుతో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు
- మెడికల్ అన్ ఫిట్ చేయిస్తానని వసూళ్లు
- ముఠాగా ఏర్పడి గుట్టుగా వసూళ్ల దందా
- కొత్తగూడెంలో మొదలై భూపాలపల్లికి చేరిన ఏసీబీ విచారణ





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సింగరేణిలో అవినీతి చెదలును దులిపేందుకు ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు.. సింగరేణి అధికారుల ఫిర్యాదు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి మెయిన్ వర్క్ షాప్ డ్రైవర్ ను పట్టుకున్నారు.. అక్కడ తీగ లాగితే, భూపాలపల్లి సింగరేణిలో డొంక కదిలింది.. అక్రమ వసూళ్లకు పాల్పడిన ముఠాలో భూపాలపల్లి సింగరేణి ఉద్యోగి ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు బుధవారం ఉదయం భూపాలపల్లికి వచ్చి నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు.. వివరాల్లోకి వెళితే..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి మెయిన్ వర్క్ షాప్ డ్రైవర్ అన్నెబోయిన రాజేశ్వరరావును ఏసీబీ అధికారులు సుమారు 50రోజుల క్రితం పట్టుకున్నారు. సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి వసూళ్లు చేయడమే కాకుండా, సింగరేణి ఉద్యోగుల నుంచి కలెక్షన్లు చేసి దొరికిపోయాడు. ఉద్యోగులకు మెడికల్ అన్ ఫిట్ చేయిస్తానని, బదిలీలు చేయిస్తానని సుమారు 32 లక్షలకు పైగా వసూళ్లు చేసినట్లు అప్పుడే ఏసీబీ అధికారులు ప్రకటించారు. డ్రైవర్ తో పాటు మరికొందరు ముఠాగా ఏర్పడి అక్రమాలకు పాల్పడుతున్నట్టు సింగరేణి అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తగూడెంలో రాజేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. సింగరేణిలో ట్రాన్స్ ఫర్లు, మెడికల్ అన్ ఫిట్స్ చేయించేందుకు, సింగరేణి నోటిఫికేషన్ల సమయంలో అమాయక నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని భారీ కూపిలాగారు. ఈ కేసులో ఇప్పటికే రాజేశ్వరరావు, కడాలి చైతన్యలను అదుపులోకి తీసుకున్న ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేష్, సిబ్బంది బుధవారం ఉదయాన్నే జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రానికి చేరుకున్నారు.

భూపాలపల్లి సింగరేణిలోని 1ఇంక్లైన్ లో విధులు నిర్వహిస్తున్న సాదర్ల ప్రశాంత్ అనే సింగరేణి జనరల్ మజ్దూర్ కార్మికున్ని ఇంటివద్దనే అరెస్ట్ చేసి, విచారించి తీసుకెళ్లారు. ఈ కేసును మరింత లోతుగా విచారించే అవకాశం ఉంది. తొందరలోనే మరికొంతమంది అరెస్టు అయ్యే అవకాశం ఉంది. భూపాలపల్లి ఏరియాలో ఇంకా కొంతమంది తెరవెనుక వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏదిఏమైనా సింగరేణి ఏరియాల్లో తెరవెనుక జరుగుతున్న అక్రమ వసూళ్ల దందాపై ఏసీబీ అధికారులు ఉక్కుపాదం మోపడంతో సింగరేణి ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.




# ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలి

- రైతులకు ఆయిల్ పామ్ సాగు,లాభాలపై అవగాహన కల్పించాలి
- జిల్లాలో ఎరువులు, సీడ్స్ సిద్ధంగా ఉంచుకోవాలి, ఫర్టిలైజర్ షాప్ల తనిఖీ నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్




**మహబూబాబాద్ బ్యూరో, జూన్ 25 (జనం సాక్షి):** బుధవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, తో కలిసి వ్యవసాయ, హార్టికల్చర్, సహకార శాఖ, ఫర్టిలైజర్స్ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ హార్టికల్చర్ సహకార, సంఘాల బలోపేతం, రైతుల సౌకర్యార్థం అనేక పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు. పంట మార్పిడి ద్వారా ఆయిల్ పామ్ పంట సాగు పై రైతులకు అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖ అవగాహన సదస్సులు, ప్రచారం నిర్వహించాలని సూచించారు.

పామ్ ఆయిల్ పంట సాగు ద్వారా రైతులకు అనేక లాభాలు చేకూరుతాయని, ప్రభుత్వం కల్పించిన సబ్సిడీ, రాయితీల వివరాలను తెలియపరచాలన్నారు. జిల్లాలో 4500 ఎకరాల లక్ష్యం కాగా ఇప్పటివరకు 542 ఎకరాల లక్ష్యం పూర్తి చేసామని మిగిలిన లక్ష్యాలను ఆగస్టు మాసంలోపు నెలవారీగా ప్రత్యేక కార్యచరణ చేపట్టి లక్ష్యాలు చేరుకోవాలని అన్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో తనకి పూర్తయిన 2723 ఎకరాల విస్తీర్ణానికి ప్రభుత్వం సూచించిన ప్రకారం రాయితీ మినహా సొమ్మును రైతుల నుండి డిడి రూపం సేకరించాలన్నారు.

ప్రస్తుత పంటల విస్తీర్ణానికి అనుగుణంగా జిల్లాలో యూరియా 9419.894, డీఏపీ 1299.2, ఏంఓపి 387.66, ఎస్ఎస్పి 830.2, కాంప్లెక్స్ 728264, మెట్రిక్ టన్నులు, నిలువలు సిద్ధంగా ఉన్నాయని రైతులు ఏలాంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి వారం రోజులకు ఒకసారి ఫర్టిలైజర్ షాపులను తనిఖీలు నిర్వహించి స్టాకు రిజిస్టర్లను , ఈ పాస్ మిషన్లు సరిచూసుకోవాలన్నారు, ఎలాంటి కొరత లేకుండా చూసుకోవాలని చూసుకోవాలన్నారు.

ప్రభుత్వం సూచించిన ప్రకారం రైతుల ఆధార్ ఈకేవైసి, అనుసంధానంతో ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేయాలన్నారు, రైతుల సౌకర్యార్థం జిల్లాలో సహకార శాఖ ద్వారా (35) ఎరువుల దుకాణాల పాయింట్లు ప్రారంభించి సిద్ధంగా ఉంచామని, రైతుల అవసరాల కు అనుగుణంగా సరిపడా ఎరువులు నిలువలు గోడౌన్సులలో సిద్ధంగా ఉంచడం జరిగిందని అన్నారు.

నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. (రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు) అనే కార్యక్రమం ద్వారా ప్రతి అంశంలో వారికి అవగాహన కల్పించి ప్రచారం చేయాలన్నారు. ఆయిల్ పామ్ విస్తరణకు వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, సహకార శాఖ ఆయిల్ ఫెడ్ సంబంధిత క్షేత్రస్థాయి అధికారులు అందరూ పరస్పర సహకారంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలన్నారు, అంతరం ఉద్యాన దర్శని అనే బుక్కులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఉద్యానవన శాఖ అధికారి జి. మరియన్న, ఎడిఎలు శ్రీనివాస్ రావు, మురళీ, విజయ్ చంద్ర, అన్ని మండలాల ఏఓలు, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీ హరిబౌలిలోని చారిత్రకమైన శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ 77వ వార్షిక బోనాల పండుగ ఆహ్వాన పత్రికను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం నాడు ఆవిష్కరించారు.



## రోడ్డు ప్రక్కనే వ్యర్థాలు... కంపు కొడుతున్న రహదారి

**నిజంసాగర్ (జనంసాక్షి) :** నిజంసాగర్ మండల కేంద్రంలోని పెద్ద బ్రిడ్జి సమీపంలో వ్యర్థాలు, చెత్త పడేయడంతో రహదారి గుండా ప్రయాణించే ప్రజలకు దుర్గంధం వెదజల్లుతుందని ప్రజలు అంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో చెత్త ట్రాక్టర్లను పారిశుద్ధ సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు కాలనీలలో శుభ్రపరుస్తూ చెప్తాను డంపింగ్ యార్డ్ లకు తరలించాలని ఆదేశాలు ఉన్నాయి. కానీ మండల కేంద్రంలో మాత్రం కొందరు వ్యర్థాలను రోడ్డుపై పరవేయడంతో దుర్గంధం వ్యాపిస్తుంది. రోడ్డున వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్తున్నామని ప్రజలు అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వ్యర్థాలను, చెత్తను రోడ్డు ప్రక్కన వేయకుండా ఆపాలని కోరుతున్నారు.

## మావోయిస్టు నేత గాజర్ల రవి కుటుంబాన్ని పరామర్శించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**టేకుమట్ల జూన్ 24 జనంసాక్షి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుపల్లి అడవుల్లో జరిగిన ఎన్కౌంటర్లో రవి మృతి చెందిన విషయం తెలిసిందే ఈ విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గాజర్ల రవి స్వగ్రామమైన టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలోని వారి ఇంటికి వెళ్లి మావోయిస్టు నేత రవి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం మృతుని సోదరులైన గాజర్ల సమ్మయ్య గాజర్ల అశోక్ రవి అన్న ఆజాద్ కుమారుడు నవీన్ ను కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ మృతుని కుటుంబ సభ్యులు ఎవరు అధైర్య పడవద్దు అని భరోసా కల్పించారు ఈ కార్యక్రమం లో కుటుంబ సభ్యులు కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు

## పారమిత ఎక్స్ ప్లోరిక పాఠశాల - కేంబ్రిడ్జ్ ప్రైమరీ చెక్ పాయింట్ ఫలితాల్లో అద్భుత విజయం



**కరీంనగర్ బ్యూరో, జూన్ 25 (జనంసాక్షి) :** స్థానిక నగరంలోని జ్యోతినగర్ లో పారమిత ఎక్స్ ప్లోరిక ఇంటర్నేషనల్ స్కూల్ కి చెందిన 6వ, తరగతి విద్యార్థులు ఇటీవల ప్రకటించిన కేంబ్రిడ్జ్ ప్రైమరీ చెక్ పాయింట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభను కనబరిచారు. ప్రైమరీ చెక్ పాయింట్ ఫలితాల్లో అంతర్జాతీయ స్థాయిలో సగటు 33వ స్థానం సాధించారు. విద్యార్థులందరూ ప్రతి సబ్జెక్టుల్లో 95% కంటే ఎక్కువ స్కోర్ సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ శర్మిష్ఠ తెలిపారు. పాఠశాల చైర్మన్ డా. ఇ. ప్రసాద్ రావు మాట్లాడుతూ... ఈ విజయంతో కరీంనగర్ విద్యార్థుల ప్రతిభ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిందని ఇది కేవలం విజయం కాదు చరిత్ర అని విద్యార్థులను ప్రశంసించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రాంగణంలో విజయోత్సవం నిర్వహించా రు. విజేతలందరికీ ప్రశంసా పత్రాలు, మెమెంటోలు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు, టీచర్లు, మేనేజ్మెంట్ సభ్యుల సమక్షంలో విద్యార్థుల విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన, రశ్మిత, ప్రాచి, అనూకర్ రావు, వినోద్ రావు, రమణ, వి యు యం.ప్రసాద్, హనుమంతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శర్మిష్ఠ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేసారు.

# గురుకుల పాఠశాల స్థాయిలో అభివృద్ధి చేస్తా

- కార్పొరేట్ విద్యా సంస్థల కంటే మెరుగైన ఫలితాలు సాధించాలి
- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్పూర్, జూన్ 25 (జనంసాక్షి) :** గిరిజన హాస్టల్ ను ఆశ్రమ పాఠశాలగా అప్ గ్రేడ్ చేయించడంతో పాటు గురుకుల పాఠశాల స్థాయిలో అభివృద్ధి చేస్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని గిరిజన హాస్టల్ డార్మేటరీ భవన ప్రారంభోత్సవకార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిలాఫలాకాన్ని ఆవిష్కరించి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ గిరిజన హాస్టల్ భవనం పూర్తిగా నిరూపయోగంగా ఉందని నా దృష్టికి వచ్చిన వెంటనే 63లక్షల 50వేల రూపాయలు మంజూరు చేయించి పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేయించి ఈ రోజు పునర్ ప్రారంభించుకున్నామని తెలిపారు. అతిత్వరలో నే గిరిజన వసతి గృహాన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రహరీ గోడ, ల్యాండ్ లేవలింగ్ చేయాల్సిన అవసరం ఉందని దీనికి త్వరలోనే ప్రతిపాదనలు పంపి మంజూరు చేయి స్తానని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఎక్కడా లేనన్ని గురుకుల పాఠశాలలు ఉన్నాయని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని గురుకుల, కస్తూరిభా, మాడల్, ఆశ్రమ పాఠశాలల ప్రిన్సిపాల్స్ తో సమావేశం నిర్వహిస్తాననితెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జిలను, కాస్మోటిక్ ఛార్జిలను పెంచిందని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు, అధికారులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ఫలితాలు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేసినప్పుడే మెరుగై న ఫలితాలు సాధించగలమని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఆర్డీవో వెంకన్న, డిటిడివో ప్రేమకళ, తాహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, డిఈవో భోజన్న, ఎంఈఓ కొమురయ్య, ఏటిడిఓ రూపా దేవి, ఏఈ వినీల్, హెచ్ఎం సోమ్లా నాయక్, హెచ్ డబ్ల్యుఓ వెంకటే ష్, ఏవో నాగసాగర్, నాయకులు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, బెలిదె వెంకన్న, పోగుల సారంగపాణి, సింగపురం వెంక టయ్య, నాగరబోయిన శ్రీరాములు, వెంకటేశ్వర్ రెడ్డి,నీల నరసింహులు,భూక్య రమేష్ నాయక్,స్వామి నాయక్, ఫాతికుమార్, కొర్ర వెంకటేష్ నాయక్,గిరిజన సంక్షేమ శాఖఅధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్ యూ భూముల సమస్యను పరిష్కరించండి

- నష్టపరిహారం చెల్లించకుండా ప్రైవేట్ కు బదలాయిస్తే రాష్ట్రానికి నష్టం
- ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని కోరిన మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ(సీపీఎస్ యూ)లకు కేటాయించిన భూముల సమస్య పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. ఆ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామిని కలిసి వినతి పత్రం సమర్పించారు. '1960లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన కోసం హైదరాబాద్ చుట్టుపక్కల, ఇతర ప్రాంతాల్లో విలువైన భూములను రాయితీ ధరకు హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్(324.87 ఎకరాలు), హిందుస్తాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్(126.33 ఎకరాలు), ఐడీపీ ఎల్(551.03 ఎకరాలు), హెచ్ఎంటీ(888.05 ఎకరాలు) సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (2,272.85 ఎకరాలు), ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ(3,020 ఎకరాలు) తదితర సంస్థలకు కేటాయించింది' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. 'ప్రస్తుతం రాష్ట్రంలోని సీపీఎస్ యూల్లో కొన్ని మూతపడ్డాయి. మరికొన్నింటిలో ఉత్పత్తి నిలిచిపోయింది. ఫలితంగా ఆ పరిశ్రమలకు కేటాయించిన భూములు నిరుపయోగంగా మారాయి. కొన్ని సంస్థలు ఈ భూములను వాణిజ్య పరంగా వినియోగించుకునేందుకు వీలుగా ప్రైవేట్ సంస్థలకు బదలాయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి' అని చెప్పారు. 'సరైన పరిహారం చెల్లించకుండా భూములను ప్రైవేట్ కంపెనీలకు బదిలీ చేయడం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుంది. ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలకు భంగం కలగకుండా నిరుపయోగంగా ఉన్న సీపీఎస్ యూ భూముల వినియోగానికి మార్గదర్శకాలు రూపొందించాలి' అని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే ఈ సమస్య పరిష్కారానికి ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లుగా మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించండి

### రేర్ ఎర్త్ ఎగుమతులపై చైనా ఆంక్షలు.. తయారీ రంగంపై తీవ్ర ప్రభావం

### కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరిన మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** రేర్ ఎర్త్ ఎగుమతులపై చైనా విధించిన ఆంక్షలు తెలంగాణలోని తయారీ రంగం పై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని, వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని ప్రత్యామ్నాయాలపై కేంద్రం దృష్టి సారించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. ఆ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తో ప్రత్యేకంగా సమావేశమై వినతి పత్రం సమర్పించారు. "ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తికి అవసరమైన రేర్ ఎర్త్ మాగ్నెట్లు, కీలక ముడి పదార్థాలు, రసాయనాలు ఎక్కువగా చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి. ఈ తరహా పదార్థాల ఎగుమతులపై ఆ దేశం తాజాగా ఆంక్షలు విధించింది. ఆ ప్రభావం ఎలక్ట్రానిక్స్, ఈవీలు తయారు చేసే పరిశ్రమలపై పడింది. రాబోయే రోజుల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా తెలంగాణలో తయారీ రంగంపై ఈ ప్రభావం ఎక్కువగా పడుతుంది' అని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఎలక్ట్రానిక్స్, ఈవీ తయారీ పరిశ్రమలకు ఇబ్బంది కలగకుండా వాస్తవ పరిస్థితిని సమీక్షించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.




# మెరుగ్గా వైద్య కళాశాల నిర్వహణ

### మెడికల్ సైన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ ఫణీందర్ రెడ్డి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో నూతనంగా ఏర్పాటైన వైద్య కళాశాల నిర్వహణ సజావుగా సాగుతోందని తెలంగాణ మెడికల్ సైన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ ఫణీందర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజారావు, టీజీఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్ లతో కలిసి వైద్య కళాశాల, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఈ సంవత్సరం ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభమవుతున్న తరుణంలో విద్యార్థులకు అవసరమైన విద్యా, వసతి, ప్రయోగశాలలు, పరికరాల, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ సంకల్పాన్ని అనుసరించి కళాశాల పనుల్ని వేగంగా పూర్తిచేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య కళాశాల, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అన్ని విభాగాలను పరిశీలించి పూర్తి నివేదికను వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శికి సమర్పించనున్నట్లు తెలిపారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనల మేరకు కళాశాలలో మౌలిక సదుపాయాలు, సిబ్బంది వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. పర్యటనలో గుర్తించిన అంశాలపై సమగ్ర నివేదికలు ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, విద్యార్థుల వసతి సౌకర్యాల కొరకు సింగరేణి సంస్థ నుండి ప్రత్యేక బ్లాక్ కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థుల హాజరు, సిబ్బంది వివరాలను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న బ్లాకులు, ల్యాబ్ లు, మెడికల్ పరికరాలను పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కళాశాల నిర్వహణ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి, అంతస్థుల నిర్మాణం, వసతులను సమీక్షించారు. పనుల్లో వేగం పెంచి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఓపి, ఇన్ పేషెంట్స్, వైద్య పరికరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజేంద్రప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డా. నవీన్ కుమార్, ఇతర సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి జిల్లాలో పోలీసుల నిఘా

- ముమ్మరంగా వాహనాల తనిఖీలు
- మారుమూల ప్రాంతాల్లో పోస్టర్లు
- గాజర్ల రవి స్వగ్రామమైన వెలిశాలపై ప్రత్యేక దృష్టి





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పోలీసులు గట్టి నిఘా వేశారు.. వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు.. మావోయిస్టులకు ఆశ్రయం కల్పించొద్దని, వారిని పట్టించి తగిన పారితోషికం పొందాలని కోరుతూ మారుమూల ప్రాంతాల్లో వాల్ పోస్టర్లు అంటించారు.. ముఖ్యంగా మారేడుమిల్లి ఎన్ కౌంటర్ మృతుడు గాజర్ల రవి అలియాస్ గణేశ్ స్వగ్రామమైన వెలిశాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.. అంత్యక్రియలు జరిగిన రోజు కూడా రహస్యంగా నిఘా వేసినట్లు తెలిసింది..

ఏపిలోని అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీప్రాంతంలో ఈ నెల 18న తెల్లవారుజామున జరిగిన ఎన్ కౌంటర్ లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత, చర్చల ప్రతినిధి, కేంద్ర కమిటి సభ్యుడు, ఏఓబి కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ గణేశ్, అలియాస్ ఉదయ్ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా స్వగ్రామమైన వెలిశాలలో రవి అంత్యక్రియలు ఘనంగా జరిగాయి. కుటుంబసభ్యులు, సానుభూతిపరులు, అభిమానులు, పౌరహక్కుల నేతలు, విరసం నేతలు, బంధుమిత్రుల కమిటీ సభ్యులు, మాజీలు భారీగా తరలివచ్చారు. ఎర్ర జెండాలు, విప్లవ గేయాలు, నినాదాల తో వెలిశాల హోరెత్తింది. అయితే పోలీసులు కూడా అంత్యక్రియలకు మఫ్టీలో వచ్చి ఎవరెవరు హాజరయ్యారనే దానిపై ఆరా తీసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ, అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించి వదిలేస్తున్నారు. మరికొన్ని చోట్ల బండి నంబర్ చెక్ చేసి, దానిపై ఉన్న చలాన్లను ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్ తర్వాత, తెలంగాణ, ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలోను నిఘా తీవ్రతరం చేశారు. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని సరిహద్దు గ్రామాలలో హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

పొరుగు రాష్ట్రాల నుండి కాళేశ్వరం, కాటారం, భూపాలపల్లి ప్రాంతాలకు మావోయిస్టులు వచ్చే అవకాశం ఉందని భావించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగుతున్నారు. అదేవిధంగా భూపాలపల్లి మండలంలోని మారుమూల గ్రామాల్లో జిల్లా పోలీసుల పేర హెచ్చరికలు జారీ చేస్తూ పోస్టర్లు వెలువడడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లోకి మావోయిస్టులను రానివ్వొద్దని, వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూనే, మావోలు వస్తే సమాచారం ఇవ్వాలని, తగిన పారితోషికం ఇస్తామని, మీ పేరు రహస్యంగా ఉంచుతామని పోస్టర్లలో పేర్కొన్నారు.

దీంతో పాటు ఆయా మండలాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండి అన్ని కోణాల్లో నిఘా ఉంచారు. వెలిశాలలో గాజర్ల రవి దశదినకర్మ రోజు కూడా సంస్మరణ సభకు ఎవరెవరు వస్తున్నారు..? స్థూపాలు ఏమైనా ఏర్పాటు చేస్తారా అనే విషయాలపై ఇప్పటినుండే ఆరా తీసే పనిలో పోలీసులు ఉన్నట్లు తెలుస్తుంది. ఇదిలాఉండగా ఓ మండలంలోని సరిహద్దు గ్రామాల్లో మావోల కదలికలు ఉన్నాయనే ప్రచారం జరుగుతుంది. ఏదిఏమైనా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది.



# గిదేం జిల్లా దవఖాన

## రోగుల పట్ల కొనసాగుతున్న నిర్లక్ష్యం

### వైద్య సిబ్బంది, పోలీసుల అత్యుత్సాహం

*"నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు" అనే నానుడిని మరోసారి నిజం చేస్తూ, నిజామాబాద్ జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రి రోగుల బాధలకు, నిర్లక్ష్యానికి కేంద్రబిందువుగా మారింది. నూతన సూపరింటెండెంట్ నియామకం జరిగి మూడు నెలలు గడిచినా, ఆస్పత్రి తీరుతెన్నుల్లో ఎలాంటి మార్పు లేదు. ప్రమాదంలో గాయపడిన ఓ మహిళను చికిత్స కోసం తీసుకొచ్చినా, ఆమెను రేకుల షెడ్డులో పడేసి, చీమలు, ఈగల మధ్య వదిలేసిన హృదయవిదారక ఘటన మంగళవారం ఈ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం, పోలీసుల అత్యుత్సాహం, మీడియాపై దురుసు ప్రవర్తనుఈ ఘటన సమాజంలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది.*

**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూన్ 25 (జనం సాక్షి) :**

నిజామాబాద్ జిల్లా జనరల్ ప్రభుత్వ ఆసుపత్రి "నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు" అనే నానుడిని మరో మారు నిజం చేసింది. దవాఖానను పర్యవేక్షణ చేయాల్సిన అధికారి మారినప్పటికీ దవాఖాన తీరు మాత్రం మారడం లేదనే చెప్పాలి. నూతన సూపరిండెంట్ విచ్చేసి మూడు నెలలు కావస్తున్నా రోగుల పట్ల గతంలో జరిగిన సంఘటనలే పునరావృతం అవుతున్నాయనే చెప్పాలి. ఆపద కాలంలో చికిత్స కోసం ఆసుపత్రికి వస్తే రోగుల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్యపు ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రమాదానికి గురైన ఓ మహిళ జిల్లా జనరల్ ఆస్పత్రికి చికిత్స కోసం రాగా ఆమెను బయటకు గెంటేశారు. ఈ హృదయ విదార ఘటన జిల్లా జనరల్ ఆస్పత్రిలో మంగళవారం చోటు చేసుకుంది. పెర్కిట్ గ్రామానికి చెందిన బుజ్జమ్మ అనే రోగిని అంబులెన్స్ లో 24వ తేదీన చావు బతుకుల్లో జిల్లా జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను దవాఖానలో అడ్మిట్ చేసుకున్నా రో లేదో తెలియదు కానీ పేషెంట్ కు గాయం దగ్గర పట్టి కట్టి ఆ వెంటనే ఆమెను ఆస్పత్రి ఆవరణలో గల రేకుల షెడ్డులో ఉంచి వెళ్ళిపోయారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. గాయపడిన పేషెంటు మరుసటి రోజు బుధవారం వరకు రేకుల షెడ్ లోనే ఉందన్నారు. విషయం తెలుసుకున్న సిపిఎంఎల్ మాస్ లైన్(ప్రజాపంథా) ప్రతినిధులు పేషంట్ దగ్గరికి వచ్చి విషయాలు తెలుసుకుందామని ప్రయత్నించగా పేషెంట్ మాట్లాడే స్థితిలో లేదని, పేషెంట్ తో ఎవరు లేరని నిన్నటి నుంచి రేకుల షెడ్‌లోనే పేషెంట్‌ను పడేయడం. పేషంటుకు చీమలు, ఈగలు దోమలు వాల్తున్న పరిస్థితిని పాత్రికే మిత్రులందరికీ స్వయంగా ఫోన్ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు మమ్మల్ని, ఈ విషాదకర సంఘటనపై మాట్లాడకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. డ్యూటీలో డాక్టర్ ఎవరు లేకపోతే మేమేం చేయాలని ఎదురు ప్రశ్న వేయడం అబద్ధాలు మాట్లాడడం అత్యుత్సాహం చేయడం దుర్మార్గ మైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్నటి పేషంటు విషయాలన్నీ కూడా రికార్డును పరిశీలించి డ్యూటీలో ఉన్న డాక్టర్ పైన, రేకుల షెడ్‌లో పడేసిన సిబ్బంది పైన చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై పూర్తిగా విచారణ జరిపించి అత్యుత్సాహం వహించిన పోలీసులపై, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహించిన డాక్టర్, వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చిన పేషంట్ పై నిర్లక్ష్యం చేయడమే కాకుండా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న పేషంటు పరిస్థితిని కవరేజ్ చేయడానికి వెళ్లిన మీడియాపై కూడా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు చిందులు వేయడం గమనార్హం. కవరేజ్ కోసం వచ్చిన పాత్రికేయులతో దురుసుగా మాట్లాడిన డాక్టర్ పైన చర్యలు తీసుకోవాలని డిఎం అండ్ హెచ్ఓ కు విజ్ఞప్తి చేశారు. వైద్యం కోసం వచ్చిన బాధితులపై ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసుల అత్యుత్సాహంపై సిపి దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు.

**గతంలో ఇలాంటి ఘటనలు**

- నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 2023 మార్చి 31న జరిగిన ఒక అమానుష ఘటన సమాజంలో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో, ఆస్పత్రిలో వీల్‌చైర్ లేదా స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడంతో, స్పృహలో లేని ఒక రోగిని అతని తల్లిదండ్రులు కాళ్లు పట్టుకుని నేలపై ఈడ్చుకెళ్లవలసి వచ్చింది. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. ఈ ఘటన ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాల లోపాలను, సిబ్బంది నిర్లక్ష్యాన్ని మరోసారి బట్టబయలు చేసింది.
- నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇది మొదటి ఘటన కాదు. 2021లో కోవిడ్-19 రెండో దశలో, నిజామాబాద్ జిల్లాలో కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది, రోజుకు 200 కంటే తక్కువ కేసులు నమోదు కాలేదు. ఈ సమయంలో, ఆస్పత్రిలో రోగుల భారం పెరగడంతో, ప్రభుత్వం 20 అదనపు ప్రైవేట్ ఆస్పత్రులకు కోవిడ్-19 చికిత్సకు అనుమతి ఇచ్చింది. అయినప్పటికీ, సౌకర్యాల కొరత, సిబ్బంది నిర్లక్ష్యం వంటి సమస్యలు బయటపడ్డాయి.
- 2025 జనవరిలో మరో ఘటనలో, ఆస్పత్రి సిబ్బంది రోగులను విడిచిపెట్టి సూపరింటెండెంట్ ప్రతిమా రాజ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ సందర్భంలో, ఒక రోగి భర్త తన భార్యను ఏడవ అంతస్తు వరకు భుజంపై మోసుకెళ్లవలసి వచ్చింది, ఎందుకంటే అటెండర్లు లేదా స్ట్రెచర్లు అందుబాటులో లేవు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో
# ఎన్నికల కోలాహాలం



**కరీంనగర్ బ్యూరో, జూన్ 25 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యం లో ఎన్నికలు చాలా కీలకమే కాకుండా ప్రజా సంక్షేమంలో ప్రధాన భూమిక పాత్రపోషిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వివిధ విభాగాల కెప్టెన్స్ , వైస్ కెప్టెన్స్ ఎన్నికల నిర్వహణ ప్రారంభానికి ముఖ్యఅతిధిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి ఎన్నికలకు సంబందించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికల నిర్వాహణ ఒక గొప్ప అధ్యాయమని, ఎన్నికలను సజావుగా నిర్వహించడానికై ఒక ప్రత్యేక కమీషనను ఏర్పాటు చేయడం జరిగినదని ఆ కమీషన్ ద్వారానే వివిధ ప్రాంతాలలో ఎన్నికల నియమావలిని రూపొందించి ఎటువంటి ఆటంకం లేకుండా ప్రజా స్వామ్య విలువలను పరిరక్షించే విధంగా ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల ద్వారానే ప్రజలు వారికి కావల్సిన వసతులను, నచ్చిన నాయకుని ఎన్నుకొని సమకూర్చుకుంటారని అమూల్యమైన ఓటును వేస్తారని గుర్తు చేశారు. ప్రతి సం. లాగే ఈ విద్యా సం. విద్యార్థులు వివిధ విభాగాలుగా విభజించి ఎన్నికలను నిర్వహించడం జరిగినదని చెప్పారు. పాఠశాలలోని విద్యార్థులను లక్ష్య, తేజస్, ధృవ, సరన్ విభాగాలుగా చేయడం జరిగినదని, ప్రతీ హౌజ్కు బాలికలకు, బాలురకు క్యాప్టెన్, వైస్ క్యాప్టెన్ ఎన్నికలను వేరువేరుగా నిర్వహించడం జరిగినదని చెప్పారు. విద్యార్థుల్లో ఎన్నికలకు సంబందిచిన విషయాలను తెలియపర్చుడానికై , వసృత్తంగా అవగాహన కల్పించడానికై ఎన్నికల వాతావర్ణం తలపించే విధంగా ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పోలింగ్ ప్రారంభానికి ముందు ఔత్సాహికులు వారి గుర్తులతో వివిధ తరగతి గదులను సందర్శించి వారి గుర్తులతో ప్రచారం చేసి తమకే ఓటు వేసి గెలిపించాలని తోటి స్నేహితులను అభ్యర్థించారు. ఈ ఫలితాలను త్వరలో ప్రకటించి గెలుపొందిన విద్యార్థులకు వేడుకగా ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. హోరా హోరిగా ఎన్నికల వాతావర్ణం తలపించే విధంగా నిర్వహించిన ఈ ఎన్నికల్లో విద్యార్థులు వారి ఓటు హక్కును వినియోగించుకోవడానికై రెట్టింపు ఉత్సాహాన్ని ప్రదర్శించారని చెప్పారు. పోటీ దారులందరు వారి వారి గుర్తులతో వివిధ తరగతి గదులను నమూనా గుర్తులతో సందర్శించి హామిలిచ్చి ఓట్లను అభ్యర్తించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహంకాళి ఆలయ బోనాల పత్రిక ఆవిష్కరణ

**చార్మినార్, జూన్ 25 :** పాతబస్తీ హరిబౌలిలోనీ చారిత్రకమైన శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ 77వ వార్షిక బోనాల పండుగ ఆహ్వాన పత్రికను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం నాడు ఆవిష్కరించారు. జూబ్లీహిల్స్‌లోని కొండా సురేఖ నివాసంలో జరిగిన కార్యక్రమంలో అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీ అధ్యక్షుడు డీఆర్ ప్రభాకర్, సలహాదారులు రాందేవ్ అగర్వాల్, కోశాధికారి ఏ సతీష్, ప్రతినిధులు ఎస్పీ క్రాంతి కుమార్, జగ్మోహన్ కపూర్, ఏం కృష్ణ, జి రాఘవేందర్, గట్టు శ్రీనివాస్, సాయికిరణ్, పి విశాల్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## అందని ద్రాక్షలా ఎగ్ బిర్యాని పథకం

### చిన్నారులకు అందని పౌష్టిక ఆహారం



**నిజాంసాగర్ జూన్ 25 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఎగ్ బిర్యానీ పథకం చిన్నారులు బాలింతలు గర్భిణీ స్త్రీలకు పూర్తిస్థాయిలో అందడం లేదని ప్రజలు అంటున్నారు. సరుకుల సరఫరాలో జాప్యం చిన్నారులకు శాపం గా మారింది. బుధవారం నాడు క్షేత్రస్థాయిలో పరిశీలించగా కొన్ని సెంటర్లలో గుడ్లు సరఫరా లేనందున పిల్లలకు ఎగ్ బిర్యానీ పెట్టలేకపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ప్రతి బుధవారం అంగన్వాడి సెంటర్లలో ఎగ్ బిర్యానీ ని వండి పెట్టవలసి ఉండగా కొన్ని సెంటర్లలో మెనూ పాటించకుండా పప్పు అన్నం ఉడికించిన గుడ్డు మాత్రమే అందిస్తున్నారు. కొన్ని అంగన్వాడి సెంటర్ల నందు ఎగ్ బిర్యానీ అందిస్తున్నారు. మరికొందరు ఎందుకు ఎగ్ బిర్యానీ అందించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గుడ్ల సరఫరా లేనందున ఎగ్ బిర్యానీ అందించడం లేదని అంగన్వాడి టీచర్లు అంటున్నారు. కొన్ని సెంటర్లలో పోయిన బుధవారం ఎగ్ బిర్యానీ అందించామని ఈ వారం సరుకులు లేనందున పెట్టలేదని అంటున్నారు. అక్కడ రోజువారి గా అందించే మెనూ పరిశీలించగా పాతమేను దర్శనమిస్తుంది. అయితే పై అధికారులు ముందు చూపుగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి సరుకులను సకాలంలో అందిస్తే చిన్నారులకు పౌష్టికాహారం సకాలంలో అందుతుంది. నిజం సాగర్ ఐసిడిఎస్ సెక్టార్లు మొత్తం 27 అంగన్వాడి కేంద్రాలు కొనసాగుతున్నాయి ఈ సెంటర్లలో ఒక్కోసారి గుడ్లు పాడైపోయినవి వస్తున్నాయి ఇదేంటని గ్రామస్తులు అంగన్వాడి సిబ్బందిని ప్రశ్నించగా పైనుండి అలాగే వస్తున్నాయి దీనికి మేమేం చేస్తామని దురుసుగా సమాధానం చెబుతున్నారని ప్రజలు చెప్తున్నారు. ఈ విషయంపై నిజం సాగర్ అంగన్వాడి సూపర్వైజర్ లక్ష్మిని వివరణ కోరగా ప్రతి బుధవారం ఎగ్ బిర్యానీ పెట్టాలని పైనుంచి ఆదేశాలు ఉన్నప్పటికీ గుడ్ల సరఫరా బిర్యానీ సరుకులు సకాలంలో సెంటర్లకు అందకపోవడంతో చిన్నారులకు బిర్యానీ అందించలేకపోతున్నామని అన్నారు. ఇకపై ప్రతి సెంటర్లో బుధవారం నాడు ఎగ్ బిర్యానీ అందించేలా చూస్తామని అన్నారు.

## పౌష్టికాహారం అందిస్తూ పాఠాలు బోధించాలి

**అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ఆకస్మిక తనిఖీ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

వేములవాడ(జనంసాక్షి):అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ పాఠాలు బోధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందిస్తున్న కోడిగుడ్లు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ పాఠాలు బోధించాలని సూచించారు.అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో తరగతులను పరిశీలించారు. స్కూల్ లో ప్రధానోపాధ్యాయుడు విధులకు హాజరు కాకపోవడంతో పరిశీలించి, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.

## ట్రా"ఫేజు"పై అధికారుల ఫోకస్

- జనంసాక్షి కథనంతో ఆగడాలకు చెక్
- ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ రిలీవ్

EFFECT జనంసాక్షి

**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** ఖమ్మం ట్రాఫిక్ లో సుదీర్ఘ కాలంగా రిలీవ్ కాకుండా ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ పై ఎట్టకేలకు బదిలీ వేటు పడింది. అతడిని బదిలీ చేసి అతని విధుల్లో అతను చేరేలా పోలిస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. దాంతో అతని ఆగడాలకు చెక్ పడింది. ఖమ్మంలో ట్రాఫిక్ పోలీసులపై వరుస కథనాలు జనంసాక్షిలో ప్రచురితం కావడంతో పోలిస్ వర్గాల్లో, రాజకీయ నాయకుల్లో చర్చ మొదలైంది. క్రమశిక్షణ కలిగిన నాయకులు పాలిస్తున్న జిల్లాలో క్రమశిక్షణ రాహిత్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని మరోసారి స్పష్టమైంది. దాంతో మిగిలిన వారు దిద్దుబాటు చర్యల్లో నిమగ్నమయ్యారు. తప్పుచేసే వారిపై జనంసాక్షి నిఘా పెడుతుందని హెచ్చరిస్తుంది. ఎన్ని బెదిరింపులకు పాల్పడినా, కవ్వింపు చర్యలు చేపట్టినా, తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురిచేసినా "జనంసాక్షి" ప్రతినిధులు అదరరు బెదరరు అని మరోసారి స్పష్టం అయ్యింది. ప్రజా అవసరాలను, తిరుగుబాటును, ఉద్యమాలను, ప్రభుత్వ, రాజకీయ, ఉద్యోగ, ప్రతిపక్షాల తప్పులను వేలెత్తి చూపడంలో జనంసాక్షి మొహమాటానికి వెళ్లదని బహిర్గతం చేస్తుంది. అనేక సవాళ్లను ఎదుర్కొని, కత్తి మీద సాము లాంటి వార్తలను ప్రచురిస్తూ ప్రజలపక్షాన నిలబడి పోరాటం చేస్తున్నందున ప్రజల నుంచి జనంసాక్షికి మద్దతు లభిస్తుంది.

# ఎమర్జెన్సీ.. రాజ్యాంగ హత్య దినంకు 50 ఏళ్లు

- అధికారం నిలుపుకునేందుకు దేశంలో ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీ
- 370 ఆర్టికల్ రద్దవుతుందని కళలో ఎవరు ఊహించలేదు
- ఇకపై ఏదైనా ఉద్యమం తలపెట్టిన ముందుండి నడిపిస్తా :మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావు



**కరీంనగర్ బ్యూరో, జూన్ 25 (జనంసాక్షి) :**

స్వతంత్ర భారతదేశ చరిత్రలో దేశం ఎప్పుడు మరిచిపోలేని రోజు, ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేసి చీకటి అధ్యాయానికి తెరలేపిన రోజు 1975 జూన్ 25 అని, అధికారాన్ని కాపాడుకునేం దుకు నాటి ప్రధాని ఇందిరాగాంధీ జూన్ 25 న ఎమర్జెన్సీ విధించిందని, ఆమె తీసుకున్న చీకటి నిర్ణయం ఏకంగా 21 నెలలపాటు దేశ ప్రజలకు శాపమైందని మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావు అన్నారు. కరీంనగర్ జిల్లా బిజెపి శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి అధ్యక్షతన బుధవారం రోజున కరీంనగర్లోని స్థానిక ఈ ఎన్ గార్డెన్స్ లో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సదస్సు జరిగింది. ఇట్టి సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ అంటే ఇరవై ఒక్క నెలల నిర్బంధం మాత్రమే కాదు, నిర్బంధపు పిడికిలిలో కొన్ని తరాలవరకూ వినిపించే మనోరోదన ఉందని తెలిపారు..ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ చేదు జ్ఞాపకాలు, వెంటాడే పీడ కలలను గుర్తు చేసుకోవాల్సిన సమయమి దన్నారు. అనుమానం వస్తే చాలు ఎంతటి వారైనా ముందస్తు నిర్బంధంలోకి తీసుకోవడం పరిపాటిగా మారిందని, విపక్ష నేతలు అందరిని జైలు పాలు చేశారని వివరించారు. ప్రధానంగా ఎమర్జెన్సీ కాలంలో మీడియాపై ఇందిరా సర్కారు, ఆమె తనయుడు సంజయ్ గాంధీ ఉక్కు పాదం మోపారని, అందుకోసం ప్రివెన్షన్ ఆఫ్ పబ్లికేషన్ ఆఫ్ అబ్జక్షనబుల్ మేటర్ పేరుతో చట్టమే తెచ్చారన్నారు. డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ , మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్ (మీసా ) వంటి చట్టాలతో ఎవరినైనా, ఎంతటి వారైనా కటకటాల్లోకి నెట్టారన్నారు. న్యాయ వ్యవస్థ హక్కులకు కూడా కోతపడిందని , విపక్ష నేతలను అరెస్టు చేయాలంటూ జారీ చేసే కార్య నిర్వాహక ఉత్తర్వులను న్యాయస్థానాలు సమీక్షించకుండా వాటి అధికారాలకు కత్తెర వేసి దుర్మార్గంగా వ్యవహరించారని పేర్కొన్నారు. జనాభా పెరుగుదల అడ్డుకట్ట వేసేందుకు దేశవ్యాప్తంగా లక్షలాదిమందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారని తెలిపారు.

అత్యాచారాలకి ఎమర్జెన్సీ కేరాఫ్ అయిందంటే అతిశయోక్తి కాదని, అత్యవసర పరిస్థితి అంటే అక్షరాలా పోలీసు రాజ్యమేన్నారు. 50 ఏళ్ల కిందట దేశంలో రాజ్యాంగ హత్య జరిగిందని, ఎమర్జెన్సీ కాలం నాటి అరాచకాలు జాబితా చిన్నదేమీ కాదని ఆయన ఈ సందర్భంగా అన్నారు. రాజ్యాంగాన్ని ఇందిరా కాంగ్రెస్ స్వార్థం కోసం వాడుకుందని, రాజ్యాంగంలో సవరణలు తీసుకువచ్చారని, లేని సెక్యులరిజంను రాజ్యాంగంలో కి చొప్పి0చారన్నారు. రాజ్యాంగాన్ని సదుద్దేశంతో వినియోగించినప్పుడే దేశానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. దేశంలో 370 ఆర్టికల్ రద్దవుతుందని ఎవరు కలలో కూడా ఉంచలేదని తెలిపారు. అలాంటిది మోడీ ప్రభుత్వం చేసిందని , ఇది గొప్ప విషయం అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, దేశానికి అవసరమైన ఎన్నో ముఖ్యమైన అంశాలు కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఇకపై ఏ ఉద్యమాన్ని చేపట్టిన తనకు బాధ్యతనిస్తే ముందుండి నడిపిస్తానని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగా డి కృష్ణారెడ్డి , మాజీ జిల్లా అధ్యక్షుడు భాస సత్యనారాయణ రావు, మాజీ మేయర్ సునీల్ రావు తదితరులు ఎమర్జెన్సీ వ్యతిరేక దినం గురించి ఈ సందర్భంగా మాట్లాడారు. సదస్సు అనంతరం ఎమర్జెన్సీ కి వ్యతిరేకంగా పోరాటం చేసి, జైలు లో గడిపిన కరీంనగర్ ప్రముఖులను సన్మానించారు.





# దుర్గంధంపై కదిలిన
# ఖమ్మం కలెక్టర్

## అధికారులు, సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే చర్యలు

- డ్రగ్స్ (మందుల) కొరత ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలి
- జనంసాక్షి కథనంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ



**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :**

మెరుగైన సేవలతో ప్రజల్లో ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, బుధవారం ఉదయం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న టాయిలెట్స్, దయాలసిస్ వార్డు, ఫార్మసీ స్టోర్, జనరల్ వార్డు, కిచెన్ లను తనిఖీ చేసి, ఆసుపత్రిలోని రోగులతో కలెక్టర్ మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పురుషుల మెడికల్ వార్డు లో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు, ఏ ఇబ్బందితో ఆసుపత్రికి వచ్చింది, డాక్టర్లు చూశారా, మందులు ఇచ్చారా, పరీక్షలు చేస్తున్నారా, నర్సులు, సిబ్బంది సేవలపై రోగులను అడిగి కలెక్టర్ ఆరా తీశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మనం మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రి ప్రాంగణం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యం అంశంలో ఎటువంటి లోటుపాట్లు ఉండటానికి వీలు లేదని, అత్యంత ప్రాధాన్యత అంశంగా పరిగణించాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి ఫార్మసీ స్టోర్ లో అన్ని రకాల డ్రగ్స్ (మందులు) అందుబాటులో ఉండాలని, ఏ డ్రగ్ స్టాక్ చివరికి వచ్చినా లేఖ రాసి వదిలేయకుండా వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలని, వైద్య శాఖ ఉన్నతాధికారులతో ఎప్పటి కప్పుడు ఫాలో అప్ అవుతూ ఆసుపత్రిలో మందుల స్టాక్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆసుపత్రిలో కిచెన్ విభాగంపై ఫిర్యాదులు రాకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచి, శుచికరమైన ఆహారం అందించాలని, ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రిలో ఉన్న ల్యాబ్ ద్వారా అవసరమైన రోగులకు రెగ్యులర్ గా నిర్ధారణ పరీక్షలు జరపాలని, పరీక్ష ఫలితాలను సకాలంలో అందించాలని అన్నారు. పరీక్షల రిజిష్టరు ను పరిశీలించి, ఏ ఏ పరీక్షలు చేపడుతున్నది, ఫలితాలు ఇస్తున్న వివరాలు పరిశీలించారు. పరీక్షల కిట్ల లభ్యతను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు ఎటువంటి పరీక్షల నిమిత్తం రాయవద్దని కలెక్టర్ తెలిపారు.

సమయపాలన పాటించాలని, అనుమతి లేకుండా గైర్హాజరు కారాదని అన్నారు. ఈ ఆకస్మిక తనిఖీ సమయంలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెం డెంట్ డా. ఎల్. కిరణ్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా. బి. కిరణ్ కుమార్, ఆర్ఎంఓ డా. రాంప్రసాద్, డా. రాంబాబు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# కార్పొరేట్ల చేతుల్లో మోడీ స్టీరింగ్

## దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ

**పెరుగుతున్న ఫాసిస్టు ధోరణులు**

**రియల్ ఎస్టేట్ గా మారిన ఫోర్త్ ఎస్టేట్**

**ఎమర్జెన్సీ నాడూ నేడు అంశంపై సీపీఐ(ఎం) సదస్సులో వక్తలు**



**హైదరాబాద్, జూన్ 25 (జనంసాక్షి) :** పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తాయనీ, ప్రస్తుతం మోడీ స్టీరింగ్ కార్పొరేట్ల చేతుల్లో ఉందని వక్తలు విమర్శించారు. 'నాడు ప్రకటిత ఎమర్జెన్సీ-నేడు అప్రకటిత ఎమర్జెన్సీ-మనకర్తవ్యాలు' అంశంపై సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ అధ్యక్షతన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఐ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ.. రాజ్యాంగం, అందులోని సూత్రాలను విస్మరించి నాడు ఎమర్జన్సీని ప్రకటించారని తెలిపారు. ఈ కార్యంలో నాటి రాష్ట్రపతి బాధ్యతగా వ్యవహరించలేదనీ, అందుకు సంబంధించిన దస్త్రంపై సంతకం పెట్టాల్సి వచ్చినందుకు రాష్ట్రపతి నిద్రమాత్రలు వేసుకుని పడుకోవాల్సి వచ్చిందని చెప్పారు. కనీసం క్యాబినెట్ కూడా సమావేశ పర్చకుండా ఆగమేఘాల మీద ఆ చర్య తీసుకోవటం సమర్థనీయం కాదన్నారు. ఇలాంటి తప్పుడు నిర్ణయాల వల్ల ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పునిచ్చారని వివరించారు. సుప్రీంకోర్టు,సీజేఐ, పార్లమెంట్, పీఎం అందరికన్నా గొప్పది రాజ్యాంగమే అన్నారు. దాన్ని బుల్డోజ్ చేస్తే ప్రజలే రాజ్యాంగాన్ని రక్షించుకుంటారని నాటి ఘటనలు చెబుతున్నాయన్నారు. ప్రశ్న అభివృద్ధికి మూలమన్నారు. నాలుగొందల సీట్లు వస్తాయని కలగన్న వారికి ప్రశ్నించే శక్తులు పెరగటం వల్ల అనుకున్న సీట్లు రాలేదని గుర్తు చేశారు. ఫోర్త్ ఎస్టేట్ గురించి గొప్పగా చెప్పుకుంటామనీ, అది రియలెస్టేట్ గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రశ్నించే ధైర్యం కావాలన్నారు. అది లేని వారు పీఎం, సీజేఐ అయినా ఉపయోగం లేదని చెప్పారు. అసమ్మతి, విమర్శించటం, విచక్షణ, వ్యతిరేకించటం సహజంగా ఉ ండాలన్నారు. ఏ పరిస్థితుల్లోనైనా వెన్నెముకతో నిలబడాలని సూచించారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ అప్పుడైనా.. ఇప్పుడైనా ప్రభుత్వాన్ని నడుపుతున్నది ప్రధానులు కాదనీ, వారు కేవలం డ్రైవర్లు మాత్రమేనని చెప్పారు. అసలైన డైరెక్టర్లు కార్పొరేట్లని ఉదాహరించారు. కారుకు డ్రైవర్ గా మోడీ ఉంటే.. దాని వెనుక సీట్లో కూర్చొని రైటా, లెప్టా ఎటు పోవాలో సూచించేది పెట్టుబడిదారులేనన్నారు. ఇప్పుడు అంతా రైటువైపే ప్రయాణం సాగుతోందని వివరించారు. ఎప్పుడూ ఇలా ఉండదని చెప్పారు. 1960లో కాంగ్రెస్ పార్టీ గుత్తాధిపత్యానికి పెద్ద దెబ్బ తగిలిందన్నారు. అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్షాల కూటములు విజయాలు సాధించాయని చెప్పారు. 1970 నాటికి తీవ్ర సంక్షోభ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. పెట్టుబడికి నష్టం వస్తుందంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని చెప్పారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి మాట్లాడుతూ.. ఎమర్జెన్సీకాలంలో ఎన్నో దారుణాలు జరిగాయన్నారు. రాజకీయ ప్రత్యర్థులను జైల్లో పెట్టటం, పత్రికలపై సెన్సార్ విధించటం, పాత్రికేయులు, కార్యకర్తలు జైళ్లపాలయ్యారని చెప్పారు. ప్రతిపక్షాలు, ప్రజా ఉద్యమాలను గొంతు నొక్కేందుకు పూనుకుందన్నారు. మోడా ప్రభుత్వం ఎమర్జెన్సీ కాలాన్ని మరిపిస్తున్నారన్నారు. నాడు మీసా ఉంటే..నేడు ఉపా చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. మహిళలపై హింస పెరిగిందనీ, దాడులు చేసిన వారికి ప్రభుత్వ పెద్దలే వత్తాసుగా ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అప్రకటిత ఎమర్జన్సీని కొనసాగిస్తున్న మోడీకి ఎమర్జన్సీ వ్యతిరేక దినంగా పాటించే నైతిక హక్కులేదని తెలిపారు.

# పెద్దధన్వాడ ఘటనలో మరికొందరు రైతులకు బెయిల్

**జైలర్ నాగరాజుకూ ముందస్తు బెయిల్ మంజూరు**

**గ్రామస్తుల్లో హర్షాతిరేకలు**




**గద్వాల నడిగడ్డ (జనంసాక్షి) :** ఇథనాల్ ఫ్యాక్టరీపై దాడి కేసులో ఏ3 నిందితుడుగా ఉన్న జైలర్ నాగరాజుతో పాటు మరికొందరు రైతులకు జిల్లా గౌరవ న్యాయస్థానం న్యాయమూర్తి ఎన్. ప్రేమలత మంగళవారం షరతులతో కూడిన ముందస్తు బెయిలు మజూరు చేశారు. గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ గ్రామంలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం నేపథ్యంలో ఆయా గ్రామస్తులకు కంపెనీ యాజమాన్యానికి మధ్య జరిగిన ఘర్షణలో ఎఫ్ఐఆర్ నమోదైన సంగతి తెలిసిందే. ఎ3 నిందితునిగా అదే గ్రామానికి చెందిన జైలర్ నాగరాజు పేరును కూడా పోలీసులు చేర్చారు. కాగా ఈనెల 4న జరిగిన ఘర్షణలో తాను లేనని, తనకు ఆరోపిత దాడికి సంబంధం లేదని, సంఘటనకు ముందు రోజు సంఘటన జరిగిన రోజు తాను నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో జైలు సూపరిన్డెంట్ గా విధి నిర్వహణలో ఉన్న విషయాన్ని తన న్యాయవాది మధుసూదన్ బాబు కోర్టుకు బెయిల్ పిటిషన్ ద్వారా దఖలుపరిచారు. నిందితుడు నాగరాజుకు ఈ నేరానికి ఎలాంటి సంబందం లేదని నేర స్థలంలో నాగరాజు లేడని, పైగా ఆయన క్రమం తప్పకుండా విధి నిర్వహణలో ఉన్నాడని ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని గౌరవ జిల్లా న్యాయస్థానాన్ని మధుసూదన్ బాబు కోరారు. కాగా, ప్రభుత్వ న్యాయవాది జె.వినోదా చారి జైలర్ నాగరాజు ఏ3 తన గ్రామ ప్రజలను రెచ్చగొట్టడానికి ప్రయంతించాడని, ఇంకా దర్యాప్తు పూర్తి కాలేదని ముందస్తు బెయిలు మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని తన వాదన వినిపించారు. వాదోప వాదనలు విన్న కోర్టు జైలర్ నాగరాజుకు షరతులతో కూడిన ముందస్తు బెయిలు మంజూరు చేసింది. నాగరాజుతో పాటు మరో 12 మంది పెద్ద దన్వాడ గ్రామ ప్రజలకు గౌరవ న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఇప్పటి దాకా 25 మందికి కోర్టు బెయిల్ మంజూరు చేసినట్లయ్యింది. నాగరాజుతో పాటు మరి కొంతమందికి ముందస్తు బెయిల్ మంజూరు కావడంతో గ్రామ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

# లాల్ దర్వాజ బోనాల ఉత్సవాలకు రండి

**టీపీసీసీ అధ్యక్షులు మహేష్కుమార్ గౌడ్కు శ్రీమహంకాళి దేవాలయ కమిటీ ఆహ్వానం**



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** దేశ రాజధాని ఢిల్లీ తెలంగాణ భవన్లో ఈ నెల 30, జులై 1,2 తేదీల మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న లాల్ దర్వాజా బోనాల ఉత్సవాలకు రావాలని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయం కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు.బుధవారం గాంధీ భవన్ లో మహేష్ కుమార్ గౌడ్ ను ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు కె.విష్ణు గౌడ్, కె.వెంకటేష్,సాంస్కృతిక కార్యదర్శి ఎ. వినోద్ కుమార్, గడ్డం రవి,కాంగ్రెస్ నేత డి,ఎల్.నర్సింగ్ గౌడ్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి ఆహ్వాన పత్రిక ను అందజేశారు. ఢిల్లీలో గత పది సంవత్సరాల నుండి తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆయనకు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలియజేశారు.వీలును బట్టి ఉత్సవాలలో పాల్గొంటానని మహేష్ కుమార్ ఆలయ కమిటీ ప్రతినిధులకు హామీని ఇచ్చారు.

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాలు ప్రతీక

**ఉత్సవాలతో రాష్ట్రంలో పండుగ వాతావరణం**

**రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు**



**హైదరాబాద్(జనంసాక్షి):** బోనాల ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆషాడ మాసం బోనాల ఉత్సవాలతో రాష్ట్రంలో పండుగ వాతావరణం మొదలవుతుందన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాక్షించారు. చారిత్రాత్మక గోల్కొండలో వెలసిన జగదాంబిక ఎల్లమ్మ తల్లికి ఆషాడ మాసం తొలి బోనం సమర్పించడంతో జంటనగరాల్లో బోనాల సందడి నెలకొంటుందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు సుఖ శాంతులతో, ఆయురోగ్యాలతో జీవించాలని రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించే దిశగా తల్లి దీవెనలు ఉండాలని సిఎం ఆకాంక్షించారు. జంట నగరాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు బోనాల ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల సదుపాయాల కోసం 20 కోట్ల నిధులు విడుదల చేశామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# బోనాల ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.20కోట్లు

**నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం**

**హైదరాబాద్(జనంసాక్షి):** జంటనగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని 2,783 ఆలయాలకు వివిధ కార్యక్రమాలు నిర్వహణ కోసం నిధులను చెక్కుల రూపంలో జారీ చేసిందన్నారు.ఆషాఢ మాసంలో ముందుగా నగరంలోని గోల్కొండ బోనాలు జూన్ 29న జుల్కై 1, 2 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ బోనాలు, జుల్కై 13, 14 తేదీల్లో శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవస్థానం బోనాలు, జుల్కై 20న లాల్ దర్వాజా బోనాలు.. జుల్కై 23న చార్మినార్ భాగ్యలక్ష్మి బోనాలు, మిగిలిన దేవాలయాల్లో ఈ ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు.


# తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు

**గత ప్రభుత్వం 10 సంవత్సరాలతో పోలిస్తే ఎక్కువ నిధులు, తక్కువ రోజుల్లో పంపిణీ**

**ఎన్నికల ముందు యాసంగి నిధులు వేయని గత ప్రభుత్వం**

**చిద్రమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**





మిగులు బడ్జెట్ తో ప్రభుత్వాన్ని అప్పగిస్తే గత ప్రభుత్వ పెద్దలు వారు చెప్పిన రైతు బంధు నిధులను ఏనాడు సక్రమంగా పంపిణీ చేయలేదు. మిగులు బడ్జెట్ ఉన్నప్పటికీ రైతుబంధు నిధుల మొత్తం తక్కువే అయినా పంపిణీకి ఒక్కో సీజన్లో 169 రోజులు సుమారు ఐదున్నర నెలలు పాటు సమయం తీసుకున్నారు. అదే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి ఎనిమిది లక్షల కోట్ల లోటు బడ్జెట్. రైతు భరోసా కింద గత ప్రభుత్వంతో పోలిస్తే ఎకరాకు 2,000 అదనంగా కలిపి 12,000 ఇవ్వాల్సిన సందర్భం. చిద్రమైన ఆర్థిక వ్యవస్థను స్వల్ప సమయంలోనే గాడిలో పెట్టిన డిప్యూటీ సీఎం, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క తక్కువ సమయంలోనే, పెద్ద మొత్తంలో రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. కేవలం తొమ్మిది రోజుల్లో 8,744.13 కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమచేసి దేశ చరిత్రలోనే ఓ రికార్డు సృష్టించారు.

గత ప్రభుత్వం ఎన్నికల ముందు వేయాల్సిన రైతు భరోసా నిధులను వేయకుండా వెళ్ళిపోగా రైతుల పట్ల బాధ్యత, ప్రేమ కలిగిన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారు వదిలేసిన యాసంగి కాలం 7,625 కోట్ల నిధులు రైతుల ఖాతాలో జమ చేశారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో పెట్టుబడి సాయంగా అందించిన నిధులు, సమయం తో ప్రజా ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా నిధుల మొత్తం, తీసుకున్న సమయాన్ని పోలిస్తే రైతుల పట్ల ఎవరికి బాధ్యత, ప్రేమ ఉన్నాయో స్పష్టం అవుతుంది.

2018 - 19 వానాకాలం సీజన్కు 10-05- 2018 లో రైతుల కు పెట్టుబడి సాయం వేయడం ప్రారంభించి 15-09-2018 నాటికి పూర్తి చేశారు. 128 రోజులపాటు సమయం తీసుకొని 5,237.56 కోట్ల నిధులు ఆ సీజన్లో జమ చేశారు.

- 2018-19 యాసంగి సీజన్ కు సంబంధించి 20-10-2018లో వేయడం ప్రారంభించి 30-03-2019 నాటికి పూర్తి చేశారు. 161 రోజుల పాటు సమయం తీసుకుని 5,248.80 కోట్ల నిధులు జమ చేశారు.
- 2019-20 వానకాలానికి సంబంధించి 04-06-2019 లో రైతుబంధు నిధులు వేయడం ప్రారంభించి 14-10-2019 నాటికి పూర్తి చేశారు. 132 రోజుల సమయం తీసుకుని 6,125.54 కోట్ల నిధులు జమ చేశారు.
- 2019 -20 యాసంగి కాలానికి సంబంధించిన రైతుబంధు నిధులను 28-1-2020 ప్రారంభించి 16-3-2020కి పూర్తి చేశారు. 48 రోజుల్లో 4406.48 కోట్ల నిధులను విడుదల చేశారు.
- 2020-21 వాన కాలానికి సంబంధించిన రైతుబంధు నిధులను 22-6-2020 న ప్రారంభించి 8- 12- 2020 న పూర్తి చేశారు. 169 రోజుల్లో 7288.70 కోట్ల నిధులను విడుదల చేశారు.
- 2020-21 యాసంగి కాలానికి సంబంధించి 28-12-2020న ప్రారంభించి 22-3-2021కి పూర్తి చేశారు. 84 రోజుల్లో 7367.32 కోట్ల నిధులను విడుదల చేశారు
- 2021-22 వానాకాలంకి సంబంధించిన రైతుబంధు నిధులను 15-6-2021న ప్రారంభించి 25-6-2021న పూర్తి చేశారు. పది రోజుల్లో 7360.41 కోట్ల నిధులు విడుదల చేశారు
- 2021-22 యాసంగి పంటలకు సంబంధించి 24- 12- 2021న ప్రారంభించి 20-01-2022న పూర్తి చేశారు. 27 రోజుల్లో 7412.53 కోట్ల నిధులను విడుదల చేశారు.
- 2022- 23 వానకాలానికి సంబంధించిన రైతుబంధు నిధులను 28- 6- 2022న ప్రారంభించి 5-9-2022న పూర్తి చేశారు. 69 రోజుల్లో 7 7434.67 కోట్ల నిధులు విడుదల చేశారు.
- 2022-23 యాసంగి కాలానికి సంబంధించిన నిధులను 21- 12- 2022 న ప్రారంభించి 18- 5- 2023 న పూర్తి చేశారు. 148 రోజుల్లో 7308.35 కోట్ల నిధులు విడుదల చేశారు.
- 2023- 24 వానాకాలానికి సంబంధించిన రైతుబంధు నిధులను 26-6- 2023 న ప్రారంభించి 12- 10- 2023కు పూర్తి చేశారు. 108 రోజుల్లో 7637.91 కోట్ల నిధులు విడుదల చేశారు.

ప్రజా ప్రభుత్వం పాలనాపగ్గాలు చేపట్టగానే గత ప్రభుత్వ పెద్దలు ఎన్నికల ముందు వేయకుండా వెళ్లిపోయిన రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించారు. అధికారంలోకి వచ్చిన నాలుగు రోజుల్లోనే రైతు భరోసా నిధులు జమ చేయడం ప్రజా ప్రభుత్వం నిబద్ధతను తెలియజేస్తుంది.

- 2023-24 యాసంగి కాలానికి సంబంధించిన 11- 12- 2023 న ప్రారంభించి 6- 5- 2024న పూర్తి చేశారు. 147 రోజుల్లో 7625.14 కోట్ల నిధులు విడుదల చేశారు.
- 2024-25 యాసంగి కాలానికి సంబంధించిన రైతు భరోసా నిధులను 26-1- 2025న ప్రారంభించి 02-04- 2025 పూర్తి చేశారు. 87 రోజుల్లో 5057.77 కోట్ల నిధులు జమ చేశారు.
- 2025- 26 వానా కాలానికి సంబంధించిన రైతు భరోసా నిధులను 16-6-2025న ప్రారంభించి 24-06-2025కి పూర్తి చేశారు. కేవలం తొమ్మిది రోజుల్లో 8744.13 కోట్ల రూపాయల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు.

# తేజేశ్వర్ కేసులో ప్రధాన నిందితుడు అరెస్టు

**హైదరాబాద్, జూన్ 25 (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో ట్విస్టుల మీద ట్విస్టులు, ఊహించని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే ఈ కేసులో ప్రధాని నిందితుడైన బ్యాంక్ మేనేజర్ తిరుమలరావును పోలీసులు బుధవారం శంషాబాద్ ఎయిర్ఫోర్ట్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. గద్వేల్కు చెందిన సర్వేయర్ తేజేశ్వర్ను పెళ్లైన నెల రోజులలోపే భార్య ఏకంగా ఐదు సార్లు హత్య చేసేందుకు ప్రయత్నించింది. ఫైనల్గా ఆరోసారి ఆమె అనుకున్నది సాధించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన తేజేశ్వర్ భార్య ఐశ్వర్య.. నెల రోజుల క్రితం తేజేశ్వర్ను ప్రేమ వివాహం చేసుకుంది. కానీ, అంతకంటే ముందు ఐశ్వర్యకు కర్నూల్లోని ఓ బ్యాంక్లో మేనేజర్గా పనిచేస్తున్న తిరుమలరావు అనే వ్యక్తితో సంబంధం ఉంది. తిరుమలరావు పనిచేసే బ్యాంక్లో ఐశ్వర్య తల్లి పనిచేసేది. ఈ క్రమంలోనే ఆమెకు, బ్యాంక్ మేనేజర్ తిరుమలరావుకు శారీరక సంబంధం ఏర్పడింది. ఆ తర్వాత తిరుమలరావుకు ఐశ్వర్యతో కూడా పరిచయం అయింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. తిరుమలరావుకి అప్పటికే వివాహం అయినా అతనికి పిల్లలు లేరు. దీంతో.. ఐశ్వర్యను రెండో వివాహం చేసుకోవాలని తిరుమలరావు భావించాడు. అందుకే ఐశ్వర్య కూడా ఒప్పుకుంది. ఇలా ఏకకాలంలో తల్లీ కూతుళ్లతో తిరుమలరావు సంబంధం కొనసాగించాడు. కానీ, గద్వేల్కు చెందిన సర్వేయర్ తేజేశ్వర్ను ఐశ్వర్య పెళ్లి చేసుకుంది. కానీ పెళ్లైన కొన్ని రోజులకే తిరుమలరావుతో ఐశ్వర్య మళ్లీ టచ్లోకి వెళ్లింది. ఎలాగైనా తేజేశ్వర్ను వదిలించుకొని నీతో వచ్చేస్తానంటూ అతనికి చెప్పింది. దీంతో తిరుమలరావు, ఐశ్వర్య కలిసి తేజేశ్వర్ హత్యకు ప్లాన్ వేశారు. తిరుమలరావు తేజేశ్వర్ను హత్య చేసేందుకు కొంత మందికి 75 వేల సుపారీ ఇచ్చాడు. అతడి వద్ద డబ్బు తీసుకున్నవారిలో ప్రధాన నిందితుడైన మనోజ్ అనే వ్యక్తి. తేజేశ్వర్ సర్వేయర్ కావడంతో సర్వే పేరుతో అతణ్ని బయటకు తీసుకెళ్లాడు. ఈనెల 17న తేజేశ్వర్ ను ల్యాండ్ సర్వే పేరుతో నగేష్, పరశురాం, రాజు అనే ముగ్గురు వ్యక్తులు ఇంట్లోంచి బయటకు పిలిచారు. కారులో ఎక్కించుకొని తీసుకెళ్లారు. ముందు సీట్లో కూర్చున్న తేజేశ్వర్ మెడ పట్టుకొని రాజు, పరశురామ్ కత్తితో పొడిచారని తెలిపారు పోలీసులు. ఆ తరువాత డ్రైవర్ సీట్లో ఉన్న నగేష్ తేజేశ్వర్ కడుపులో కత్తితో పొడిచాడన్నారు. చనిపోయిన తరువాత కర్నూలు శివారులో మృతదేహాన్ని పడేశారు. డెడ్బాడీని చూసిన తరువాత సుపారీ బ్యాచ్ కి రూ.2లక్షలు ఇచ్చాడు తిరుమలరావు. మర్డర్కు ముందు బ్యాంక్ నుంచి తిరుమలరావు రూ.20 లక్షల లోన్ తీసుకున్నాడు. ఆ హత్య తరువాత ఐశ్వర్యతో కలిసి లడఖ్ వెళ్లేందుకు తిరుమలరావు ప్లాన్ వేసుకున్నాడు. అయితే తేజేశ్వర్ కనిపించడం లేదంటూ అతని తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని.. తేజేశ్వర్ ఫోన్ లోకేషన్ ఆధారంగా గద్వేల్ పోలీసులు కర్నూల్కు వెళ్లి ఓ చెరువు వద్ద తేజేశ్వర్ మృతదేహాన్ని కనిపెట్టారు. మృతదేహంపై అమ్మ అనే పచ్చబొట్టు ఆధారంగా అది తేజేశ్వర్ మృతదేహంగా నిర్ధారించారు.

# హైకోర్టు తీర్పు మేరకు స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

**ఇంతకాలం ఎన్నికలు దాటవేయడం సరికాదు**

**బిజెపి ఎంపి డాక్టర్ లక్ష్మణ్ డిమాండ్**



**న్యూఢిల్లీ, జూన్25 (జనంసాక్షి) :** తెలంగాణ హైకోర్టు తీర్పు మేరకు స్థానిక సంస్థల ఎన్నికలను రేవంత్ ప్రభుత్వం నిర్వహించాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30వ తేదీలోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టకుండా రేవంత్ సర్కార్ చోద్యం చూస్తోందని విమర్శించారు. బుధవారం ఢిల్లీ వేదికగా మీడియాతో బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడారు. సర్పంచ్ల బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో సర్పంచ్లు అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేశారని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్రెడ్డి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, తప్పించుకోవద్దని అన్నారు. పార్టీల పరంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రేవంత్రెడ్డి అనడం బీసీలను మోసం చేయడమేనని విమర్శించారు. కులగణన పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. తూతూమంత్రంగా బీసీ కులగణన చేశారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 2 వేల కోట్ల నిధులు ఆగిపోయాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. 42 శాతం రిజర్వేషన్లపై రేవంత్రెడ్డి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. తెలంగాణ కులగణనలో 90 శాతం ముస్లింలను బీసీల్లో చేర్చి, నిజమైన బీసీలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం భూములు అమ్మకుండా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల భూములను వెనక్కి అడుగుతున్న తెలంగాణ ప్రభుత్వం వాటిని అమ్మాలని భావిస్తుందా అని నిలదీశారు. ముందుగా తెలంగాణ ప్రభుత్వం భూముల అమ్మకాన్ని మానుకోవాలని హితవు పలికారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370